



V. JOGA ROW.

RANGANAYAKAMMA.

MARRIED.

13th June 1919.

ఆంధ్రీకృతాభిజ్ఞాన శాకుంతలము.

ఏడంకముల నాటకము.

ఇది

మహాకవి కాళిదాసకృతమగు

సంస్కృతమునుండి

రాజా మంత్రిప్రెగడ భుజంగరావు బహదూర్

జమీందారుచే

తెనిఁగింపఁబడినది.


మొదటికూర్పు 500.

రామా ముద్రాక్షరశాల,

ఏలూరు.

1919.

 [వెల. రు 0—12—0



రాజా యం. భుజంగరావు బహద్దరు జమీందారు.

పీఠిక.

దోషజ్ఞులారా!

మహాకవి కాళిదాసకృతియగు నీయభిజ్ఞానశాకుంతలము పెక్కురచే నాంధ్రీకరింపఁబడి యున్నను నీనవ్య దేశకాలార్హంబునకై కడంగుట దర్పితధర్మంబని పండితులెవరుం గొండుకఁ దోలుపఁగలదు. అయినను, ఖ్యాతిగల బహుగ్రంథములు లోకమునఁ జేర్పఁబడి నప్పుడే విచక్షణులు వాని గుణాగుణంబులఁ బరిశీలించి యుత్తమగ్రంథమును నిర్ధారణచేయుటకుఁ గలిగినంత వీలు, ఒకటి రెండు గ్రంథములు మాత్రమే సమాకీర్ణమయినపుడు చిక్కనేరదు. అట్టియుద్దేశముతో నీనవ్యప్రయత్నంబునకుం గడంగితిని గాని జరిత్రచర్యగ ప్రాయముకాదని నాయభిప్రాయము. మఱియు నీయభిజ్ఞానమిత వృత్తకల్పనమునందును, ప్రత్యక్షరసాస్వాదమునను నప్రమేయమని బహుపండితులచే నామోదింపఁబడియుండ మహారాజశ్రీ బ్రహ్మశ్రీ జయంతి రామయ్యపంతులవారు తమ యాంధ్రసాహిత్య పరిషత్పత్రికయొక్క 7 వ సంపుటము, 5 వ సంచికయందలి 353 వ పుట మొదలు 363 వ పుటవఱకు నస్మత్కృతోత్తర రామచరిత్రాంధ్రీకరణమును విమర్శించుచోడఁ బ్రాసంగికముగా నభిజ్ఞానశాకుంతలముయొక్క యితివృత్తకల్పనము నధిక్షేపించుచు,

“శకుంతలాపరిత్యాగమునకుఁ గాళిదాసుఁడు కల్పించిన యుక్తి కంటె నిది యే (సీతాపరిత్యాగోపపత్తియే) బాగుగనున్నదని నాయభిప్రాయము......కాళిదాసుఁడీకథను (భారతకథను) మార్చి గర్భిణిగానున్నపుడే శకుంతల దుష్యంతుని యొద్దికి వచ్చెననియు, నామెకు సాయముగాఁ గణ్వునిచేఁ బంపఁబడిన కణ్వశిష్యులును, గౌతమియును వృద్ధతాపసియుఁగూడ వచ్చిరనియు, వీరందఱు కొన్నివిధములఁ జెప్పినను గణ్వుని సందేశముఁ బ్రకటించినను గూడ దుష్యంతుఁడు శకుంతలను దాఁ జూడఁ గననియే పలికి విడలఁగొట్టెననియుఁ జెప్పి గాంధర్వ వివాహము దుష్యంతుఁడు మఱచిపోవుటకు దుర్వాసు శాపమను నొక యుపపత్తి గల్పించెను. ఇది లోకానుభవమునకును, గావ్యసరణికిని విరుద్ధమని నాయభిప్రాయము. గాంధర్వవిధిచే శకుంతలను దానుగూడిన కొద్దికాలములో యీసమాగమమును మఱచిపోవుట యసంభవము. శకుంతల చేతను, గణ్వునిచేతను బోధింపఁబడియుఁగూడఁ గణ్వాశ్రమమున జరిగిన వృత్తాంతమును బొత్తిగా మఱచిపోవుట మిక్కిలి యసంభవము. దుష్యంతుఁడు నిజముగా నీవృత్తాంతమును మఱచుటయే సత్యమయినయెడల నతనియందుఁ బ్రమాదము నారోపింపవలసి యుండును. ఆరోపించినయెడల నాతఁడు ధీరోదాత్తనాయకుఁడు కాఁజాలఁడు. దీనికొఱకును దుర్వాసునిశాపము తగినకారణము కానేరదు. లోకానుభవమునకు విరుద్ధమయిన యమానుషచర్యల నుపపత్తిగాఁ గొనుట, వైదేశిక ప్రకారము

పురాణమార్గానుసారమైన నైయుండవచ్చునుగాని కావ్య రీతికి సరిపడదు. కావ్యము నందలి కథాసన్నివేశము యుక్తి యుక్తముగను లోకానుభవమున కవిరుద్ధముగ నుండవలయును."

అను వీరి వ్యాసమున రెండు విషయములు శోచనీయములై యున్నవి. అందు మొదటిది ప్రాచీన మహాపండిత మండలిచే మహాకవియని కీర్తింపఁబడిన కాళిదాసు తన గ్రంథమున యుక్తాయుక్తములను పరిశీలింపలేక పోయెనని యనుట. రెండవది 'శ్లో॥ యద్దుష్కరం యద్దురాపం యద్దుర్గం యచ్చ దుష్కరం । తత్సర్వం తపసా సాధ్యం తపోహి దురతిక్రమం' అని యావర్ణనీయ మహిమతో వర్ణింపఁబడిన మహాతపంబే ధనంబుగాఁగల మునీంద్రుల వాక్యములయందు విశ్వాసత నాపాదించుట యై యున్నది. మఱియు, నీ విమర్శకులచే సమాజసంకల్పనా ధురంధరుఁడని బిరుదము నొసఁగిన భవభూతి మహాకవియుఁ దన యుత్తరరామచరిత్రమున 'శ్లో॥ లౌకికానాం హి సాధూనా మర్థం వాగనువర్తతే । ఋషీణాం పునరాద్యానాం వాచమర్థో నుధావతి' అనియు, "శ్లో॥ ఆవిర్భూతజ్యోతిషాం బ్రాహ్మణానాం యేవ్యాహారా స్తేషుమా సంశయోభూత్ । భద్రా హ్యేషాం వాచి లక్ష్మీర్నిషక్తా నైతేవాచం విప్లుతాం వ్యాహరన్తి' అనియు మహర్షి వాక్యము లమోఘములుగా నిరూపించి యున్నాఁడు. ఈ విమర్శకులచే 'లోకానుభవమునకు విరుద్ధమైన యమానుషచర్యల నుపపత్తిగాఁ గొనుట కావ్యరీతికి సరిపడదు.' అని గర్హింపఁబడిన యమానుషచర్యను (సీత యొక్క యంతర్ధానమును) భవభూతి మహాకవి రామాయణానుసరణముగా దన నాటకమున వర్ణించియున్నాఁడు. ఇట్టి విషయముల మహాకవులందఱుచే స్థిరబుద్ధితో ఋషిదేవతాదుల వాక్యములయందు నిర్ణయింపఁబడిన యమోఘత్వము నవీన విమర్శకుల దృష్టికి గోచరమునకు రాకపోవుట మిక్కిలి యక్కజము.

ఈ యాంధ్రీకరణమునకు మూలకర్తయగు కాళిదాసునందు మన విమర్శకు లారోపించిన దోషమును సమాధానపఱచి, అభిప్రాయమునకే వీరు ప్రకటించియున్న యుత్తరరామచరిత్రయందలి దోషములకుఁ గూడ సమాధానమిందే పొందుపఱచు చుంటిని.

(1) "అర్ధరాత్రిలో సంకల్పించి" అనుటకు మాఱుగ, "అని సగముదల్చి" అనియు, "వశితు రాలైతిని" అనుటకు మాఱుగ "నా మొదలం జవరాలు చున్న" దనియు, "దర్శనీయము పెట్టఁగల" దనుటకు మాఱుగ, "చూడ వలసిన చింతను జాలఁగల" దనియు, నిట్టి దిద్దుబాటులయందు మాఱుపాటుగ నులకు మాఱు పదములను సూచించిరి.

శబ్దార్థవిశ్వాసముల యందు నిర్దిష్టమయిన లోపమును ప్రదర్శింపక తాము కల్పనములఁ జేయుచున్నదో విని కొంతకాలము వఱకైన నవధిగాన్పించెను. కావున

[illegible]స్తావనము లేనియట్టి విమర్శనమొనరించినారు. "[illegible]" [illegible] దుడై యుండును. దీనినర్థాంతరము మెప్పటికో తెలియఁజాలను.

మా విమర్శకులు తాము వ్రాయదలంచిన విమర్శనమునకే "గ్రథిత మంత్రై—శ్లోకార్ధసన్నివేశము—ద్యోతితమనుచున్నది—సీతావిభావనము—అనుష్టించ వాంఛితమ్మున్—ధర్మ్యదైన్యవిన్యాసము—ప్రవృత్తిమార్గము—సోపత్తికము—వ్యాసయోంగము—మాత్సృక—మున్నగు క్లిష్టపదప్రయోగములు ఛందోనియమబాధకములేని సమయమునందే కావించిరి. మా గ్రంథమునందలి యర్థోక్తి యను పదమునకే 'సగము పలుకు' అని తెలిగించుట సరసమగుచో విమర్శకుల "శ్లోకార్ధసన్నివేశము, ధర్మ్యదైన్యవిన్యాసము" మున్నగు ప్రయోగములెట్లుగా సాధువులగునో పాఠకులే యూహింతురు గాక!

(2) "సుశ్లిష్టమేతత్" అను వాక్యమునకు "వర్ణనీయమిది" యని తెనిగించితి మనియు, "ఆర్యేణాస్మిన్" అను పదములను విడిచితి మనియు విమర్శకు లభిప్రాయపడిరి.

"సుశ్లిష్టమేతత్" అను వాక్యమునకు "ద్రష్టవ్యమేతత్" అనియు, "ఆర్యేణాస్మిన్" అనుటకు "వత్సైతస్మాత్" అనియుఁ గల పాఠాంతరముల ననుసరించి మా యాంధ్రీకరించిన విషయమును విమర్శకులెఱుంగక దోషారోపణముఁ గావించుట పొరపాటుమాత్రమై యున్నది.

"విగమవిగమ" అను నిశ్చేతనవచనముతో వాక్యమును బ్రారంభించిన తొందర పాటుమాత్రమే యుండునని విమర్శకులూహించి [illegible] నుపహసించిరి. కాని యేదేని మహోపద్రవము రాఁదలంచినప్పుడు దాని [illegible] గా నివారించు వేళనఁగా 'వద్దు వద్దు [illegible]" అనియో [illegible] లాగున నాశ్రమమ్మునకు [illegible] మొదలు సందర్భమున [illegible] వాగర్థము 'వద్దు వద్దు' అనునిశ్చేతనవచనమౌనని మనకెల్లరకును తెలియకయున్నది. ప్రస్తుతము చిత్రపటమునందలి రాముని దుఃఖావస్థను సీత ప్రకటించుటచే రాముఁడు దుఃఖితమ్మ [illegible] లక్ష్మణుఁడు [illegible] సీత వలనే తనదుఃఖావస్థనే వర్ణించునని యెంచి "వత్సైతస్మాద్విగమవిగమ" అని లక్ష్మణుని వారించినాఁడు. ఇది దుఃఖావస్థయగుటచే సర్వథా [illegible] యసంభవము.

(3) "జనకరఘురాజకులములు" అను పద్యములో వాక్యద్వయమునకుఁ గార్యకారణభావము స్పష్టపడుట లేదని విమర్శకులు తలంచిరి.

ఇది మహావిషయముగాఁ గార్యకారణభావ మీ వాక్యద్వయమునకు లేకపోయినను ఉత్తరవాక్యము కేవల పాదపూరణార్థమై విలసిల్లునుగాని పూర్వవాక్యముతో సంబద

వ్యక్తపరచదు. అర్థ సామర్థ్యము నబట్టియే పూర్వవాక్యమున కుత్తరవాక్యము హేతువై దీపించుచున్నది. దీనినే యాలంకారికులు కావ్యలింగాలంకారముగా వర్ణించుచున్నారు.

(4) "కరుణన్ ద్రిమ్మరి సాధ్వియు
పరగున జనకసుతయైన జనరంజనమున్
వరవంగ విడిచెదు నాకున్
దొరకొన దోడ్కొంతయైన దుఃఖము మదిలోన్"

అనుపద్యమున 'జనకసుతయైన' అనుపదము కరుణాదుల కన్న సీతా పరిత్యాగము సులభమను నర్థమును బోధించుచున్నదని విమర్శకులాక్షేపించిరి.

సీతాపరిత్యాగ దుష్కరత్వము విషయమై మూలమునందు ప్రయోగించిన 'యది వా' అనుదానికి 'జనకసుతయైన' అని తెలుఁగున వ్రాయఁబడినది. సీతయైన విడుతునను నప్పుడు, సీతాపరిత్యాగము దుష్కరమనియును నర్థము వచ్చుచున్నదిగాని త్యాగప్రాయముగా విడుతునని యర్థము కాదు. ఉదా:— "ప్రాణములైన నీకర్పింతును." అనువాక్యమున నీప్రాణసమర్పణము దుష్కరత్వమును దెలుపుచున్నదో, సౌకర్యమును దెలుపుచున్నదో విమర్శకు తెలియఁగుదురుగాక! మఱియు 'విడిచెదునాకున్' అనుచో 'విడిచెదు' అనునది మూలపాఠానుసారమున వర్తమానముగాక భవిష్యదర్థకముగా దద్ధర్మమును వాడితిమని విమర్శకులు భ్రాంతి నొందిరి. కాని వ్యాకరణ నియమముచే 'విడిచెదు' అనునది లాట్టుయొక్క రూపమై యున్నది. ఇది తద్ధర్మ, తచ్ఛీల సంభావనా, సంప్రశ్న, సాతత్య, వర్తమాన, భావి, అతీతాదులం బ్రయుక్తంబగును. కావున మేము వర్తమానార్థకముగానే వాడితిమి. ఈవిషయమును మన విమర్శకులు బాల వ్యాకరణ సాహాయ్యముచే తెలియఁగుదురుగాక!

"చక్కని తేట తెనుఁగు మాటలతో నాంధ్రభాషా సాంప్రదాయమునకు భంగము కలుగకుండునట్లును, సంస్కృత మంతగా తెలియని తెనుఁగు వారలకు హృద్యముగా నుండునట్లును, శ్రీనాథాదులు నైషధాది గ్రంథములనాంధ్రీకరించిరనియు, అధునికులు వారిమార్గము ననుసరింపక సంస్కృత శైలి ననుసరించి యాంధ్ర భాషా సాంప్రదాయమునకు విరుద్ధముగా నాంధ్రీకరించిరనియు, మాయాంధ్రీకరణ మీద్వితీయ గణంబులోఁ జేరినదనియు" వర్ణించియున్నారు.

శ్రీనాథాదుల నైషధాది గ్రంథములకంటె మాయాంధ్రీకరణ మెంతకఠినముగా నున్నదో రసజ్ఞులు తెలియఁగుదురుగాక!

శ్రీ తిరుమల రామచంద్రయొక్క యుపోద్ఘాతంబున మాచే నిరూపింపఁబడిన ధర్మశ్రేయములో స్వస్తికర్త స్వస్తివిషయముల గమనింపవలసిన ధర్మములెన్ని? "యీశ్వరేచ్ఛాపరమంత స్వతంత్రముగా లేదనియు ఈశ్వర ధర్మమును నిరూపించుటకు జీవునకధికారము లేదనియు మనవిమర్శకులు వ్రాసియున్నారు. భగవద్గీతయందు "ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అనియేకదా కారణంబున ధర్మగ్లాని కలిగినప్పుడు పరమేశ్వరుండనైన నేను ధర్మసంస్థాపనకు గాను ప్రతియుగంబునం బుట్టుచుందునని శ్రీకృష్ణభగవానుఁడానతిచ్చినటుల వ్యాసులవారు నిరూపించియున్నారు. ఈశ్వరధర్మమును నిరూపించుటకు జీవునకధికారము లేనిచో వ్యాసాదులిట్టి యాస్తిక్యమున బ్రహ్మసూత్రాద్యనేక గ్రంథముల నేలరచియించిరో నిరాలంబమగును. వారు తమ గ్రంథములయందు భగవద్ధర్మములను నిరూపించనిచో బుక్కిటి పురాణములగును. నిరూపించుట బట్టియే యుపనిషద్ధృదయంబున కవిరుద్ధములైన మతగ్రంథములై నేఁటి వఱకుఁ జిరాయువుం గాంచియున్నవి. మఱియు «మనము సమర్థింపఁజాలని కార్యములన్నియు నీశ్వరేచ్ఛను పాదముగా జరిగినవని చెప్పి తప్పించుకొనఁ జూచుట పరసముకా" యని వ్రాసియున్నారు. ఈశ్వరేచ్ఛకు వ్యతిరేకముగా జీవుఁడు కార్యసాధన మొనర్ప దక్షుఁడైనచో మనము ఫలాభిలాషతోఁ జేయఁబూని యున్న సర్వకార్యములను సుముఖముగా ఫలించుచునే యుండవలెను. అప్పటప్పటం గానఁబడు జీవానుభూత విఘాతములంబట్టి యీశ్వరానుకూల్యముగల కార్యములు ఫలించుచున్నవనియు, ఈశ్వర ప్రాతికూల్యముగల కార్యములు నశించుచున్నవనియు సర్వధర్మవజ్ఞుల యభిప్రాయమై యున్నది. కాని జీవునకందును స్వాతంత్ర్యము చెప్పఁబడి యుండలేదు. మఱియు—

> " అవిదితమగు నీశ్వరేచ్ఛను బురస్కరించుకొని సమర్థించుట ప్రవృత్తిమార్గమును, బురాణమార్గమునై యుండునుగాని కావ్యమార్గము కాదు. యుక్తియుక్తమును, లోకానుభవాను గుణమైనఁగాని శోభింపదు." అని విమర్శకులు వ్రాసియున్నారు.

ఇట్టి విషయములు, అనేక మహాకవులచే వర్ణింపఁబడియున్న పౌరాణిక కావ్యములయందు నిరూపింపఁబడి యున్నవి. గ్రంథ విస్తర భీతిచే స్థాలీపులాక న్యాయమునఁ గొన్నిటిని మాత్రమిందుఁ బ్రదర్శించుచున్నాఁడను. (1) క్షేమీశ్వరకృత చండకౌశిక నాటకమున ధర్మదేవతావరమున సర్పదష్టుఁడై మృతినొందిన లోహితాశ్వుఁడు జీవించుట, (2) భట్టమురారి ప్రణీతమయిన యనర్ఘరాఘవంబున దశకంఠుఁడు దేవేంద్రునకును యుద్ధసాహాయ్యమొనర్చినవియు, (3) కాళిదాసకృతియగు విక్రమోర్వశీయంబున నూర్వశికి భరతముని శాపమును, (4) శ్రీహర్షకృతమగు నాగానంద నాటకమున గరుత్మంతునిచే జంపఁబడిన జీమూతవాహనుఁడు గౌరీవరప్రసాదంబున జీవించుట

ము. (5). భరతభూమి కృతకము ఈ శ్రీరామచరిత్రమున ఆంధ్రశాస్త్రముల సంభాషించుటయు, కోలలు జలమధ్యమున జన్మించుటయు, శీతకాలంబున నిష్ఠసేయుటయు, గంగాభాగీరథులు, వన దేవత, తమసు, మురళి, మొదలగు వారిస్వరూపాంతర ధారణంబును, (6) ప్రస్తుత శాకుంతలంబున శకుంతలాంతర్ధానంబును, రక్షాబంధ ప్రభావంబును, మున్నగు కల్పనలు, విరుద్ధలోకానుభవాతీత విషయంబులు దైవబలంబున నిరూపించియున్నారు. వీరంగఱను బుధులవారికంటెకుఁ గావ్యలక్షణవిరుద్ధముగ వర్ణించిన యప్రామాణిక కవులుగాఁ గాన్పించుటకన్న సత్యాన్వేషణకరమగున విషయము ముందెన్నఁడు వినఁజాలము.

ఈ నాయాంధ్రీకరణముపైఁ బలువురు విద్వత్కవులొసంగిన యభిప్రాయముల శాకుంతలముయొక్క చివరభాగమునఁ బ్రచురించితిమి గావున నీసందర్భమునవానినిగూర్చి దాము జదువవలయునని పాఠకులం బ్రార్థించుచుంటిని.

ప్రసక్తానుప్రసక్తిగా మన విమర్శకులకు సమాధానముఁ జెప్పవలసి యుత్తరరామచరిత్ర విషయమునుగూర్చి నిందు ముచ్చటింపఁ గారణమైనది. ఇఁక శాకుంతలాంధ్రీకరణమునుగూర్చి మా చదువరుల క్రింది పద్యమును విన్నవించి ముగించుచున్నాఁడను.

చ. చదువరులార! నాకుఁగల శక్తికొలంది రచించినాఁడ, ని
య్యది భవదీయ మానసములందు రుచించునొ? లేదొ? నాదు నె
మ్మది సెలఁగంగఁజాల, నవమానములున్న నణంచి, యున్న మె
ప్పిదములె గొప్పగాఁదలఁచి ప్రతిపాలింపుఁ డనుగ్రహంబునన్.

ఇట్లు విన్నవించు విధేయుఁడు,
రాజా యం. భుజంగరావు.

శ్రీ

శుభమస్తు.

ఆంధ్రీకృతాభిజ్ఞాన శాకుంతలము.

నాంది.

సీ. అజునకుఁ దొలిసృష్టియై యొప్పు నెయ్యది ?
విధిహుత హవ్య మెద్ది ధరియించు ?
వలరారు మహిమ నెయ్యది సోమయాజియై ?
యేరెండు గాలంబు నేర్పరించు ?
శ్రుతిగోచర గుణానుగతమై వసించు నె
య్యది విశ్వ మెల్లెడ నావరించి ?
ప్రకృతి యందురు సర్వ భౌతికంబుల కేది ?
ప్రాణులు దేనఁ బ్రాణాన్వితమ్ము ?

గీ. లట్టి నిజవిగ్రహములు ప్రత్యక్షసరణిఁ
దేజి యష్టవిధంబులఁ దేజరిల్ల
నమరు సర్వేశ్వరుండు నిరంతరంబు
మించు కృపతోడ మిమ్ము రక్షించుఁగాక !

సూత్రధారుఁడు— (నాంద్యంతమునఁ దెఱ వైపుఁ జూచి) ఆర్యురాలా ! ప్రసాధన విధానంబు పరిపూర్ణ మయ్యె నేని యిట్లు రమ్ము.

నటి—(ప్రవేశించి) ఆర్య ! ఇదిగో వచ్చితిని. ఏ కృత్య మెద్దియో సెలవిండు.

సూత్ర—ఆర్యురాలా ! యీసభ జ్ఞానసంపన్న మైనది. ఇప్పుడు మనమాంధ్రీకృతాభిజ్ఞాన శాకుంతల మను నూతన నాటకముచే నుపాసింప వలయును.

నటి—ఆర్యా ! కవి యెవ్వరో చెప్పక నిగూఢముగా నుంచితిరే !

---

* చ. ఎదివిధి పూర్వసృష్టి ? విధి నిచ్చు హవిం గొను నెద్ది ? యాజియై యున్నది ? సమయం బొనర్చు ద్వితయం బెది ? శ్రావ్యగుణంబుతోడ నె య్యది విభు ? నేది భూతసమవాయము ? ప్రాణుల కేది ప్రాణ ? మె న్నిక యగు నా స్ఫుటాంగముల నీశు నిరుడుం మిమ్ము గాచుత,

సూత్ర—గూఢముగా నుంచఁబడలేదు. వ్యాప్తిఁ గలవాఁడే.

నటి—నామధేయము ?

సూత్ర—

సీ. అనవద్య హృద్య పద్యాత్మకమై యొప్పు
శశిరేఖ వ్రాసిన చతురబుద్ధి
ఘన కల్పనానల్ప గాథా విచిత్ర హ
రిశ్చంద్ర వ్రాసిన కృతివరుండు
పండిత మండన పాండవాజ్ఞాతవా
సంబును వ్రాసిన జ్ఞానధనుఁడు
ఉత్తమోత్తమ తరాంధ్రోత్తరరామ చ
రిత్రను వ్రాసిన స్తోత్రపాత్రుఁ
గీ. డింతి ! యింతియగాక యత్యంత మధుర
నవ్య భవ్య ప్రబంధ సంధానకర్త;
జగ మెఱిఁగిన బ్రాహ్మణునకు జందె మేల ?
సరసవాఙ్మయ రచనాభుజంగ విభుఁడు.

నటి—ఆర్యా ! యింకను కృతికర్త నామమును స్పష్టీకరింప కుండుటకుఁ గారణ మేమో నాకుఁ దెలియదు.

సూత్ర—ప్రేయసీ ! ఇక్కడి యాత్మస్తుతి పరాయణుండు కాఁడు. నా కీ ప్రబంధమును బ్రదర్శింప నొసంగునప్పుడే "కుశీలవశ్రేష్ఠ ! కించిజ్జ్ఞుఁడ నగు న న్నిక్కడి పండిత మండలంబున నెక్కుడుగం గొండాడ వల" దని పలికె. వినను నాకుం గల యానందంబున నాతని నామమునఁ సూత్రప్రాయముగ నుచ్చరించితిని. కానఁ బ్రతిపాత్రమును సావధానముగా నుండ వలయును.

నటి—సమ్యక్ప్రయోగ పరిజ్ఞాత లగు వీరేమియు లోపము సంభవింపదు.

సూత్ర—ఆర్యురాలా ! నీతో యథార్థమును బల్కుచుంటిని.

గీ. తగు నభిజ్ఞులు ముదమందు దనుక నా ప్ర
యోగ విజ్ఞానమును లెస్సగా గణింప
నెట్టి ఘనపాండితీ సమన్వితుల కైన
నాత్మశక్తిని విశ్వాస మలరు నెక్కొ ! 3

నటి—ఆర్యా! యిది నిక్కమే. అనంతర విధాన మాజ్ఞాపింపుఁడు.

సూత్ర—ఈ సభాసదుల శ్రోత్రోత్సవముకన్న వేఱే యున్నది? నూతనావతారమై భోగోపయోగక్షమమగు నీ గ్రీష్మర్తువుం గూర్చియే గానము సేయుము. ఇప్పుడు గదా!

గీ. జలవిహారంబు లతి మనోజ్ఞంబు లెందు
గహన పవనంబు పాటల గంధిలంబు
నిబిడ మగు నీడ నిద్రఁ జెందించు నట్టి
వాసరంబులు దివసాంత భాసురములు. 4

నటి—అట్లే (గానము చేయును)

క. భ్రమర దర చుంబితంబులు
రమణీయసుమంజు కేసరశిఖంబులు నై
యమరు శిరీష సుమంబులఁ
బ్రమదలు దయ దాల్త్రు శ్రవణపాశము లందున్. 5

సూత్ర—ఆర్యురాలా! చక్కఁగాఁ బాడితివి. ఓహో రంగమంతయు రాగలగ్నాంతరంగమై చిత్తరువు పోలికె నున్నది. చెప్పుమిప్పు డే రూపకముం బ్రదర్శించి యీసభ నారాధింతము?

నటి—ఆర్యమిశ్రు లింతకు మున్నే కదా యానతిచ్చిరి! అభిజ్ఞాన శాకుంతల మను నాంధ్రీకృతాభినవ నాటకముం బ్రదర్శింప వలయు నని.

సూత్ర—ఆర్యురాలా! లెస్సగా జ్ఞప్తికి దెచ్చితివి. అది యంతయు నిప్పుడే మఱచితినిగదా! ఏమన?

గీ. క్రమ మగు నీను గీతరాగంబు వలన
బహు బలాత్కృతి హరియింపఁ బడితి నేను;
జవన సారంగమున నిదే వివశుఁ డగుచు
నాహృతుం డైన రాజు దుష్యంతు నట్లు. 6

(ఇద్దఱు నిష్క్రమించిరి)

ప్రస్తావన.

ఆంధ్రీకృతాభిజ్ఞాన శాకుంతలము.

ప్రథమాంకము.

(అంత ధనుర్ధరుఁడై జింకను దఱుముచు రాజు, సూతుఁడును రథస్థులై ప్రవేశింతురు)

సూతుఁడు—(రాజును మృగమును గాంచి) ఆయుష్మంతుఁడా!

గీ. కృష్ణసారంబు నందుఁ జూపు నిక్కఁగ నధిజ్య
కార్ముకుఁడ వైన నీయందుఁ గన్ను నిలిపి
నాకు హరిణంబుఁ దగులు పినాకపాణిఁ
దృశ్యముగఁ గాంచు చున్న చందమున నుంటి.

రాజు—సూతుఁడా! మనల నీ సారంగ మతిదూర మాకర్షించినది. ఇది యిప్పుడును:-

చ. అరదము వెంబడింప రథి నట్టి మరల్చుచు సారె జూచుచున్
శరవినిపాతభీతి జఘనంబుఁ గడున్ ముని మేనఁ గుంచుచున్
సరణిని నర్ధ జగ్ధ కుశసంతతి రోజెడు నోట రాల్చుచుం
బొరి, దివి; నేల, నన్ను వగఁ బో యెడుఁ జూడుము! ప్రేళ్లు దాటుచున్. ౪

(ఆశ్చర్యముతో) ఏమి! వెంబడించి వచ్చుచున్నను దీనిఁ గాంచుట నాకు దుర్ఘటముగా నున్నది.

సూతు—ఆయుష్మంతుఁడా! మార్గము నిమ్నోన్నతం బని వాగెలు బిగించి రథవేగము నేను గొంచెపఱిచితిని. కాన నీ కీ మృగము దూరాంతరం బైనది. ఇప్పుడు సమమార్గవర్తి వగు నీకు దుర్లభంబు గాదు.

రాజు—అట్లయినఁ బగ్గముల వదుల్పుము.

సూతు—ఆయుష్మంతు నాజ్ఞ. (రథవేగము నిరూపించి) ఇప్పుడుగదా!

చ. పరువడి వాగెల న్వదలి పట్ట నిరాయత పూర్వకాయముల్
స్థిరతర చామరాగ్రములు శ్రీవిలస న్నిభృతోర్ధ్వకర్ణముల్
పరగఁ, గురంగవేగమునఁ బట్టుపగంబలె నీతురంగముల్
పఱచు నిజోత్థ రేణు పటలంబునకైన నలంఘనీయతన్. 9

రాజు—నిక్కముగ నీ తురంగములు భాస్కరాశ్వములఁ గూడ మించిపోవుచున్నవి. అల్లదే!

చ. కనుఁగొన నేది సూక్ష్మ మది గ్రక్కున విస్తృతభావ మొందు; ను
య్యన నడుమం బ్రభిన్న మగు నట్టిది సంహిత మట్లు తోఁచు, జా
పునకు నిసర్గవక్రమగు పోల్కిడి తిన్ననిదా, క్షణంబు ద
వ్వున నొకచైన లే దరదపు న్వడిఁ జెంగట నాగ దేదియున్. 10

సూతుఁడా! చూడు దీని రూపుమాపెదను. (శరమును సంధించును)

(తెఱలో) ఓహో! రాజా! ఆశ్రమ కురంగ మిది. చంపవలదు. చంపవలదు.

సూతు—ఆయుష్మంతుఁడా! నీకు శరపతన మార్గమున నున్న యీ కృష్ణసారంబు నడుమఁ దపోధనులు వచ్చుచున్నారు.

రాజు—(తొందరతో) అట్లైని గఖ్యముల నాపుము.

సూతు—అట్లే. (రథము నిల్పును)

(అంత మఱి యిర్వురితో వైఖానసుఁడు ప్రవేశించును)

వైఖా—(బాహువెత్తి) రాజా!

చ. వలవదు వల్వ దేయ నల బాణము నీ మృగకోమలాంగ మం
దలరుల రాశిమీఁదఁ బ్రబలానలమున్ బఱఁగించి నట్లు; చం
చలతరమైన యీ హరిణశాబక జీవిత మేడ? నక్కటా!
బలు దృఢపుంఖముల్ నిశిత పాతము లేడ? భవన్మహాస్త్రముల్.

మఱియు—

గీ. కడఁక బలువింటఁ జక్కనెక్కిడిన యట్టి
శరము నుపసంహరింపు మీ శస్త్ర మెపుడుఁ

బలిమి నార్త జనత్రాణమునకుఁగాని
యనపరాధుల దండించు పనికిఁ గాదు. 12

రాజు—ఇదిగో, ఉపసంహరించితిని. (అట్లు చేయును)

వైఖా—పురువంశ ప్రదీపునకు నీ కిది యుచితమే.

క. పురువంశమున జనించిన
పురుషుండవు యుక్త మిట్టి పోడిమి నీకీ
వరగుణము లొప్పు వానినిఁ
బరువడిఁ గను మయ్య! చక్రవర్తిం గుమారున్. 13

ఇతరులు—(చాచాలెత్తి) అన్నివిధంబులఁ జక్రవర్తి యగు పుత్త్రునిం బడయుము.

రాజు—(సమస్కారముతో) బ్రాహ్మణ వచనముం బరిగ్రహించితి.

వైఖా—రాజా! మేము సమిధలకై బయలుదేరితిమి. ఇదిగో! మాలినీ తీరమునఁ గులపతి యగు కణ్వ మహాముని యాశ్రమము గానవచ్చుచున్నది. కార్యాంతరాంతరాయము గల్గకేని యిందు వేంచేసి యతిథి సత్కారముం బరిగ్రహింపుము. మఱియు,

గీ. విఘ్నములు లేక మిగుల దీప్తిమెయి జరుగు
నల మునీంద్రుల కర్మనిష్ఠలనుగాంచి
మహిత మౌర్వీకిణాంకమౌ మద్భుజంబు
నెంత దవ్వేలుననియది నెఱుఁగఁ గలవు! 14.

రాజు—ఇందుఁ గలరా కులపతులు?

వైఖా—నందన యగు శకుంతల నతిథిపూజార్థమై నియోగించి యామె దైవప్రాతికూల్యమును నివారింప నిప్పుడె సోమతీర్థమున కరిగినారు.

రాజు—(తనలో) ఔఁగాక! ఆమెను గనుఁగొందును. (ప్రకాశము) నా భక్తి నామెయే మహర్షికి విన్నవింపఁగలదు.

వైఖా—మేము పోయెదము. (శిష్యులతో నిష్క్రమించును.)

రాజు—సూతుఁడా! రథ్యములఁ దోలుము. పుణ్యాశ్రమ దర్శనంబున ధన్యుల మయ్యెదము.

సూతు—ఆయుష్మంతుని యాజ్ఞ (మరల రథవేగము నిరూపించుచున్నాఁడు)

రాజు—(కలయఁ జూచి) ఇది తపోవనాభోగ మని చెప్పకయే తెలియవచ్చెడిని.

సూతు—ఎట్లు?

రాజు—చూడలేదా నీవు? ఇక్కడ—

మ. అగ మూలంబులు వాతసంచలిత కుల్యాతోయ ధౌతంబులై
నెగడెం; బల్లవ కాంతి విన్నదన మొందెన్ హోమధూమంబునన్;
మృగపోతంబులు సుందరోపవనభూమిన్ భిన్న దర్భాంకుర
స్థగిత ప్రాంతమునం జరించెడి యథేచ్ఛన్ మందమందంబుగన్. 15

మఱియు,

మ. తరురంధ్రంబులనుండి కీరములు క్రిందన్ రాల్చె నీవారముల్,
వెలి వంక న్నను రాలు గారఫలముల్ భేదించుటం దెల్పె, నీ
హారిణంబుల్ వెలిఁబోక మచ్చికలతో నారావముల్ సైచె, ని
ర్ఝర మార్గమ్ములు వల్కలాగ్ర జలధారా రేఖలం బొల్చెడిన్.

సూతు—సర్వమును సరిగానున్నది.

రాజు—(కొంచెము దూర మరిగి) సూతుఁడా! తపోవన నివాసుల కుపరోధము గల్గకుండుఁగాక! ఇచ్చటనే రథము నిల్పుము. నేను దిగెదను.

సూతు—పగ్గముల బిగఁబట్టితిని. ఆయుష్మంతుఁ డవతరించుఁగాక!

రాజు—(దిగి) వినీత వేషములతోఁ గదా తపోవనంబులఁ బ్రవేశింపవలయును. వీనిఁ గ్రహింపుము. (తనునొప్పు నాభరణములను సూతుని చేతి కొసంగి) నే నాశ్రమ నివాసుల దర్శించి వచ్చునంతలో నశ్వోపరిభాగముల నార్ద్రీకరింపుము.

సూతు—అట్లే (నిష్క్రమించును)

రాజు—(పరిక్రమించి) ఇదే! యాశ్రమ ద్వారము. ప్రవేశింతును.

(ప్రవేశము నభినయించుచు నిమిత్తమును సూచించి)

క. ఇది శాంత మైన యాశ్రమ
పద, మదరు భుజంబు దీని ఫల మిట నెట్లా?
మది శంక యేల! యెల్లెడ
నొదవున్ భవితవ్యములకు నుచిత పథంబుల్. 17

(తెరలో) చెలులారా! యిట్టిటు.

రాజు—(చెవి యొగ్గి) ఓహో! వృక్షవాటికకు దక్షిణముగా సల్లాపము వలె వినవచ్చు చున్నది. అచ్చటికిఁ బోయెదను. (పరిక్రమించి చూచి) ఈ మునికన్యకలు తమ ప్రాయమునకుఁ దగిన జలకలశములతో బాలవృక్షములకు నీరుపోయుటకై యిక్కడ వచ్చుచున్నారు. (నిరూపించి) ఓహో! వీరి సందర్శనం బెంత యానందముగా నున్నది!

గీ. అతుల శుద్ధాంత దుర్లభం బగు తనూ వి
లాస మాశ్రమ సతుల కెలర్చెనేని
గన్యగుణములచేత వరణ్య లతలు
దవ్వుగఁ ద్రోలఁగఁ జేయు నుద్యాన లతల. 18

ఈ తరుచ్ఛాయయందు నిచ్చట నిరీక్షించెదను. (చూచుచుండును)

(అంత యథోక్త వ్యాపారయైన శకుంతల చెలులతోఁ బ్రవేశించును.)

శకుంతల—చెలులారా! యిట్టిటు.

అనసూయ—చెలీ! శకుంతలా! గురువు లగు కాశ్యపుల కాశ్రమ వృక్షము నీ కన్నను బ్రియతరం బని యూహింతును, నవమాలికా కుసుమ కోమలి వగు నిన్ను గూడ నాలవాల సేచనార్థమై నియోగించెను.

శకుం—ఒక్క జనకాజ్ఞయే కాదు. నాకుఁ గూడ వీనియందు సోదర స్నేహము కలదుగదా! (వృక్షసేచనము నిరూపించు చున్నది.)

రాజు—ఏమి? ఈమెయా! కణ్వపుత్త్రిక? పూజ్యు లగు కాశ్యపులు లెస్సగా నాలోచింపలేదు. ఈమెనా! యాశ్రమ ధర్మమున నియోగించుట!

సీ. సహజ సుందర మిట్టి విగ్రహము నెవఁడు
నిర్భర తపోవ్రతంబున నిల్ప నెంచుఁ
దథ్యముగ నుత్పల పలాశ ధారచేత
నాఋషి సమిల్లతాచ్ఛేద మాచరించు. 19

కానిమ్ము! చెట్టు చాటున నుండి యథేచ్ఛగా నీమెను గాంచెదను.

(అట్లు చేయును.)

శకుం—అనసూయా! ప్రియంవదచే నిర్దయముగా బిగింపఁబడిన యీ వల్కలోత్తరీయముచే నిర్బంధింపఁ బడుచుంటిని. దీని సడలింపుము.

అన — ఆఁ. (సడలించు చున్నది)

ప్రియం — ఇందుఁ గుచవర్ధకం బైన నీ యౌవనమునే నిందింపుకొనుము.

రాజు — ఈ ప్రాయమున కీ వల్కల మెక్కింతయు సర్వము గాక పోయినను అలంకార శోభను బొందింపక పోలేదు. ఏమన:—

ఉ. అంబురుహంబు శైవల సమావృత మయ్యు మనోహరంబు, చి
హ్నంబు వివర్ణ మయ్యు నమృతాంశునకున్ బలువన్నెఁ దెచ్చు, వ
ల్కంబు ధరించి యైన మిగుల న్మురువారెడు నీ లతాంగి, సౌ
మ్యం బగు నట్టి యాకృతుల కాభరణంబులు గావె సర్వమున్. 20

శకుం — (ముందు జూచి) ఇదిగో! పవన కంపితంబు లగు పల్లవాంగుళులచే బాల వకుళము నన్ను దొందర చేయుచున్నట్లున్నది. దీని బహూకరింతును. (పరిక్రమించు చున్నది.)

ప్రియం — సఖీ! శకుంతలా! నీ వచ్చటనే క్షణ మాగుము. నీ చేరువచే నీ బాలవకుళము లతా సమేత మైనట్లు తోఁచు చున్నది.

శకుం — కావుననే నీవు ప్రియంవదవుగదా!

రాజు — ప్రియంవదయే కాదు. ప్రియ మైనను సత్యమే పల్కినది. ఈమెకు:—

క. కెంజిగురుఁ బోలు నధరము
మంజుల విటపములఁ బోలు మసృణ భుజంబుల్
రంజిలు యౌవన మంగము
లం జక్కఁగ విరిసెఁ గుసుమ లలితం బగుచున్. 21

అన — సఖీ! శకుంతలా! వనజ్యోత్స్న యని నీవు పేరిడ్డ నవమాలిక బాలసహకారమునకు స్వయంవరాంగన యైనది. దీని మఱచిపోయితివి గదా!

శకుం — అట్లయిన నన్నే మఱతుఁగలను. (లతను డాసి చూచి) సఖీ! కమనీయ కాలమున నీ లతా పాదప మిథునంబునకు సంబంధము సమకూడినది. నవ కుసుమ యౌవన యీ వనజ్యోత్స్న బద్ధపల్లవతచే నుపభోగయోగ్య మీ బాలసహకారము.

(చూచుచు నిలిచి యున్నది)

ప్రియం — (చిఱునవ్వుతో) చెలీ! అనసూయా! శకుంతల యీ వనజ్యోత్స్న నంతగా నేల చూచు చున్నదో యెఱుంగుదువా?

అన — నే నూహింప లేదు. చెప్పుము.

ప్రియం — "ఈ వనజ్యోత్స్న యనురూప పాదపముతో నెట్లు సంగతం బైనదో నేను నట్లే యాత్మానురూపుఁ డగు వరునిఁ బొందుదునా" యని.

శకుం — (కోపముతో) ఇది నిజముగా నీ మనోగతాభిలాష. (కలశము వంచును.)

రాజు — (తనలో) ఈ మనోరథము దుర్లభము గదా! కులపతుల కీమె యసవర్ణక్షేత్రమున జన్మించి యుండునా! లేదా! సందేహింప నేల?

ఉ. పావన మైన నామనము పాయక యివ్విరిబోణిఁ గోరెఁ గాన్
గావున నీమె నిక్కముగ క్షత్రపరిగ్రహయోగ్య; సందియం
బేపగ నైన లేదు ధర నెందు నభిజ్ఞుల కర్థసంశయం
బావహిలం బ్రమాణముగ నర్థి గ్రహింపరె చిత్తవృత్తులన్. 22

వినను బ్రత్యక్షముగానే యీమెను దెలిసికొందును.

శకుం — (తొందరతో) సఖీ! నీరుపోయ బెదరి యీ కొదమ తుమ్మెద విరజాజిని విడిచి నా మోము గ్రమ్ముకొను చున్నది. (భ్రమరబాధ నిరూపించును.)

రాజు — (చూచి అభిలాషతో) మేలు. ఈమె బాధయు రమ్యముగా నున్నది.

గీ. రమణ నెందెందు నిందిందిరంబు తిరుగుఁ
దొలఁగ కందందుఁ జంచలాక్షుల మలంచి
బొమలఁ ద్రిప్పు చయత్నపూర్వముగ దృష్టి
విభ్రమము నేర్చె నిప్పు డీ వెలఁది భీతి. 23

(అసూయతో)

మ. చలదృష్టింగను చంచలాంగిని యథేచ్ఛన్ సోకుచున్, పీను చెం
తల నేకాంతముఁ బల్కు రీతి మృదుగీతం బొప్పఁ దూఁగాడుచున్,
బలిమిం గేలు విదుల్చుచుండ రతిసర్వస్వాధరం బానెదో
యలి! నీవే కృతి మేము వ్యర్థులము తత్త్వాపేక్షఁ జింతించుటన్.

శకుం — చెలులారా! ఈ దుష్టమధుకరముచేఁ బీడింపఁ బడుచుంటిని. రక్షింపుఁడు. రక్షింపుఁడు.

ప్రియం-అన — రక్షింప మే మెవ్వరము? దుష్యంతుని మొఱవెట్టుము. తపోవనములు రాజరక్షితములుగదా!

రాజు—(తనలో) నన్ను బయల్పఱచుకొన నిదియే సమయము. ఏల దాఁగెద? (అర్ధోక్తిలో నాలోచించి) రాజభావము వెల్లడి యగును. కానీగాక! యిట్లు పలుక్కెదను.

శకుం—ఈతుమ్మెద నన్ను విడుచుటలేదు. కాన నే నొకచోటి కరిగెదను. (మఱియొక యడుగు వైచి బెదరి చూచుచు) ఏమి? ఇచ్చటను నన్ను వెంబడించుచుండె.

రాజు—(తొందరతో సమీపించి)

క. క్రూరజన శిక్షకుం డగు
పౌరవుఁ డిన్నేల నేలుబడిఁ గావింపన్
ధీరలుగాని తపస్వి కు
మారికలఁ గలంచు వీఁడు మహి నెవ్వఁ డొకో? 25

(అందఱును రాజును జూచి యించుక తత్తఱపడుచున్నారు.)

అన—అయ్యా! మఱేమియు నుపద్రవము లేదు. ఈ మా ప్రియసఖి భ్రమర పీడితయై భయము నొందినది. (శకుంతలను జూపును)

రాజు—(శకుంతల కెదురై) తపస్సు వృద్ధినొందుచున్నదా?

శకుం—(నివ్వెఱపడి యూరకున్నది.)

అన—ఇప్పు డతిథి విశేష లాభమున; ఆర్యునకు స్వాగతము. సఖీ! శకుంతలా! పర్ణశాల కరిగి ఫలములతో నర్ఘ్యముం గొని తెమ్ము. ఇది పాదోదకము గాఁగలదు.

రాజు—వలదు. మీ హితవచనముననే యాతిథ్య మాయినది.

ప్రియం—అట్లైనఁ బ్రచ్ఛాయ శీతలం బగు నీ సప్తపర్ణ వేదికపై నుపవేశించి యార్యుండు పరిశ్రమ విశ్రాంతి నొందుఁగాక!

రాజు—మీరు నీ కృత్యముచే నలసితిరి గదా!

అన—సఖీ! శకుంతలా! అతిథిసేవ మన కుచితముగదా! కాన నిటఁ గూర్చుందము.

(అందఱుఁ గూర్చుండెదరు.)

శకుం—(తనలో నాలోచించుచు) ఏమిది! ఈతనిం గాంచి తపోవనంబునఁ బొడమరాని చిత్త వికారమునకుఁ బాలుపడితిని.

రాజు—(అందఱిని జూచి) ఓహో! సమ వయస్సౌందర్యములచే మీ సౌహార్దం బెంత రమ్యముగా నున్నది!

ప్రియం.—(జనాంతికము) అనసూయా! ఈయన యెవ్వరో కదా! నిపుణ గంభీర రూపముతో మధుర ప్రియాలాపము లాడుచుఁ బ్రభువువలెఁ గానవచ్చుచున్నాఁడు.

అన.—చెలీ! నాకును వేడుక గలదు. ఈయన నడిగెదను. (ప్రకాశముగా) ఆర్యుని ప్రియసల్లాపము వలని విస్రంభము నన్ను బ్రేరేచుచున్నది. దేవరచే నేరాజర్షివంశ మలంకరింపఁ బడినది. ఏదేశజనము విరహోత్కంఠితం బైనది! కోమలంబయ్యు నీశరీరము తపోవన పరిశ్రమమున కేల భాజనం బైనది?

శకుం.—(తనలో) హృదయమా! పరితపింపకుము. పరితపింపకుము. నీ వూహించిన దాని ననసూయ ప్రశ్నించుచున్నది.

రాజు.—(తనలో) నే నిపుడు నన్నెట్లెఱిగించుకొందును? ఎట్లు మఱుఁగైనఁ జేసికొందును? కానీ గాక! ఈమె కిట్లు పలుకుదును. (ప్రకాశముగ) కల్యాణీ! పౌరవ నృపాలునిచే ధర్మాధికారమున నియోగింపఁబడి యాశ్రమ నివాసుల నిర్విఘ్న తపఃపరిజ్ఞానంబునకై యీ ధర్మారణ్యమున కేతెంచితిని.

అన.—ధర్మచారు లిపుడు నాథవంతులు.

శకుం.—(శృంగార లజ్జను నిరూపించుచున్నది.)

ప్రియం, అన } ఇరువురి యాకృతి నెఱింగి (జనాంతికముగా) సఖీ! శకుంతలా! జనకులిప్పు డిచ్చట నుండిరేని!

శకుం.—(కోపముతో) ఉన్న నేమి?

ప్రియం, అన } జీవిత సర్వస్వము చేతనైన నీ యతిథిని కృతార్థుని జేయుదురు.

శకుం.—చెలులారా! తొలఁగిపొండు. ఏదో హృదయమునఁ బెట్టుకొని మాటలాడుచున్నారు. మీ మాట వినను.

రాజు.—నేను గూడ మీ సఖీవృత్తాంతము గొంచె మడుగుచున్నాను.

ప్రియం, అన } ఆర్యా! అనుగ్రహముగదా యీ ప్రార్థన.

రాజు.—భగవాను లగు కాశ్యపులు శాశ్వత బ్రహ్మనిష్ఠు లని ప్రతీతి. ఈ మీ చెలి వారి తనూజ యనుట యెట్లు?

అన.—ఆర్యా! వినుము. కౌశికుఁడని గోత్రనామము గల మహాప్రభావ సంపన్నుఁ డగు రాజర్షి కలఁడు.

రాజు—కలదు. విని యుంటిని పిదప.

అన—ఆయనయే మా చెచ్చెలికిఁ గన్నతండ్రి. ఆయన విడువఁగా శరీర వర్ధనాదులచేఁ గాశ్యపులు జనకు లయిరి.

రాజు—"విడువఁగా" అనుట వలన నాకు వేడుక పొడముచున్నది. మొదలంట వినఁ గోరుచుంటిని.

అన—ఆర్యా! వినుము. తొల్లి యా రాజర్షి యుగ్రతపంబున నుండ బృందారకులు భీతి నొంది నియమ విఘ్నమునకై మేనక యను నప్సరం బుత్తెంచిరి.

రాజు—కలదుగదా పరతపోభీరుత్వ మమరులకు. తర్వాత. తర్వాత.

అన—పిమ్మట వసంతోదార సమయమున నున్మాద జనక మగు నామె సౌందర్యముం గాంచి. (అర్ధోక్తిలో లజ్జచే విరమించును.)

రాజు—పిదపఁ దెలియ వచ్చుచునే యున్నది. ఈమె సర్వదా యప్సరఃకన్య.

అన—ఔను.

రాజు—యుక్తము.

క. ఈ రామణీయకం బను
వార న్నరజాతి కన్యలం దెట్లొదవున్
ధారుణిపై నుండి ప్రభా
తారళ్యము గల్గు మెఱుపుదయ మందు నొకో. 26

శకుం—(మోమువంచి కూర్చుండును.)

రాజు—(తనలో) నామనోరథమున కవకాశ మున్నది. కాని పరిహాసమునకై చెచ్చెలి పలికిన యీమె వరప్రార్థన నాలకించి నామనము ద్వైధీభూతమై భీతి నందుచున్నది.

ప్రియం—(చిఱునవ్వుతో శకుంతలను జూచి రాజున కభిముఖియై.) ఆర్యుఁడు మరల నేదియో పల్కఁ బూనినట్లుండెను.

శకుం—(చెచ్చెలిని తర్జనిచే బెదరించుచున్నది.)

రాజు—లెస్సగా గ్రహించితివి. సచ్చరిత్ర శ్రవణాసక్తిచే మఱియొకటి ప్రశ్నింప వలసియున్నది.

ప్రియం—ఆలోచన మేల? తపస్విజనుల నడుగ సంకోచింప వలదుగదా?

రాజు—మీ చెచ్చెలి నెఱుంగఁ గోరెదను.

ఉ. తేని కొసంగుదాఁక వలతేని విలాసము వద్దుసేయు నై
ఖానస నిష్ఠ యీ చెలిమికత్తియ యుర్విఁ ధరింపనౌనొ ? కా
దేని నిరంతరంబు మదిరేక్షణవల్లభ యీ కురంగకాం
తా నివహంబుతోఁ బ్రమదంబునఁ గూడి వసింపనౌనొకో ? 27

ప్రియం—ఆర్యా ! ధర్మాచరణ మందైన నీజనము పరాధీనము. ఈమె ననురూప వరున కిచ్చుటయందే జనకుని సంకల్పము.

రాజు—ఈ ప్రార్థన దుర్లభముగదా ! (తనలో)

గీ. హృదయమా ! కోరికలఁ గోరు మిప్పు డింక
నీకు లభియించె సందేహనిర్ణయంబు ;
అగ్ని యని దేని సందియ మందు చుంటి
వంట నను వైన మానికం బయ్యె నదియె. 28

శకుం—(కోపంబునం బోలె) అనసూయా ! నేను బోయెదను.

అన—ఏల ?

శకుం—ఈ యసంబద్ధ ప్రలాపిని గూర్చి యార్య యగు గౌతమి కెఱింగింతు.

అన—సఖీ ! సత్కారము నొందని ప్రాప్తాతిథిని విడిచి స్వేచ్ఛగా నరుగుట యాశ్రమ జనమ్మున కుచితంబు గాదుగదా !

శకుం—(మిన్నక వెడలిపోవును)

రాజు—(తనలో) ఆఁ ! వెడలిపోవుచున్నదా ? (పట్టుకొన నెంచి మనము నిగ్రహించి) ఓహో ! కాముకజనుల చిత్తవృత్తి క్రియానురూప మైనది గదా నేనిపుడు.

క. మునినందన వెనువెంటం
జన దిగియు వేగ వినయ సంరుద్ధుఁడనై
మనికిం గదలక యుండియుఁ
జని మరల మరలి వచ్చు చందముఁ గంటిన్. 29

ప్రియం—(శకుంతలను నిరోధించి) సఖీ ! నీ వరుగుట యుక్తము గాదు.

శకుం—(బొమముడితో) ఏమి ?

ప్రియం — ఈ రెండు వృక్షములకు నీరుపోయుట నప్పుపడితివి. కాన నప్పుఁ దీర్చి పోవుదువుగాక. (బలాత్కారముగా నాపుచున్నది)

రాజు — కల్యాణీ! వృక్షసేచనము వలననే యీమె యలసిన దని తలంచుచున్నాను. కావుననే యీమెకు.

చ. జలఘట మూనఁ గట్టెఱు పెనంగి నతాంసము లయ్యెఁ బాహు
వుల్ కొలఁదికిమించు నూర్పు కుచకుంభ వికంపము మాన్ప దిప్డు, వీ
నులయు శిరీష మత్తుకొన నొత్తుగఁ జెమ్మట గ్రమ్మె మోము వే
నలి విడ నొక్కచేఁ గరమునన్ నిలఁపన్ నెఱు లూఁగియాడెడున్.

కాననే యీఋణమును నేను దీర్చెదను. (ఉంగర మీయఁబోవును.)

ప్రి-అన-(నామ ముద్రాక్షరములఁ జదువుకొని యొండొరులఁ జూచుకొనుచున్నారు)

రాజు — నన్నన్యథా తలంపవలదు. ఇది రాజపరిగ్రహము.

ప్రియం — కాన నీయంగుళీయక మార్యుని యంగుళీ వియోగమున కర్హముగాదు. మీ మాటవలననే యీమె యప్పు దీరినది. సఖీ! శకుంతలా! దయామయుం డగు నార్యునిచే లేదా! మహారాజుచే విడిపింపఁ బడితివి. పొమ్మిప్పుడు.

శకుం — (తనలో) నాకు నే స్వతంత్రురాల నగుదు నేని (ప్రకాశముగా) విడుచుట కైన నిల్పుట కైన నీ వెవ్వతెవు?

రాజు — (శకుంతలను జూచుచుఁ దనలో) ఈమెయందు నా కట్లే యీమెకు నా యందు నట్లుండునా! లేదా! నా కోరిక కవకాశ మున్నది. ఏలయన?

గీ. తన నుడువు నానుడులతోడ నొనయనీదు
గాని నేఁ బల్క నా నైపె వీ నొసఁగు
మిగుల నాకభిముఖముగ నిలఁగ కున్నఁ
దఱచు వెఱవంక దొరయ దీ తెఱవదృష్టి. 31

(తెఱలో) ఓహో! ఆసన్న తపస్వులారా! తపోవన సత్త్వముల రక్షించుకొనుఁడు. మృగయా విహారియగు దుష్యంత నృపాలుఁడు మీకు సన్నిహితుండయ్యె.

గీ. అశ్వఖురధూళి సంధ్యారుణాంశు మిళిత
మగుచు విటపి విషక్త జలార్ద్ర వల్క

లములఁ జెలువారు నాశ్రమ ద్రుమములందు
శలభ విసరంబు క్రాలె గుంపులయి వ్రాలె. 32

మఱియు—

చ. ఎడయని పోటునం బను మహీరుహకాండము దంతకోటియం
దడర, లతల్ పదాగ్ర వలయంబుగఁ జుట్టి తగుల్కొనంగఁ, బెం
పడఁగి కురంగముల్ బెదర, నాశ్రమభూమి రథంబుఁ గాంచి లో
వడలిగజంబు జొచ్చె నహహా! మెయినామతపోవ్రతవిఘ్న మోయనన్

(అందఱు విని తత్తరపడుచున్నారు)

రాజు—(తనలో) అన్నా! ఎంత కష్టము. సైనికులు నన్ను వెదకుచుఁ దపోవనము చెరిచెట్టుచున్నారు. పోఁగాక! వెడలిపోయెదను.

అన—ఆర్యా! యీవనగజ వృత్తాంతముచేఁ దొట్రుపడుచుంటిమి. పర్ణశాల కరుగ మా కాజ్ఞ యొసంగుము.

రాజు—మీ రరుగుఁ డరుగాక! మేమును ఆశ్రమ పీడ కలుగకుండఁ బ్రయత్నింతుము. (అందఱు లేచుచున్నారు)

ప్రి—ఆర్యా! సత్కరింపఁ బడని మిమ్ము బునర్దర్శనమై విన్నవింప లజ్జించుచుంటిమి.

రాజు—కాదు. కలదు. మీ దర్శనంబుననే సత్కృతుండ నైతి.

శకుం—(రాజుతో నాలసించి చెలులతో నిష్క్రమించును)

రాజు—నగరమున కేగ శిథిలయత్నుండ నైతిని. అనుచరులఁ గాంచి తపోవన సమీపమున నిల్చెదను. శకుంతలా విలాసమునుండి యాత్మను మరలింప నసమర్థుండ నై యుంటిని.

క. మును మేను నడచుచుండెన్
వెనుక కసంస్తుత మనంబు వేఁ బరుగిడెడున్
మొనసి పవనాభిముఖతం
గొనఁబడు కేతువునఁ బట్టుకోకయు బోలెన్. 34

(అందఱు నిష్క్రమింతురు)

ఇది ప్రథమాంకము.

శ్రీ

శుభమస్తు.

ఆంధ్రీకృతాభిజ్ఞాన శాకుంతలము.

ద్వితీయాంకము.

(పిదప విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

విదూ—(నిట్టూర్చి) అన్నా! వేటతమిఁ దగులు నీ రాజునకుఁ జెల్మికాఁడనై వేసరి పోయితిని. ఇదిగో! జింక- ఇదిగో! పంది- ఇదిగో! పులి- యని మిట్టమధ్యాహ్నమందైనను గ్రీష్మసమయ మగుటచే దట్టముగాఁ జెట్లులేనివైన లేని కాఁనవులలోఁ దిరుగవలసి వచ్చినది. ఆకులు రాలి కషాయములై గోరువెచ్చనగు సెలయేళ్ళ నీళ్ళు త్రావవలసివచ్చినది. శూలదప్పి శూలముగాఁ గాల్చినట్టుఁ దినవలసివచ్చుచున్నది. గుఱ్ఱము వెంబడిం బరుగువాఱుటచేఁ గీళ్ళువట్లు వదలి రాత్రియైనను హాయిగా నిద్రపట్టలేదు. పిదప నా తెగఁ దెల్లవాఱక మున్నె తోడుకొండకులు కుక్కలవేటగాండ్రు కానలోన నఱకట్టి గగ్గోలుసేయ మేలుకొంటిని. ఇంతటనైనను పీడ వదలలేదు. పిమ్మటఁ బుండుపై బొబ్బలేచినది. నిన్న మేము వెనుకఁబడి యున్నపుడు వేటవెంటబడి నాశ్రమపదమునకుఁ జేరిన యీ మహానుభావునకు శకుంతలయను తాపసకన్యక నా దురదృష్టవశమునఁ గంటఁ బడినదఁట. ఇప్పుడు నగరికిఁ బోవుమాటయైనఁ దలపెట్టఁడు. ఇప్పుడా వృత్తాంతమునే తలంచుకొనుచుఁ దలపోయుచు నాకన్నులకే తెల్లవారినది. ఏమిబుద్ధి! సఖు యాకృత్యములు దీర్చి యలంకృతుఁడైన రాచ్చెలిం గాంతుఁగాక. (పరిక్రమించి

చూచి) ఇదిగో! వింట్లు గైకొని వనపుష్పమాలికలఁ దాల్చు యవనస్త్రీలచేఁ బరివృతుండై ప్రియవయస్యుఁ డిట్లే వచ్చుచున్నాఁడు. కానిమ్ము! శిథిలాంగునిం బోలె విశ్రమించెదను. అట్లయినఁ దీనికి దొరకునేమో? (చేకఱ్ఱ నాని నిలిచియుండును)

(ప్రవేశకము.)

(పిదప నుదాహృత పరివారముతో రాజు ప్రవేశించును.)

రాజు—(తనలో)

గీ. తలఁపఁ బ్రేయసి కేవలసులభ గాదు
మనసు తద్భావమునుగాంచి మఱుగుచుండు
మనసిజుండు కృతార్థతఁ గనకయున్నఁ
బ్రీతి నన్యోన్య సంకల్పమే తనర్చు. 1

(చిఱునవ్వునవ్వి) ఇట్లు స్వాభిప్రాయానుసారముగా దయితాజన చిత్తవృత్తి నూహించు కాముకజనుఁడు పరిహాసాస్పదుం డగును.

చ. వలపునఁ గాంచె నన్ను బెరవారిఁ గనుల్ మరలించువేళ; నా
లలన విలాసమందగతులం జనియెం గటిప్రేగునంబలెన్;
వల్దని పైనమాపు చెలిపైఁ గినుకం బలికెన్; మదర్థ మీ
లలితము లెల్లఁ; గామి సకలంబు స్వకీయతఁ గాంచు నయ్యకో!

విదూ—(అట్లుండియే) ఓచెలికాఁడా! నాకాలుసేతులు గదలుటలేదు. వాఙ్మాత్రము వనే విజయ మొందుము.

రాజు—(చిఱునవ్వుతో) ఈ యంగవైకల్య మెక్కడిది?

విదూ—ఎక్కడిదా? కన్నుపొడిచి కన్నీటికారణ మడుగుచున్నావు.

రాజు—నాకుఁ దెలియుటలేదు.

విదూ—ఓచెలికాఁడా! ప్రబ్బచెట్టు పొట్టివానిఁ బోలియుండుట తన ప్రభావమునా? నదీవేగ ప్రభావమునా?

రాజు—నదీవేగమే యందలి కారణము.

విదూ—నాకును నీవే.

రాజు—ఎట్లు?

విదూ—ఇట్లు నీవు రాజకార్యముల విడిచి యిట్టి చీకాకువోట్ల బోయవాఁడవై సంచరించుచుంటివి. ఇంక నేనో నిజముగాఁ బ్రతిదినమును క్రూరమృగములఁ దఱుముటచే నవయవము లన్నియుఁ గీళ్ళువట్లు వదలఁ గదలలేక యున్నాఁడను. కాన ననుగ్రహింపుము నన్నొక్క దినమైనను విశ్రమించ నాజ్ఞ యిమ్ము.

రాజు—(తనలో) వయస్యుఁడును నిట్లు బలుకుచున్నాఁడు. నాకును గాణ్వనందనం దలంచుచు హృదయము వేట నిచ్చగింపకున్నది. ఏమన?

గీ. అల్లియ బిగించి నారసం బాటఁ దొడిగి
పఱచు మృగముల పైవిల్లు వంపఁ జాల
నవియుఁ బ్రేయసి సహవాసులై చరించి
కలికి చూపులఁ గఱపిన కరణిఁ దోఁచె. 3

విదూ—(రాజు మోముఁ జూచి) ఇపుడు నీవద్దిగో మనమునఁ బెట్టుకొని తలపోసి కొనుచున్నావు. నాది యరణ్యరోదనం బైనదికదా!

రాజు—(చిఱునవ్వుతో) కాకేమి! మిత్రవచన మనతిక్రమణీయ మని మిన్నకుంటిని.

విదూ—చిరకాలము జీవింపుము. (పోఁబోవును)

రాజు—మిత్రుఁడా! నిలువుము. నే నింకను జెప్పవలసియున్నది.

విదూ—ఆనతిమ్ము.

రాజు—నీవిశ్రాంతి యైనపిదప నాకొక యనాయాస కార్యములో సహాయుఁడవు గావలయును.

విదూ—ఉండ్రములు తినుటకేనా?

రాజు—చెప్పెదను.

విదూ—సావధానుఁడనై యుంటిని.

రాజు—ఎవఁడురా అచ్చట?

దౌవారికుఁడు—(ప్రవేశించి) స్వామీ! ఆనతిండు.

రాజు—రైవతకా! సేనానినిం బిలుచుకొని రమ్ము.

దౌవా—అట్లే. (నిష్క్రమించి సేనానితోఁ బ్రవేశించి) ఇదిగో! ప్రభు వద్దిదో యానతియ్యఁగోరి యిట్లే చూచుచున్నాఁడు. సమీపింపుము.

సేనాని—(రాజును జూచి) దోషమాపితం బయ్యును వేట దేవరకుఁ గుణము మఱి మేలే కల్గించినది. కావున నే ప్రభుఁడు

చ. అసితము వింటినారి దివియన్ మునివైపు దిటంబువాలు, హె
చ్చిన రవిదీప్తి నైచి చిఱుచెమ్మట గ్రమ్మక, చిక్కియుండియుం
బెనుపను నుక్కివం బొదవు మేన మహీధర సంచరక్రియం
గ్రమనిబలేఁ బ్రాణసారము ననూనముగా ధరియించె సూక్ష్మతన్.

(సమీపించి) దేవర జయించుఁగాక! విపినమందెల్లఁ గ్రూరమృగసంచారంబు నరికట్టితిమి. ఇంక తడవేల?

రాజు—సేనానీ! వేటను మాకు మాధవ్యునిచే భగ్నోత్సాహుడ నైతిని.

సేనాని—(జనాంతికముగా) సఖా! నిమ్మళకా! నీపట్టిన పట్టు వదలకుము. నేను స్వామి చిత్తము ననువర్తించెదను. (ప్రకాశముగా) ఈ బాలిశుండు ప్రేలుచుండుఁగాక! ఇందు దేవరయే నిదర్శనము.

చ. ఉదరము క్రొవ్వడంగుట సముత్పతనక్షమ మౌను మేను; శ్వా
పదముల రోష సాధ్వస విభాసిత చిత్తవికారము మగ్గవాఁ;
బదపడి లోలలక్ష్యమున బాణము లుంచుటఁ గీర్తి ధన్వికా
గద! ; వ్యసనంబు వేటనుట కిల్లయ; యిట్టి వినోద మొందగున్.

విదూ—ప్రభువునకు స్వస్థత గల్గినది. నీవు మాత్రము కానమండి కానకుఁ దిరుగుచు ముక్కు-గండలు తెలుకఁగోరు నేకేని ముసలి యెలుఁగు వాతఁ బడఁగలవు.

రాజు—భద్ర! సేనానీ! వేయేల? ఆశ్రమప్రాంతమున నున్నవారము కావున నీ మాట కామోదింపను. ఇప్పుడు—

మ. మునుఁగుంగాక! నిపానతోయముల దున్నల్ గొమ్ములం గొట్టుచుం;
దనుపాటింగ నెమర్చుఁగాక! మృగయూధం బీ ఘనచ్ఛాయలన్;
వానలన్ ముస్తల నెత్తుఁగాక! సుకరంబుల్ స్వేచ్ఛగా; మాశరా
సనముం దీరికఁ జెందుఁగాక! శిథిలజ్యాబంధ సంధానమై. 6

సేనాని—ప్రభువారి చిత్తము.

రాజు—కావున ముందుబోయిన వనగ్రాహుల మరలింపుము. మన సైనికులు తపోవనంబునకు దూరముగా నుండునట్లు మొనలొత్తుకొనుము. చూడుము—

గీ. శమనిధానంబులగు మునీశ్వరులయందు
ఛన్నమై దాహశీల తేజము వసించుఁ
దాక ననువైన తపనకాంతంబులట్లు
వెల్గు రది యన్యతేజో నిపీడనమున. 7

సేనాని—దేవర యాజ్ఞ.

విదూ—పో! తొత్తుకొడుకా! నీ యుత్సాహ వృత్తాంతము భగ్నమైనది లే.

సేనా—(నిష్క్రమించును.)

రాజు—(పరిజనమును జూచి) యవనికలారా! మీరు వేటవేషమును దీసివేయుఁడు. రైవతకా! నీవును నాపనుపుఁ జేయుము.

పరివారము—దేవర యాజ్ఞ (నిష్క్రమింతురు)

విదూ—నీవిప్పు డీఁగయైన లేకుండఁ జేసితివి. అల్లదిగో వల్లికలల్లుకొన్న చెట్టు నీడం గల యాసనంబునం గూర్చుండుము. నేనును సుఖోపవిష్టుండ నయ్యెదను.

రాజు—ముందు నడువుము.

విదూ—నీవు రమ్మురమ్ము. (ఇరువురు పరిక్రమించి కూర్చుందురు)

రాజు—మాధవ్యా! నీకు నేత్రఫలము సిద్ధింపలేదు. నీవు దర్శనీయమును జూడవైతి వికదా!

విదూ—ఓయీ! నీవు నాయెదుటనే యుంటివి కదా!

రాజు—అందఱును స్వకీయమును మనోజ్ఞమనియే తలంతురు. నేన యాశ్రమ భూషణంబగు శకుంతలం గూర్చియే పలికితిని.

విదూ—(తనలో) ఇతని కవకాశ మీయను. (ప్రకాశముగా) ఓమిత్రమా! తాపస కన్యకగూడ నీకు స్పృహణీయయై కన్పట్టుచున్నదా?

రాజు—సఖా! పరిహరింపఁదగిన వస్తువునందుఁ బౌరవుల చిత్తము ప్రవర్తింప నేరదు.

విదూ—అదేమి మతి?

రాజు—

*క. సురయువతికిఁ బొడమిజనని
పరువడి విడువంగ మౌనివరునకు సుతగా
దొరకెనట! జారి జిల్లెడు
తరువున విరజాజి పూవు దగిలిన భంగిన్. 8

విదూ—(నవ్వి) ఓ చెలికాడా! స్త్రీరత్నములఁ బరాభవించు నీకీ కోరిక మొద్దు ఖర్జూరములచే మొగము మొత్తిన వానికిఁ జింతపండుపై నాసవొడమినట్లున్నది.

రాజు—నీ వామెం జూడనివాఁడవుగావున నట్లు పలుకుచున్నావు.

విదూ—నీకును విస్మయము గల్గించుచున్నది. కావున నామె సుందరియే కావచ్చును.

రాజు—మిత్రమా! వేయేల?

శా. ఆలేఖ్యంబున వ్రాసి జీవకళఁ దా సల్పించెనో? లేక రూ
పాళిం జిత్తమునన్ ఘటించి విధి రొయ్యన్ సృష్టిఁ గావించెనో?
నాలోకాసను శక్తి నింతి తనుసౌందర్యంబుఁ జింతింపఁగా
నా లీలావతి శిల్ప మన్యరచితం బౌచున్ మదిం దోఁచెడున్. 9

విదూ—అట్లైన నిప్పుడు రూపవతుల కెల్లఁ బరాభవమే.

రాజు—ఇదియును నామదినిగలదు.

మ. అనఘచ్ఛిన్న మృదుప్రవాళము ముఖానాఘ్రాతపుష్పంబు, నూ
తనమై భుక్తరసంబు గాని మధు, నంతర్వేధ మొక్కింతలే
దని రత్నంబు, నఖండపుణ్యఫలమై యొప్పారు నా లేమ పా
వన రూపంబు భుజింపఁగా నెటుల దైవం బెవ్వనిం గూర్చునో?

విదూ—అట్లైన నామెను శీఘ్రముగాఁ గాచుకొమ్ము. గారనూనెచే దలమెఱుఁగు వెట్టుకొను నెవ్వఁడవి తాపసునకైనఁ జేరఁ బోఁగలదు.

---

*క. సురకాంతకుఁ గౌశికముని
వరున కొదవి తల్లివిడువ బలె! కణ్వునకున్
దొరకెనట! జారి జిల్లెడు
తరువున విరజాజిపూవు దగిలిన భంగిన్. 23

రాజు—ఆమె పరాధీనురాలు. జనకులు చెంతలేరు.

విదూ—నిన్నుగూర్చి యామె దృష్టిరాగ మెట్లున్నది?

రాజు—తాపసకన్యకలు స్వభావమునలనఁ బ్రాగల్భ్యము లేనివారు. అట్లయ్యును.

చ. కలికికి నాకు నొక్కెడ ముఖాముఖమైనఁ గనుల్మరల్చు; న
ర్మిలి నెలనవ్వు మోమునొక నిమిత్తమునం బలెఁ గప్పిపుచ్చు; నీ
పొలుపునఁ గాంత చే వినయపూరిత భావ నిరుద్ధమార్గయై
వెలువడ నేరఁడున్, మరుఁడు వేశ్మె యణాగియు నుండఁ జాలఁడున్.

విదూ—ఏమి? చూచినంతమాత్రమున నామె నీయంశ మధిష్ఠించునా?

రాజు—చెలికత్తియలతో నొండొండ వడలిపోవునప్పుడు వినయవతి యయ్యును దెల్లముగా మనోభావమును వెల్లడించినది.

చ. గునియుచుఁ దన్వి కొన్ని యడుగుల్చని కాలఁ గుశాంకురంబు చొ
చ్చిన దని మిన్నకే సహముఁ జేకొని నిల్చె; మొగంబు నాకెలం
కునకు మలంచి శాఖలఁ దగుల్కొనకున్నను వల్కలాంచలం
బును గడు మెల్లమెల్లన విమోచనము న్నటించె నత్తఱిన్. 12

విదూ—అట్లయిన బత్తెము కట్టుకొనుము. ఈ తపోవనము నుద్యానవనముగఁ జేసితి వని యూహించుచుంటిని.

రాజు—సఖా! కొందఱు తాపసులు నన్నెఱింగియున్నవారు. ఏ మిషముచే నాశ్రమమునందుఁ జొత్తెమో యోజింపుము.

విదూ—నీకేమి మిషను? నీవు రాజవుగదా!

రాజు—అయిన నేమి?

విదూ—తాపసులంతయు నీవారధాన్యము నారణ్యకులు మాకొసంగవలయునని.

రాజు—వీరి పరిపాలనమువలన రత్నరాసులకైనఁ బాసి యూహింపఁ దగిన యొండొక భాగధేయము వచ్చుచున్నది. చూడుము.

క. భూపతుల కితరజాతులఁ
బ్రాపించెడి ఫలము క్షీణమయ్యెడి; మునుల్
తాపసు లొసఁగుదురు; వినా
శాపాయము లేని తపము నాఱవపాలున్. 13

(తెలిసి) ఆహా! కృతార్థుల మైతిమి.

రాజు—(చెవి యొగ్గి) ఓహో! ధీరప్రశాంత మైన దీ స్వరము. తాపసులు గావలయు.

(దౌవారికుఁడు ప్రవేశించును)

దౌవారి—దేవరా! జయము. ఇదే యిద్దఱు మునికుమారులు ద్వారమునొద్ద నున్నవారు.

రాజు—వారిని శీఘ్రముగాఁ బ్రవేశింపనిమ్ము.

దౌవా—ఇదిగో ప్రవేశపెట్టెదను. (నిష్క్రమించి మునికుమారులతో వచ్చి) మహాత్ములారా! యిట్టిటు.

(ఇద్దరు రాజును జూచుచున్నారు.)

ప్రథముఁడు—ఓహో! దేదీప్యమాన మయ్యు నీతని మూర్తి యెంత విశ్వసనీయముగా నున్నది? లేదా! ఋషిప్రాయుఁడైన రాజున కిది యుపపన్నమే గదా! ఏమన-

చ. అరుదుగ సర్వభోగ్యమగు నాశ్రమమం దితఁడు న్వసించు ను
ర్వర జనపాలనంబునఁ దపం బనిశంబును గూర్చుఁ; బుణ్యభా
స్వరమగు రాజపూర్వ మునిశబ్దము చారణయుగ్మగీతమై
స్ఫురదృగ సింగిముట్టఁగ జితేంద్రియుఁ డీతఁ డెసంగె నెంతయున్. 14

ద్వితీయుఁడు—గౌతమా! యీతఁడా పురుహూతవిశ్రుతుండగు దుష్యంతభూపాలుఁడా!

ప్రథ—ఔను.

ద్వితీ—కావున నే.

మ. వరపౌరార్గళ బాహుఁ డీతఁడు సరిద్వ్యాప్యమసీమాభిరా
మ రసామండల మొక్కరుండ భరియింపం జాలు టాశ్చర్యమే?
సురకాంతల్ సురవైరివైరముల నచ్చోఁ గోరుచుం డ్రీ ధను
ర్ధరు నాగోపిత చాపమున్ మఘువు వజ్రంబున్ జయార్థంబుగన్. 15

ఇద్దరు—(సమీపించి) రాజా! జయము. జయము.

రాజు—(ఆసనమునుండి లేచి) మీకు నమస్కారము.

ఇద్దరు—నీకు శుభమగుఁగాక! (ఫలములు కానుకగా నొసంగుదురు.)

రాజు—(నమస్కారముతో గ్రహించి) ఆజ్ఞాపింపఁ గోరుచున్నాను.

ఇరు—ఆశ్రమవాసులు నా యిచ్చట నున్న ట్లెఱింగి మిమ్ముఁ బ్రార్థించు చున్నారు.

రాజా—ఏమి ఆజ్ఞాపించు చున్నారు?

ఇరు—పూజ్యులగు కణ్వమహామునులు సన్నిధి లేమిని రాక్షసులు మాయజ్ఞములకు విఘ్నముఁ గల్గించుచున్నారు. కానఁ గొన్నిరాత్రు లిచ్చట సారథిసహాయుఁడవై యాయుధములతో మా యాశ్రమమును సనాథముగాఁ జేయవలయునని.

రాజా—అనుగ్రహింపఁబడితిని.

విదూ—(అపవారించి) ఇప్పుడీ ప్రార్థన మంచి యనుకూలమైనది.

రాజా—రైవతకా! శరశరాసనములతో శతాంగముఁ గొని తెమ్మని సారథితో నావచనంబుగాఁ బల్కుము.

దౌవా—దేవా! జయము. దేవర యాజ్ఞ. (నిష్క్రమించును.)

ఇరు—(సంతోషముతో)

గీ. లీలఁ దొల్లింటి వారిఁ బోలితివి గాన
నీకిది యుక్తరూపమౌ నివ్వటిల్లఁ
దలఁప నార్తాభయార్పణాధ్వరములందు
క్షితిని బురువంశ నృపులు దీక్షితులుగారె! 16

రాజా—మీరు ముందు నడువుఁడు నేను ననుపదంబుననే వచ్చెదను.

ఇరు—రాజా! జయము. (నిష్క్రమింతురు)

రాజా—మాధవ్యా! శకుంతలం జూడ వేడుక గలదా?

విదూ—తొల్లి వెల్లివిరిసినదిగాని యిప్పుడు రాక్షస వృత్తాంతముచే బిందువైన మిగుల లేదు.

రాజా—భీతిల్లకుము. నీవు నా చెంతనే యుండువుగదా!

విదూ—ఇదిగో! రాక్షసుని వలన రక్షితుండనైతి.

దౌవా—దేవరా! జయము. రథ మలంకృతంబై దేవర విజయప్రస్థానమును గోరుచున్నది. ఇదిగో! నగరమునుండి దేవిగారి యానతిఁగొని కరభకుఁడు వచ్చియున్నాఁడు.

రాజా—(ఆదరముతో) అమ్మగారిచే బంపఁబడెనా?

దౌవా—ఔను.

రాజు—అట్లయినఁ బ్రవేశపెట్టుము.

దౌవా—అట్లే. (నిష్క్రమించి కరభకునితోఁ బ్రవేశించి) ఇదిగో! దేవర సమీపింపుము.

కరభ—(సమీపించి) దేవరా! జయము. జయము. దేవు లానతిచ్చుచున్నారు. "రాఁగల నాల్గవ దినంబునఁ బారణఁ గావింపఁబడిన యుపవాస మొకటి చేయఁబోవుచున్నాను. నాటికి దీర్ఘాయువు లవశ్యముగా నుండవలయు" నని.

రాజు—ఇచ్చట తపస్వికార్యము, అటు గురుజనాజ్ఞ. రెండును మీఱరానివే. ఇందుఁ గర్తవ్య మేమి?

విదూ—త్రిశంకునివలె నంతరాళమున నుండుము.

రాజు—చాలఁ జిక్కుపాటము. నిజముగా వ్యాకులపడుచుంటిని.

గీ. కార్యములు భిన్నదేశ లగ్నంబు లగుట
మానసము రెండుపాయలై నడచుచుండె
మ్రోల శైలావరుద్ధమై జాలువాఱు
నట్టి స్రోతోవహా ప్రవాహంబుఁ బోలె. 17

(ఆలోచించి) మిత్రమా! నిన్నమ్మగారు పుత్రభావముతో గ్రహించియుండిరి. కాన నీవిచ్చటనుండి మరలిపోయి ఋషికార్యసంరంభము నెఱిఁగించి యమ్మగారి పుత్రకృత్యమును సాధింపఁ గోరెదను.

విదూ—నన్ను రాక్షస భీరునిగాఁ దలంపవుగదా!

రాజు—ఓ మహాబ్రాహ్మణా! నిన్నట్లు తలంతును?

విదూ—కావున రాజానుజుం డెట్లు పోవఁదగునో, అట్లే పోవఁగలను.

రాజు—తపోవనంబున కడ్డంకులు కలుగునని యనుచరుల నెల్ల నీతో నంపుచున్నాడను.

విదూ—అట్లయిన నిప్పుడు యువరాజ నైతిని.

రాజు—(తనలో) చపలబ్రహ్మచారి వదరుఁడు. నా మోహము నొకవేళ నంతఃపురాంగనల కెఱిఁగించు నేమో! కాని యిప్పటి కిట్లు చెప్పెదను (విదూషకుని చేయి గ్రహించి ప్రకాశముగా) మిత్రుఁడా! మహర్షి గౌరవంబునకే యాశ్రమంబు

నకుఁ బోవుచుంటివి. నిజముగా నాకుఁ దాపసకన్యకయగు శకుంతలయం దభిలాష లేదు సుమా! చూడు—

క. మనమేడ మరుని తొగముం
గనక హరిణకములఁ దోడుగాఁ బెరిఁగిన యా
జనమేడ? మేలమున కం
టిని దీని యదార్థముగ గణింపకు సఖుఁడా! 18

విదూ—సరే. (అంతట నిష్క్రమింతురు.)

ఇది ద్వితీయాంకము.

శ్రీ
శుభమస్తు.

ఆంధ్రీకృతాభిజ్ఞాన శాకుంతలము.

తృతీయాంకము.

(అంత యజమానశిష్యుఁడు దర్భలఁ గొని ప్రవేశించును)

శిష్యు — ఓహో! దుష్యంతభూపాలుండు మహాభాగుండుగదా! అమ్మహాత్ముం డాశ్రమస్థానముం బ్రవేశించినంత మాత్రముననే మాయనుష్ఠానంబు లెల్ల నిర్విఘ్నంబులుగా కొనసాగినవి.

క. శరము నరిబోయఁ జెప్పం
దరమగునే? వింటి టంకృతం బనఁదగు ధీ
ర గుణాటంకృతిచేతన
ధరణీశుఁడు దరిమె విఘ్నతతిఁ దవ్వులకున్.

వేదపరిస్తరణ నిమిత్తములకు నీదర్భలను ఋత్విజుల కొసంగెదను. (పరిక్రమించి యాకాశమున లక్ష్యముంచి) ప్రియంవదా! ఈయుశీరానులేపనంబును మృణాళములతోఁ గలిసిన పత్రంబులు నెవ్వరికై కొనిపోవుచున్నావు? (వినుట నభినయించి) ఏమనుచుంటివి? ఎండదాకుటచే శకుంతల మిగుల నస్వస్థురాలుగా నున్నదా? ఆమె తనుసంతాపము నుపశమింపఁజేయుటకు గనియా? అట్లయిన సప్రయత్నముగా జేయుము, ఆమె కులపతికిఁ బ్రాణము గదా! నేను గూడ యాగసంబంధియగు శాంతిజలము నామెకై గౌతమిచేతఁ బంపెదను. (నిష్క్రమించును.)

శుద్ధవిష్కంభము.

(అంత మదనావస్థ నటించుచు రాజు ప్రవేశించును.)

రాజు—(నిట్టూర్చి)

ఆ. ఋషి తపోమహత్త్వ మెఱుఁగుదు నాబాల
యస్వతంత్రమైన దనియుఁ దెలియు
నైన నామనంబు నామెలంతుకనుండి
లేశమును మఱల్ప లేకయుంటి. 2

(మదనబాధ నటించుచు) ఓ భగవానుఁడా! కుసుమబాణా! నీవును జంద్రుండును విశ్వసనీయులై కామిజనుల వంచించుచున్నారు. ఏమన:—

ఉ. నీకు సుమాయుధత్వమును నీరజవైరి హిమాంశుభావమున్
మాదృశులం దసత్యతఁ గనంబడె * జాబిల్లివిరోధుఁడు; జంద్రుఁడుం
బైనుహిమంబుఁ దోఁచు కరపఙ్క్తుల నిప్పుల నుమ్సు; నీవునుం
బ్రోది యొనర్చుచుంటి విదె! పుష్పశరంబుల వజ్రసారతన్. 3

స్వామీ! కామదేవా! నీకు నాయం దనుగ్రహము లేదు. (మదనబాధ నిరూపించుచు) పుష్పాయుధుండవగు నీకీ తైక్ష్ణ్య మెక్కడిది? ఆఁ! తెలిసినది.

గీ. జలధి నడుమ నీవు బాడబానలము వ్రోలె
నడరు నిప్పుడును నీయందు హరరుషాగ్ని
సత్య మటుగాకయున్న భస్మంబవయ్యు
మదన! యుష్ణుండ వగుటెట్లు మాదృశులకు. 4

లేదా—

క. ఆమదనుం దంశించుచు
నామది నొగిలించుచుండినను బ్రియతముఁడా
నా మది కీక్షణమై ని
స్సీమాటోపమున నన్ను జెండవయేనిన్. 5

మహాత్మా! కందర్పా! ఇట్లు నిందించుచున్నను నా యందు నీకుఁ గనికరము లేదు.

---

* రెండవ; చంద్రుఁడానుమయా! పాదికుసుమగర్వ

రాజు—నాయమునాఁడే యథానురూపకము గలిగినది.

శకుం—(నవ్వి) తాపమునాఁగము బలీయమైనది గదా! పిరిమైన శాకస్మికముగఁ దెల్పఁ జాలకుంటిని.

ప్రియం—సఖీ! యీమె తాపఁగాఁ బలీయమగునని అశోకపల్లవము సూచించుచున్నది. దినదినంబు నీయవయవంబులఁ గృశించుచున్నవి. కేవల లావణ్యచ్ఛాయయే నిన్ను విడుచుట లేదు.

రాజు—ప్రియంవద యథార్థముగనే పలికినది.

శా. చెక్కుల్ చాఁ గృశమొగంబు, జన్గనబిగి జేడ్పడ్డ తమ్ముంబునన్,
ప్రక్కల్ శాఁజిన కౌను, తెల్లనగు మేను, ఁగ్రుంగు మూఁపుల్ దగన్
నిక్కం బీమె మనమ్మునం దుదుకన్ జెడిమిన్ నేత్రోత్సవం బిచ్చెనుం
జొక్కంగు ల్వాడఁ జేయు గాలిపూలయున్ సొంపారు వాసంతినై. 11

శకుం—(లజ్జతో) సఖీ! నే నెవ్వరికిఁ జెప్పుదును. కాని మిమ్మిద్దఱ ధాయాస పరచినదాన నగుదును.

సఖులు—కావుననే నిర్బంధము. చెప్పఁగలుగు పంచుకొనినప్పుడే గదా దుఃఖవేదన సహ్యము గును.

రాజు—

గీ. తులిత సుఖదుఃఖలగు చెలిమి నెలఁత లడుగ
బాల హృదయార్తిఁ కిరముఁ దెల్పకయపోదు
పలుమఱుడు గాంచెనను మోము మలఁచి వలచి
యైన నిందలో విసఖిత నందుచుంటి. 12

శకుం—(లజ్జతో) సఖీ! తపోవనరక్షకుఁ డగు రాజర్షి నాదృష్టిపథము చెందినది మొదలు—(అర్ధోక్తిలో లజ్జించును.)

సఖులు—సఖీ! చెప్పుము చెప్పుము.

శకుం—తద్గతాభిలాషచే నిట్టి యవస్థకు వచ్చితిని.

రాజు—(సంతోషముతో) వినఁదగినది వింటిని.

క. సంతాపకారకుండున్
సంతాపనివారకుఁడు మనంగుఁడె నాకున్

జంతువితానమునకు గ్రీ
ష్మాంతంబున మేఘమేచకాహము వ్రాలెన్. 13

శకుం.—కాన మీకనుమతం బయ్యెనేని యీరాజర్షి నన్ననుగ్రహింపుమని ప్రార్థించుచుండుఁడు. లేదేని నాకు నీళ్ళు వదలుఁడు.

రాజు.—ఈవచనము సంశయచ్ఛేదక మైనది.

ప్రియం.—(జనాంతికముగా) అనసూయా! ఈమె వలవంత మితిమీఱియున్నది. కావునఁ గాలహరణము పనికిరాదు. ఈమె భావము పరికట్టినవాఁడు పౌరవాలంకారభూతుఁడు. కాన నీమె యభిలాష యభినందింపఁదగినది.

అన.—(జనాంతికముగా) సఖీ! నీవన్నయట్లే. (ప్రకాశముగా) సఖీ! మేలు. నీయనురాగ మనురూపమైనది. సముద్రమును విడిచి మహానది యెందుఁజేరును?

ప్రియం.—సహకారంబుగాక పల్లవించిన మాధవీవల్లి కేది యర్హమైనది?

రాజు.—విశాఖలు చంద్రరేఖ ననుసరించుట యేమివిచిత్రము?

అన.—శీఘ్రముగను గూఢముగను సఖమనోరథంబు సమకూర్పనుపాయ మెద్ది?

ప్రియం.—గూఢమనినఁ జింతగాని శీఘ్రమనిన సులభమే.

అన.—ఎట్లు?

ప్రియం.—చెలీ! ప్రేమాదృష్టిచే నీమెయం దభిలాష సూచించుచు నీరాజర్షి యిన్నిదినంబులనుండియు జాగరకృశుండై కానఁబడుచుండె.

రాజు.—నిజముగా నట్లే యుంటిని.

మ. వలవంతన్ భుజసీమ నాను కనుగ్రేవం దొల్కు నుష్ణాశ్రుసం
ఫ్రులయుంగాఁ బిశలెల, రత్నరుచి చెల్వం దక్కి జ్యాఘర్షణ
స్థలి సోకించుక యోగియైన మణిబంధస్థానముం బాండి యి
మ్ములఁ బల్లారును జాఱు హేమవలయం బున్నె నగోంద్రోయమున్. 14

ప్రియం.—(యోచించి) సఖీ! యాతనికొక మదనలేఖ లిఖియింపవలయును. దానిని పుష్పములలోఁ దాచి దేవతాప్రసాదమను మిషచే నాతనిచేతి కందించెదము.

అన.—ఇష్టమే నాకీప్రయోగము. ఏమనెదో శకుంతలా?

శకుం.—మీయాన వేఱుసేయుదునా?

ప్రియం.—కావున నీమనోగతమును దెలుపునట్టి లలితపదబంధమును ధ్యానింపుము.

శకుం—సరే ! యోచించెదను. కాని యెల్లబాటు సంశ్లిష్టమోయని నాయుల్లము తల్లడిల్లుచున్నది.

రాజు—(తనలో)

చ. నిరసనభావ మయ్యెడ గణించెద వాతఁడె భీరురాల ? నీ
కొఱ కిట నుండె నిన్నియు కోరిక లీరికలెత్త, నెమ్మదిన్
సిరిఁ గొనఁగోరు మానవుఁడు జెందును ? చెందఁడొ ? కాని తానయై
సిరియె వరించెనేనిఁ జెయిఁజిక్కిన వాఁ డెవఁడుండు ధారుణిన్. 15

ప్రియం—ఓస్వగుణావమానినీ ! నెమ్మదినిఁ హాయిఁ గూర్పు శరత్కాలచంద్రికను చేలాంచలంబున నివారించువాఁ డెవ్వఁడు ?

శకుం—ఇప్పుడు మీ యానతికి లోనైతిని. (కూర్చుండి యోచించుచు.)

రాజు—యుక్తముగదా ! రెప్పపాటు నుడిగిన చూడ్కితో నిప్పు డప్రియురాలిం జూచుచున్నాను. అల్లదే.

క. ఒక కన్బొమ నొప్పుగ మీఁ
దికి నెత్తి పదాళిఁ గూర్చు దీర్ఘముగం బు
ల్పులకల్ విలసిల్లెడు కం
టకిత కపోలమునఁ దెలుపు నాయెడ వలపుల్. 16

శకుం—చెలులారా ! గీతిని యోచించితిని. లేఖసాధనములు సన్నిధిని లేవుగదా !

ప్రియం—కీరగర్భ సుకుమారమగు నీ తామరసపత్రంబునఁ గోర నక్కరములం జెక్కుము.

శకుం—(తద్రీతిం జేసి) సఖులారా ! అర్థసంగత్య మెట్లున్నదో వినుఁడు.

సఖులు—సావధానముగా నుంటిమి.

శకుం—(చదువుచున్నది.)

క. నీయెడఁ దపాతపాఁ జెందెడి
నాయంగముల న్మిగుల్పు నళినాస్త్రుఁ డొగిన్
రేయుం బవలును; నిష్కరు
ణా ! యెఱుఁగను నిన్ను నీమనం బెట్టిదియో ? 17

రాజు—(చెచ్చెఱ సమీపించి)

ఆ. అబల నిన్ను మదనుఁ డనవరతంబును
గ్రాచుగాని నన్ను గాల్చు చుండె
దినము చందమామ తేజంబు నుడిగించు
కరణిఁ గలువతీవఁ గలఁచునొక్కొ. 18

సఖులు—(చూచి సంతోషముతో) అచిరసిద్ధమగు మనోరథంబునకు స్వాగతము.

శకుం—(లేవఁబోవుచున్నది.)

రాజు—చాలుఁజాలు నాయాసము.

గీ. విరులు నెఱసెజ్జఁ బొరలి వేవేగ సొగటు
నారు బిసభంగముల మేలి వలపుదవిలి
చుంబిత పరితాపమొందునీ యవయవములు
బూవుబోణిరో యుపచారమునకుఁ దగవు. 19

అన—ఇటు శిలాతలైకదేశమును ప్రియవయస్యుం డనుగ్రహించుఁగాక!

రాజు—(కూర్చుండును)

శకుం—(లజ్జతో మిన్నకుండును)

ప్రియం—వయస్యా! మీ యిద్దరి పరస్పరానురాగము తేటతెల్లమైనది. అట్లయ్యును సఖీస్నేహము నన్ను మాఱలఁ బలికించుచున్నది.

రాజు—కల్యాణీ! యిది విడువఁదగినది గాదు చెప్పఁదలఁచినది చెప్పకున్నచోఁ బరితాపకారణము.

ప్రియం—ఆపన్నమైన దేశజనమునకు భూభర్త యార్తిహరుండు గావలయు. ఇది మీధర్మమేకదా!

రాజు—ఇంతకన్న ముఖ్యమెయ్యది?

ప్రియం—కావున నిమా ప్రియసఖి భగవానుండగు మన్మథునిచే నిన్ను గూర్చియే యిట్టి యవస్థాంతరంబు నొందింపఁబడినది. కావున నీవె జీవితము ననుగ్రహంబుతో నిల్పఁ గోరెదము.

రాజు—కల్యాణీ! యీప్రార్థన యుభయసాధారణమైనది. ఎల్లవిధముల ననుగ్రహింపఁబడితిని.

శకుం—(సిగ్గభినయించి) చెలీ! అంతఃపుర విరహంబు వలన సంతాపమొందు చున్న యీరాజర్షి నడ్డగింతువేల?

రాజు—

గీ. మానసనివాసినీ! యనన్యానురక్త
మై తగు మదీయ హృదయ మన్యానుషక్త
మని తలఁతువేని యో మదిరాయతాక్షి!
స్మరశరోప హతుఁడనయ్యు మరల హతుఁడ. 20

అన—వయస్యా! మహీవల్లభులు బహువల్లభులని వినియుంటిమి. మా ప్రియసఖి బంధుజన శోచనీయ గాకుండ నట్లాచరింపవలయు.

రాజు—కల్యాణీ! పెక్కులేల?

క. పలువురు వల్లభ లున్నం
గులమున కొండుం బ్రతిష్ఠఁ గూర్పఁ దరువురే
జలధి మేఖల గలిగిం
యిలతో య్యేలియుం, దలంప నీ వీ చెలియున్. 21

సఖు—సాగించితిమి.

ప్రియం—(చూడ్కి విక్షేపించి) అనసూయా! ఇదిగో! అట్టిటుఁ జూచుచు హరిణ శాబక మత్యంతతోఁ దల్లిని వెదకుచున్నది. రమ్ము దీని సమకూర్తము. (బయలు దేరుదురు.)

శకుం—చెలులారా! తోడులేక యుంటిని. మీలో నొకరిట రండు.

సఖులు—ధరణీనాథుఁడే నీకుఁ దోడుగానుండెను. (నిష్క్రమించిరి.)

శకుం—ఏమి? వెడలిపోయిరా?

రాజు—తొట్రుపడవద్దు. నీ సేవకజనుఁడు చెంగటనే యుండెనుగదా!

చ. అలఁత దొలంగఁ జేయ నను నైతగు * చల్లని పిల్లతెమ్మెరల్
వెలయఁగఁ దామరాకు వలిపీవనలన్ లలి వీతునో! మహో
జ్జ్వల జలజారుణాంబుల భవచ్చరణాంబుల నంకపాళిపై
నిలయఁగ నిల్పి సౌఖ్యముగ నొత్తుదునో? కరభోరు! తెల్పుమా.

* శీతలవాతపోతములు.

శకుం.—మాననీయుల మొదల నపరాధ మొనరింపఁజాల. (లేచి అడుగులు వేయును.)

రాజు.—సుందరి ! ఎండాదినము నకఠోరముగా నున్నది. నీయవస్థయు నిట్లున్నది.

క. పూదలిమంబును డిగి, నళి ! నీదళకుచ సంవరణము నట్టియుఁ బరితా
పోదయ మృదుగాత్రములం। బైదలి యెటుబోయెదిట్టి వడదీరంగన్.

(బలాత్కారముగా మరలించును.)

శకుం.—పౌరవా ! సౌశీల్యము గాపాడుకొనుము. మదనునిచేఁ జిక్కినను స్వతంత్రురాలను గాను.

రాజు.—భీరురాలా ! గురుజనభయంబు వలదు. వినియును సకల ధర్మజ్ఞుఁడగు మహాత్ముఁడు కులపతి నీయెడ నిందు దోషారోపణం బొనర్పఁడు. చూడుము.

క. తొలి గాంధర్వవివాహ
కలనఁ రాజర్షి కన్యకలు పెక్కురు పెం
డిలియాడుటయును, దజ్జన
కులు విదపఁ వారి నియ్యకొనుటయు వినమే? 24

శకుం.—ఆర్య ! నన్నిపుడు విడుము. సకల సఖీజనుల ననుమతింపఁ జేసెదను.

రాజు.—కానిమ్ము. విడుతును.

శకుం.—ఎపుడు ?

రాజు.—

క. పోరి, గంటువడని సుమ్మగ్రో
వ్వేరి దుమ్మెద పూలె నెనరు వెలయఁగ నీనా
తేటి నమృతరసము గైకొని
వెరవున దగదీర్చుకొనిన వెనుక శుభాంగీ ! 25

శకుం.—(నాట్యమునఁ బరిహరించును.) (మొగ మెత్తఁబోవును.)

(తెరలో) చక్రవాకవధూటీ ! సహచరుని వీడ్కొనుము. రాత్రి డాసినది.

శకుం.—(చెవియొగ్గి తొందరతో) పౌరవా ! సందియము లేదు. నాదేహస్థితిని తెలిసికొనుటకై యార్యురాలు గౌతమి యిటులనే వచ్చుచున్నది. కొమ్మలచాటున దాగికొనుము.

రాజు.—(అట్లు చేయును)

(పిదపఁ బాత్రహస్తయగు తాపసియు, సఖులును ప్రవేశింతురు.)

సఖులు.—ఇట్టిటు.

గౌతమి.—(శకుంతలను జూచి) వత్సా ! నీగాత్రసంతాప ముపశమించినదా ?

శకుం—కొంచె మెఱమించినది.

గౌత—మంత్రితంబగు నీదకోపదకంబున నీశరీరంబు నిర్బాధంబుగాఁగలదు. (శకుంతల శిరముపైఁ జల్లి) వత్సా! సాయంసమయ మగుచున్నది. రమ్ము. పర్ణశాలకుం బోవుదము (బయలుదేఱిరి.)

శకుం—(తనలో) హృదయమా! మొదటనే సుఖోపలబ్ధమగు మనోరథంబు నెడలఁ గాతరభావంబు నెడబాయకుంటివి. ఇప్పుడు పశ్చాత్తాపముతో విడనాడు నీకు నుపశాంతి యెట్లు? (కొన్నియడుగులు నడిచి) (ప్రకాశముగా) సంతాపహారిణి! నిన్ను లతానికుంజమా! పునర్భోగంబుఁ గోరుచు వీడుకొనుచుంటిని. (అతికష్టముననే దరి, సహారితో నిష్క్రమించును.)

రాజు—(పూర్వస్థానమునుజేరి నిట్టూర్చి) ఓహో! వాంఛితార్థములు సిద్ధించ నధిక విఘ్నములుగదా!

చ. పలుమరు వ్రేళ్ళచే నదిమిపట్టిన వాతెఱతోడ, సారెకున్
"వల" దను వాక్యపఙ్క్తులఁ గనంబడు నివ్వెఱతోడ, మూపువై
పులకుఁ బొరింబొరిం దలఁగఁ బూను మఱల్పులతోడ, నొప్పు ప
క్ష్మలనయనాస్యమెట్లొ తిరుగం దగ ముద్దిడనైతి! నెత్తియున్. 26

ఎచ్చటికిఁ బోవుదును? లేదా! యిచ్చటనే ప్రియాపరిభుక్త నిర్ముక్తమైన యీ లతామంటపంబున ముహూర్తమాత్ర మాగెదను.

మ. ననుపాన్పియ్యదె! శాతిపైఁ గలికి మేనన్ * రాపిడిం గందె; జ
వ్వనిగోరన్ స్మరలేఖ వ్రాసియు నళినీపత్రంబిదే వాడె, నా
యనఁ జెల్వాపె మృణాళకంకణ మిదే! యంచుం గనుంగొంచు వే
దనఁ జాలంగద! వేతసాలయము శూన్యంబై యుండినన్. 27

(తెరలో) రాజా!

చ. ననుపుగ వాసరాంత సవనక్రియ లేము మొదలొల్కొనన్ హుతా
శన విలసద్వితర్దికడఁ జాల, గరాళిగతిం దనర్చి గు
ప్పున దనుజానుబింబచయముల్ చెనుపొంది ఘృతాదిపాత్రలం
గనుపడి సాంధ్యవారిధర కాపిశ దీధితు లుల్లసిల్లఁగన్. 28

రాజు—(విని) ఇదే వచ్చుచుంటిని. (నిష్క్రమించును.)

ఇది తృతీయాంకము.

---

* గండెఁ గ్లాంతాళ్ళను, ఘనపత్రంబునఁ గోరవ్రాసినదిదే! కందర్పలేఖ్యంబు; ఇ

శ్రీ

శుభమస్తు.

ఆంధ్రీకృతాభిజ్ఞాన శాకుంతలము.

చతుర్థాంకము.

(పిదపఁ గుసుమావచయము నిరూపించుచు సఖులు ప్రవేశింతురు.)

ప్రథమ—సఖీ! ప్రియంవదా! గాంధర్వకల్పంబునఁ బరిణయం బైన మన శకుంతల తగినవరునిఁ గాంచెనని నాహృదయము సంతసించుచున్నది. ఐన నొక్కటి చింతింపవలసియున్నది.

ప్రియం—అదేమి?

అన—"ఇక్ష్వాకు రాజర్షి సవనాంతమున ఋషులచే వీడ్కొల్పఁబడి నిజనగరముం జొచ్చి మంతిపురంబుఁ జేరి యిచటి వృత్తాంతంబుఁ దలపోయునా లేదా?" యని.

ప్రియం—నమ్మిక గల్గియుండుము. అట్టి యాకృతివిశేషములు గుణవిరోధము నొందఁజాలవు. జనకుఁ డిప్పుడీ వృత్తాంత మాలకించి యేమను కొనునో యెఱుఁగఁజాల.

అన—నేనూహించినట్లు యతని కనుమతము.

ప్రియం—ఎట్లు?

అన—గుణవంతునకై కన్యక నీయవలయు నను నదియే జనకుని మొదటి సంకల్పము. దానిని దైవమే నెఱవేర్చినచో ననాయాసముగానే గురుజనము కృతార్థం బయ్యెఁగదా?

ప్రియం—(పూవులసజ్జఁ జూచి) సఖీ! పూజకుం జాలిన పూవులఁ గోసితిమిగదా!

అన—శకుంతల సౌభాగ్య దేవతం గూడ నర్చింపవలయుఁగదా!

ప్రియం—ఔనౌను. (మఱలఁ బువ్వులఁ గోయుచున్నారు)

(తెరలో) ఓహో! ఇదే! నేను!

అన—(విని) అతిథి భవనమునకు వచ్చెను.
ప్రియం—శకుంతల పర్ణశాలయందున్నదిగదా!
అన—మనసు లేదు.
ప్రియం—కాని మిక్కిలి నమస్కరించును. (బైలుదేరిరి.)
(తెరలో) ఆఁ! అతిథి పరిభావినీ!

చ. తొలఁగక నీ వనన్యమతితో మది నెవ్వనిఁ జింత సేయుచుం
దెలియక యుంటి చెంతకరుదెంచు తపోనిధి నైన నన్ను, వాఁ
డొలసి బహుప్రకారముల నోరిమి మై నెఱిఁగించినన్ మదో
త్కలితుఁడు పూర్వభాషితము కైవడి నిన్ దలపోయకుండుతన్. 1

అన—అన్నన్నా! అట్లే జరిగినది. శకుంతల మనస్స్వాస్థ్యము లేక పూజార్హుడైన యెవ్వరియెడలనో యపచారమొనర్చినది. (ముందుఁ జూచి) ఎవ్వరి యెడలనో కాదు. ఇదిగో! సులభకోపుఁడగు మహాఋషి దుర్వాసుఁడు. అట్లు శాప మిచ్చి నివారింపరాని వేగముతో మరలిపోయెను. వీతిహోత్రుఁడు గాక దహింపఁగలవాఁ డెవ్వఁడు? పదపద! పాదముల పైఁబడి మరలింపు మాయనను. నే నర్ఘ్యోదకంబుఁ గొనివచ్చెదను.

ప్రియం—అట్లే. (నిష్క్రమించెను.)

అన—(అడుగులోఁ దొట్రుపాటు నిరూపించి) అన్నా! తొందరతోనే నడుగులు తడఁబడ నా హస్తాగ్రమునుండి పూలసజ్జ జారిపోయినది.

(పూవు లేరుచున్నది.)

ప్రియం—(ప్రవేశించి) సఖీ! అప్రకృతి కుటిలుఁడు నాయన మనయందు యెందుఁ గై కొనునా? కొంచెము దయదలఁచునట్లుమాత్రము చేసితిని.

అన—(చిఱునవ్వుతో) అతనియం దిదియును గొప్పయే. చెప్పుము చెప్పుము.

ప్రియం—అతఁడు మరలి రానన్న మరలఁ దలంపనపుడు నేనిట్లు విన్నవించితిని.

అన—ఎట్లు?

ప్రియం—"మహాత్మా! తొలుతటి భక్తిగైన కొంచె మెఱుఁగక ప్రభావము తెలియంగని మీ కొమారి గావించిన యీ యపరాధమును మన్నింపు" మని.

అన—తర్వాత తర్వాత.

ప్రియం—పిదప నాతఁడు 'నా వచన మన్యథా కాఁజాలదు. అయిన నభిజ్ఞాన భూషణ సందర్శనంబున శాపము మరలఁగల' దని పలుకుచునే యంతర్ధాన మొందెను.

అన—ఇప్పు డూపిరి పీల్చవచ్చును. కలదు వెడలిపోవు నా రాజర్షి నిజనామాంకితంబగు

నంగుళీయకము సంస్మరణార్థమై తానే వేలనుంచె. కాన శకుంతల కుపాయము చేపడియుండును.

ప్రియం—రమ్ము. ఈమె దేవపూజ నిర్వర్తింతము. (తిరుగుదురు.)

ప్రియం—(చూచి) అనసూయా ! చూడుమీ మన ప్రియసఖి వామహస్త విన్యస్తవదనయై చిత్తరువు పోలియున్నది. వల్లభాయత్తచిత్తయై యీమె తన్నే తా నెఱుంగకున్నది. ఇంక నతిథి నేమెఱుంగును ?

అన—ప్రియంవదా ! ఈవృత్తాంతము మన యిద్దరినోటనే యుండవలెను. ప్రకృతి సుకుమారియగు ప్రియసఖిం గాపాడవలయుం గదా !

ప్రియం—విరజాజిని వేడినీళ్ళ నెవరు తడుపుదురు ? (నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

(పిదప సుప్తోత్థితుండగు శిష్యుండు ప్రవేశించును.)

శిష్యు—ప్రవాసమునుండి మరలివచ్చిన కణ్వభగవానుఁడు వేళఁ దెలియ నాకానతిచ్చి రి కానఁ బయటి కేగి చూచెద నెంత రాత్రి కలదో ? (పరిక్రమించి చూచి) ఓహో! తెల్లవారినదిదే.

ఉ. ఒక్కెడ నస్తశైలశిఖరోపగతుం డగుచుండెఁ జంద్రుఁ డిం
కొక్కెడ లోకబాంధవుఁ డనూరుపురస్సరుఁడౌచుఁ దోఁచె; ని
ట్లొక్కటఁ జిత్రభంగి వ్యసనోదయముల్ గను రెండు తేజముల్
చక్కఁగఁ బ్రాణికోటుల దశాంతరము న్వివరించెనో యనన్. 2

మఱియు—

చ. సమరసుఁడౌ సుధాకరుఁడు జాఱుపడంగ మదీయదృష్టి కా
కుముదిని యే ప్రమోద మొనగూర్పదు సంస్మరణీయశోభ; ని
క్కము హృదయేశ్వరుం డెడయఁగా నెదఁగూరినయట్టి తీవ్రదుః
ఖము లతిదుస్సహంబు లగుఁగాదె ? లతాంగుల కెల్ల భంగులన్. 3

అన—(పటాక్షేపమునఁ బ్రవేశించి) విషయపరాఙ్ముఖుం బగు నీ జనమ్మునకుఁ గూడ నిది యిట్లు దెలియుచున్నదే ? అట్టి రాజు శకుంతల యెడల నెట్టి యనార్యత్వ మాచరించెను ?

శిష్యు—హోమవేళ తారసిల్లెనని గురువులకు నివేదింతును. (నిష్క్రమించును.)

అన—లేదా ! తెలిసినమాత్రమే నేమి చేయఁగలను ? అకృత్యంబులం గూడ నాకు కాలుసేతు లాడకున్నవి. కాముఁడిప్పుడు బరిపూర్ణకాముండగుఁగాక ! [illegible]-

యైన యీశకుంతల నాసల్లరివానిపై నిలువరించెఁ గదా! లేదా? దుర్వాసుని కోపమిట్లు వికారపరచుచున్నదేమో? కాకున్న నారాజర్షి యన్ని బాసలు జేసి యింతవరకు నొకజాబునైన నంపకుండునా? కాన నివ్వటినుండి యీన వాలుఁగ నంగుళీయక మంపెదను. దుఃఖశీలురగు తాపస జనుల బ్రార్థనం జేయఁ దాలించును? దుష్యంత పరిణీతయై శకుంతల గర్భవతియయ్యెనని ప్రవాసాగతుండగు జనకకాశ్యపున కెఱింగింపఁ బూనియు నెచ్చెలియొడల నేరమెంచునో యని సిద్ధపడఁ జాలకుంటిని. ఇట్టియెడ మాకుఁ గరణీయ మెయ్యది?

ప్రియం—(ప్రవేశించి సంతోషముతో) సఖీ! త్వరపడుము. త్వరపడుము. మన శకుంతలకుఁ బ్రస్థాన మంగళము నెఱవేర్పవలయు.

అన—సఖీ! యెట్లిది?

ప్రియం—వినుము. ఇప్పుడు సుఖనిద్రవడుగుటకై శకుంతల చెంతకేగితిని.

అన—తర్వాత తర్వాత.

ప్రియం—వ్రీడావనత ముఖియైన మన సఖిం గౌఁగిలి చుకొని జనకకాశ్యపుం డిట్లభినందించె. 'మేలుమేలు! యజమానుఁడు ధూమావరుద్ధ నేత్రుండైన నతుచేత యాహుతి పావకునియందే నిపతితంబైనది. వత్సా! సచ్ఛిష్యున కొసంగఁబడిన విద్య యొడలం బోలె నీయొడలను నాకుఁ జింతింప బనిలేదు. రాజర్షి పరిగృహీతవగు నిన్ను నీమనఃకాంతు చెంత కంపెదను.' అని.

అన—మఱి జనక కాశ్యపుల కీ వృత్తాంత మెవరు దెల్పిరి?

ప్రియం—అగ్నిశాల కరిగినప్పుడు ఛందోమయంబగు నశరీరవాణి.

అన—(ఆశ్చర్యముతో) చెప్పుము. చెప్పుము.

ప్రియం—

ఆ. అవని కలిమిబలిమి నలర దుష్యంత భూ
రమణ నిహిత తేజ మమరఁ దాల్చి
యొసఁగు నీకుమారి నెఱుఁగుమీ బ్రహ్మర్షి
చంద్ర! వహ్నిగర్భశమిని బోలె. 4

అన—(ప్రియంవదం గౌఁగిలించుకొని) సఖీ! సంతోషము! సంతోషము! కాని శకుంతల యిప్పుడే యెడలిపోవునని వెంగతోఁ గూడిన సమ్మోద మనుభవించుచుంటిని.

ప్రియం—సఖీ! మనవెంగ లేమి? ఆతపస్విని సుఖియించునిమ్ము.

అన—కాన నీ చూతశాఖయందలి నారికేళ సంపుటంబునఁ జిరకాలస్థాయియగు కేసర కుసుమ మాలిక నామొగంబునఁ దాఁచియుంచితిని దానిం గేలనందుకొనుము.

నేను నీ మెడకు గోరోచనంబును దీర్థమృత్తికను గరిక చిగుళ్లను మంగళాంగ రాగ మొనరించెదను.

ప్రియం—అట్లు చేయుము.

అన—(నిష్క్రమించెను)

ప్రియం—(నాట్యముతోఁ గుసుమభాజనముం గొనుచున్నది.)

(తెఱలో) గౌతమీ! శకుంతలం బుత్తెర శార్ఙ్గరవాదుల నాపెట్టుము.

ప్రియం—(చెవి యొగ్గి) అనసూయా! త్వరపడుము. త్వరపడుము. ఇదిగో! కరినగర గామికేగు మునులం బిలుచుచున్నారు.

అన—(అంగరాగముఁ గైకొని ప్రవేశించి) సఖీ! రమ్ము పోవుదము. (పరిక్రమింతురు.)

ప్రియం—(చూచి) ఇదిగో! భానూదయంబున నభ్యంజనస్నాన మాచరించి, నీవార కణికలు గైకొని స్వస్తివాక్యంబులం బలుకు తపస్వినీ జనంబుచే నభినంద్యమానయై శకుంతల యిటఁ గూరుచున్నది. ఈమెను సమీపింతము. (దగ్గఱ కేగుదురు)

(పూర్వోక్తరీతి నాసీనయై శకుంతల ప్రవేశించును)

ఒకతాపసి—(శకుంతలం జూచి) వత్సా! భర్తృగౌరవమునకు సూచకముగా మహాదేవి! యని పిల్వఁబడుదువుగాక!

మఱియొకతాపసి—పుత్త్రి! వీరమాతవు గమ్ము.

వేఱొకతాపసి—బిడ్డా! భర్తకు బహుమతురాలవు గమ్ము.

(గౌతమి దక్కఁ దక్కిన తపస్వినులు నిష్క్రమించిరి.)

సఖులు—(సమీపించి) సఖీ! నీకు సుఖస్నాన మయ్యెనా?

శకుం—నా ప్రియసఖులకు స్వాగతము. ఇచటఁ గూర్చుండుఁడు.

సఖులు—(మంగళపాత్రములఁ గ్రహించి కూర్చుండి) సఖీ! శకుంతలా! సిద్ధురాలవు గమ్ము. నీకు మంగళాంగరాగము రచియింతుము.

శకుం—ఇది బహుమాన పాత్రముగదా! చెచ్చెలుల యలంకరణ మింకనాకు దుర్లభము (కన్నీరు నించును.)

సఖులు—సఖీ! కల్యాణ కాలమున రోదన మనర్హము.

(కన్నీరుఁ దుడిచి నాట్యమున నలంకరింతురు.)

ప్రియం—సఖీ! ఆభరణోచితంబగు నీస్వరూపమునకుఁ దపోవనసులభంబులగు నీయలంకారములు వికారమును గల్గించెడిని.

(పిదపఁ గానుకలు గైకొని ఋషికుమారులు ప్రవేశింతురు.)

ఋషికుమారులు—ఇవిగో ! సొమ్ములు. ఈమెకుఁ గైసేయుఁడు.

(అందఱుఁ జూచి యచ్చెరువందుదురు.)

గౌతమి—వత్సా ! నారదా ! ఎక్కడివివి ?

ప్రథముఁడు—తండ్రి కాశ్యపుని మహిమవలన.

గౌతమి—మనస్సృష్టియా యేమి ?

ద్వితీయుఁడు—కాదు వినుము. శకుంతలకై తరువులనుండి కుసుమములుగోసి తెండని కాశ్యపులవారు మా కానతిచ్చిరి. అంత నిపుడు,

మ. తరువృక్కంబు సుధాంశుగౌరమగు భద్రక్షౌమ మర్పింపఁగాఁ
జరణాలంకరణానురూపమగు లాక్షారాగ మొండిచ్చెఁ; నీ
సరణిన్ వృక్షములెల్లఁ బల్లవరుచిస్ఫారంబులౌ పర్వావి
స్ఫురణాంచ ద్వనదేవతా కరములన్ భూషాళి నిచ్చెం గడున్. 5

ప్రియం—(శకుంతలం జూచి) సఖీ ! ఈవనదేవతానుగ్రహము, వల్లభాగారమున నీ వనుభవింపఁబోవు రాజ్యలక్ష్మిని సూచించుచున్నది.

శకుం—(లజ్జను నిరూపించు చున్నది.)

ప్రథ—గౌతమా ! రమ్మురమ్ము. స్నానమునకేగిన కాశ్యపులవారికీ వనస్పతి సేవ – నెఱిఁగింతము.

ద్వితీ—అట్లే. (నిష్క్రమింతురు.)

అన—సఖీ ! మేము భూషణోపయోగ మెఱుంగము. అయినను చిత్రనిర్మాణ కౌశలంబున నీ యంగంబుల నాభరణంబు లలంకరించుచుంటిమి.

శకుం—మీ నైపుణ్య మే నెఱుంగుదును.

సఖు—(అలంకరణము నటింతురు.)

(అంత స్నాన మొనర్చివచ్చి కాశ్యపుడు ప్రవేశించును.)

కాశ్య—

చ. అరిగెడు నా శకుంతల యటంచు మనంబున బెంగఁగూరెఁ; దు
ష్కరమగు నశ్రురోధమునఁ గంఠము మగ్గె; వలంతిఁ జూడ్కి సొం
పఱె; వనవాసినేన యకటా! యిటులర్మిలిఁ గుంద నింక నె
ద్దుర తనయావియోగ నవదుఃఖము గేస్తుల నెట్టు లేచునో ? 6

(పరిక్రమించును.)

సఖు—సఖీ ! శకుంతలా ! అలంకరణ విధానమైనది. ఇప్పుడీ దుకూలయుగళమున్ ధరియింపుము.

శకుం—(లేచి ధరియించుచున్నది.)
గౌత—వత్సా! హర్షరసంబు వెల్లివిరియు వీక్షణంబునఁ గౌఁగిలించుకొనువాఁడునుం బోలె నీజనకుఁ డరుగుదెంచె. ఉచితాచారంబు నిర్వర్తింపుము.
శకుం—(లజ్జతో) తండ్రీ! నమస్కరించుచుంటిని.
కాశ్య—వత్సా!

గీ. అల యయాతికి శర్మిష్ఠవలెనె నీవు
పతికి బహుమాన భాజనంబవయి మనుము.
ఆమె పూరునివలె సార్వభౌముఁ డయిన
సుతుని గనుమమ్మ లోకసమ్మత గుణాఢ్య. 7

గౌత—మహాత్మా! ఇవి రెండును వరములుగాని దీవనలుగావు.
కాశ్య—వత్సా! యిటురమ్మ. ఇప్పుడే హోమమొనర్చిన వీతిహోత్రులకుఁ బ్రదక్షిణముఁ జేయుము. (అందఱుఁ బరిక్రమింతురు.)
కాశ్య—(ఋక్ఛందస్సుచే నాశీర్వదించుచున్నాఁడు.)

*శ్లో. "అమీ వేదిం పరితః క్లుప్తధిష్ణ్యా
సమిద్వంతః ప్రాంతసంస్తీర్ణదర్భాః
అపఘ్నంతే దురితం హవ్యగంధై
ర్వైతానాస్త్వాం వహ్నయః పావయస్తు." 8

ఇంకఁ బ్రయాణముగమ్మ. (చూడ్కి నిగుడించి) ఆశార్ఙ్గరవాదు లెచ్చటః
శిష్యులు—(ప్రవేశించి) మహాత్మా? ఇదే వచ్చితిమి.
కాశ్య—శార్ఙ్గరవా! నీసహోదరికి మార్గముం జూపుము.
శార్ఙ—అమ్మా! యిట్టిటు.
శకుం—(పరిక్రమించుచున్నది.)
కాశ్య—ఓహో! సన్నిహిత దైవతంబులగు తపోవన వృక్షములారా!

ఉ. ఎయ్యది మీకుఁ దొల్త జలమీయక క్రోలదు; భూషణేచ్ఛ రా
లయ్యు భవత్ప్రవాళము దయామయతన్ ధరియింపదేది; మీ

గీ. తిన్నె వేదిక నిల్చినవి దెసలఁ గుశల
నలరి, సమిధల నాజ్యంబులయి వెల్గి
హవ్యసౌరభముల దురితాళి నడఁచు
చుండు పవనాగ్ను లెపుడు రక్షించు నిన్ను.

కొయ్యాన మున్ను మున్ను గుసుమోద్గమమైనను జేసికుత్సవం
బయ్యెడు; నా శకుంతల ప్రియాంతికముం జను, నాజ్ఞయీయరే.

(కోకిలాలాపమును నిరూపించి.)

గీ. తనయ వనవాసబంధువుల్ తరువులెల్ల
మాశకుంతల బోవ సమ్మతినొసంగెఁ;
గలవికస్వరమైన పికస్వరమున
బదులు నల్కినభంగిఁ బెంపొదవు నిట్లు. 10

(ఆకాశమున-)

మ. నళినీహృద్య సరశ్చయం బెడనెడన్ రాజిల్ల ఛాయాద్రుమా
వళిమార్తాండ మయూఖ తాపము నడంపం, దమ్మిక్రొంబుప్పొడిం
బలె నింపౌ మృదురేణుజాలము దలిర్పం గాంత శాంతానుగా
నిలముల్ వీవఁగదీని మార్గము శుభోన్మేషంబునం బొల్చుతన్. 11

(అందఱు వింతతో వినుచున్నారు.

గౌత—వత్సా! బంధువాత్సల్యంబు నెఱపు తపోవనదేవతలు నీప్రయాణమున కిదే యనుమతి నొసంగుచున్నారు. మ్రొక్కు మీభగవతులకు.

శకుం—(నమస్కారముతోఁ బరిక్రమించి జనాంతికముగా) సఖీ! ప్రియంవదా! ఆర్యపుత్రునిం జూడ వేడుకగలదాననైనను దపోవనము విడిచి పోవుటకు నాయడుగు లతికష్టముచే ముందు సాగకున్నవి.

ప్రియం—తపోవనము నెడబాయ నీకే పరితపించుటలేదు. నిన్నెడబాయఁజాలక తపోవనము గూడఁ జూడు మెట్టియవస్థనున్నదో ?

గీ. మృగకదంబంబు దర్భల మేఁత లుడిగె
బర్హిణంబులు నృత్త వైభవము నడచె
నురలు కారాకులను రాల్చు చుండులతలు
బాష్పకణముల దొరఁగించు పగిదిఁదోఁచె. 12

శకుం—(స్మరించి) తండ్రీ! లతాసహోదరి వనజ్యోత్స్నను సెలవడిగి వచ్చెదను.

కాశ్య—ఎఱుఁగుదును నీకు దానిపై సోదరీస్నేహము. ఇదే! కుడిప్రక్క.

శకుం—(లతం జేరి) వనజ్యోత్స్నా! నీవు చూతములతో నెనసియున్నను నాపై బ్ర

కొంతయు శాఖాభుజంబుల నల్లుకొన్నది గాఁగిలించుకొనుచున్నది. ఇది యెందు నీకు మఱవరాని దాఁగవలెనుగదా !

కాశ్య—

ఉ. ఏనిను గూర్చి తొల్లి గణియించినరీతి నదృష్టసంపదన్
మానితవల్లభున్ నిజసమానుని గాంచితి; వీరసాలభూజ
మానుగఁ జేరఁ బాఱె ననమాలిక యిద్దియు; గాన నేనిఁకన్
దీనికి నీకునై వగవనేర మనంబున నించుకేనియున్. 13

ఇటు దారికి రమ్ము.

శకుం.—చెలులారా ! దీని మీయిద్దఱి చేతుల నుంచుచుంటిని.

సఖులు—మమ్ముల నెవ్వరిచేత నుంచెదవు. (కన్నీరు నించుచున్నారు.)

కాశ్య—అనసూయా ! దుఃఖింపవలదు. మీ రిక వా ! శకుంతలను నోదార్పవలయు వారు ? (అందఱుఁ బరిక్రమించుచున్నారు.)

శకుం.—తండ్రీ ! పర్ణశాలచెంత గర్భభారంబుచే మెల్లమెల్లఁ దిరుగు నీహారిణికాంత సుఖప్రసవ యైనతోడనే నాకు సంతోషవార్త నంపుము.

కాశ్య—కానిమ్ము. ఇది మాత్రము మఱచియుండను.

శకుం.—(గమనభంగమును నిరూపించి) ఏమోగదా యిది ! మాటిమాటికిఁ జీరచెఱఁగు దగులు చున్నది. (వెనుక మఱలి చూచును.)

కాశ్య—వత్సా

గీ. నోట దర్భాంకురము నాటఁ బోటి గంటు
మాన్పఁగాఁ గారనూనె నేమమున రాచి
చామపిడికిళ్ళఁ బ్రోచిన యీ మృగంబు
విడని నీదారిఁ బోవుచు కొమరుగాన. 14

శకుం.—బిడ్డా ! సహవాసమును బాసి పోవు నన్నేల వెంబడించెదవు ! కన్నతోడనే తల్లి విడిచినను పెంచితిని. ఇప్పుడు నన్నుఁగూడ నెడబాసియు నిన్ను దండ్రియే పరికించుచుండును. మఱలిపొమ్ము. (ఏడ్చుచు బయలుదేఱును.)

కాశ్య—గీ. తెఱచు కన్నుల దృష్టి మందీభవింపఁ
జేయు బాష్పంబు శాంతింపఁ జేయుమమ్మ !
కలయ నిమ్నోన్నతంబులు గానఁబడమి
నీపదంబులు గొట్టు సంధిల్లెనిందు. 15

శార్ఙ్గ — మహాత్మా! జలసమీపమునంతే ప్రియజనుల సాగనంపుట యాచారము. కాన నిదిగో! సరస్తీరము. ఇందు మాకు సందేశం బానతిచ్చి తాము మరల వచ్చును.

శార్య — కాన పాలవెట్టు నీడ నాశ్రయింతము. (అందఱుఁ బరిక్రమించి నిల్తురు.)

శార్య — (తనలో) పూజ్యుఁడగు దుష్యంతున కత్యనుకూలముగా మనము సందేశింప వలసినదేది? (ఆలోచించుచుండును.)

శకుం — (జనాంతికముగా) సఖీ! వలవలఁ జూడుము. తామరాకుమాటున నున్న నను సహచరుని గానక చక్రవాకాంగన తత్తరతోఁ గూయుచున్నది. నేను మాత్రము దుష్కర మొనర్చుచుంటిని గదా!

అన — సఖీ! అట్లనఁబోకుము.

క. తన ప్రియు నెడబాటున రా
త్రినిగడపెడు నిదియు శోకదీర్ఘతరముగన్
ఘనమగు నాశాబంధం
బనయము విరహార్తమంబు హరియించుఁగదా! 16

శార్య — శార్ఙ్గరవా! శకుంతలను ముందుకొని నామాటగా నీవు రాజుతోఁ బల్కుము.
శార్ఙ్గ — మహాత్మా! యానతిండు.
శార్య —

ఉ. ాపము తపోధనాధికుల మెంచు మహార్ఘము నీకులంబు, నా
డా మెయి బాంధవానుమతి నందక నిన్నదిచేరె, నట్టులో
నీమది మెప్పు నెంచి గృహిణీతులితప్రతిపత్తిఁ గాంచుమా!
పై మఱి దీనిభాగ్య మది బాలికబంధులు దెల్పరాదుగా. 17

శార్ఙ్గ — సందేశముం గ్రహించితిని.
శార్య — వత్సా! నీకును బోధింపవలసియున్నది. చూడుము మేము వనవాసులమయ్యు ను లోకజ్ఞానము గలవారము.

శార్ఙ్గ — ధీమంతులకు గోచరింపనిదేది?
శార్య — కాన నీవు నిలు భర్తృగృహమునఁ జేరి—

మ. నిరతిం బూజ్యులఁగొల్వు; చెల్మిని సపత్నీలోకముం జూడుము; క్ర
ొధ్యుఁడై కోపించిన నాథుపై నెదిరి రోషంబూనఁగాఁబోకుము; ని

శ్వశుర దాక్షిణ్యత భృత్యులంగనుము; సంపద్గర్వమున్ మానుము; కాం
తుఁడు కాంతల్ గృహిణీపదంబిటు; కులాధుల్ గాఁ బెరయున్వ్యాంగనల్

గౌతమి యభిప్రాయ మేమి !

గౌత—వధూజనులకు బోధింపవలసిన దింతమాత్రమే. వత్సా ! యీసర్వంబును జ్ఞప్తి యందుంచుకొనుము.

కాశ్య—వత్సా ! నన్నును సఖీజనులం గౌఁగిలించుకొనుము.

శకుం—తండ్రీ ! ప్రియంవద మొదలు గల చెలులందఱు నిచ్చటినుండియే మరలి పోవలదా ?

కాశ్య—తనయా ! వీరు నొకరి కీయఁదగినవారే, వీరచ్చటి కరుగుట యనర్హము; నీతో గౌతమి రాఁగలదు.

శకుం—(తండ్రిని గౌఁగిలించుకొని) ఇపుడు తండ్రి యంకంబు నెడబాసి మలయాచలంబునుండి పెకలింపఁబడిన గంధపు దీఁగవోలె దేశాంతరంబున నెట్లు జీవింపఁగలను ?

కాశ్య—కుమారీ ! ఇట్లు భయపడెదవేల ?

మ. అభిజాతుండగు ప్రాణనాథునకు నిమ్మా పట్టపున్ రాణివై,
విభవప్రాదగ్ర తదీయ కృత్యముల నేవేళం బ్రవర్తిల్లి, వే
శుభలీలన్ సుతుఁ దూర్పు భానువలెఁ బూజ్యుంగాంచియున్ మద్వి
యోగ భవార్తిన్ హృదయంబునం దలఁప విఁకం బుత్త్రికారత్న
మా ! 19

శకుం—(తండ్రి పదముల కెఱఁగును)

కాశ్య—ఇష్టసిద్ధియగుఁగాక !

శకుం—(సఖులం జేరి) చెలులారా ! మీరిద్దఱు నన్నొకసారి గౌఁగిలించుకొనుఁడు.

సఖులు—(అట్లుచేసి) సఖీ ! యొకవేళ నా నృపాలుం డానవాలు పట్టఁజాలఁడేని దన్నామాంకితం బగు నియ్యంగుళీయకం బాతని కపుడు చూపుము.

శకుం—చెలులారా ! మీ సందియంబుచే నదలుచుంటిని.

సఖు—అమ్మా ! భయపడకుము. అతిస్నేహ మనర్థము నాశంకించును.

శార్ఙ—అమ్మా ! చాలప్రొద్దెక్కినది. త్వరపడవలయును.

శకుం—(ఆశ్రమమువైపు దిరిగి) తండ్రీ ! మరల నీతపోవనం బెన్నఁడు జూడఁగలను ?

కాశ్య—వినుము.

మ. క్షమఁ జాలేండ్లు చతుర్దిగంత ధరణీ సాపత్న్యముం బూని, యు
త్తముఁడై యప్రతిమానుఁడైన తనయున్ దౌష్యంతిఁ బెంపొందఁగాంచి, త
త్సముపన్యస్త కుటుంబభారుఁడగు భర్తం గూడి, యిత్తపోవనా
శ్రమభూమిన్ వసియింప రాఁగలవు వత్సా! క్రమ్మఱం బిచ్చటన్. 20

గౌత—బిడ్డా ! ప్రయాణవేళ మించుచున్నది. నీతండ్రిని మరలింపుము. కాదేని యింతసేపయిన నీతఁడిట్లే మరలమరలఁ జెప్పుచుండును. నీవే మరలిపొమ్ము.

కాశ్య—వత్సా ! నాతపోనుష్ఠాన మతిక్రమించుచున్నది.

శకుం—(మరలఁ దండ్రిని కౌఁగిలించుకొని) తపశ్చర్యచేఁ బీడింపఁబడిన నాతండ్రి దేహము మరల నానిమిత్తమై మఱియును వగచే నలసిపోవును.

కాశ్య—(నిట్టూర్పుతో)

క. తీరుగ నీచే నుటజ
ద్వారప్రాంతమున నునుపఁబడి మొలిచిన నీ
వారబలిఁ గాంచు నాకుఁ గు
మారీ మదిశోక మింక మానుట యెట్లో? 21

పొమ్ము నీమార్గంబులు శుభంబులగుఁగాక ! (శకుంతలయు సహాయులును నిష్క్రమింతురు.)

సఖు—(శకుంతలం జూచి) అక్కటా ! ప్రియసఖి శకుంతల గానరాకుండ నీవనశ్రేణి యడ్డగించెఁగదా !

కాశ్య—(నిట్టూర్పుతో) అనసూయా ! మీసహచారిణి తరలిపోయినది. మీరును దుఃఖము నరికట్టినాతో బయలుదేరి రండు.

సఖు—తండ్రీ ! శకుంతలలేక చిన్నబోవు తపోవనము నెట్లు జొత్తుము.

కాశ్య—స్నేహప్రవృత్తి యట్లనిపించును. (విమర్శతోఁ బరిక్రమించి) ఆహా ! శకుంతలం బంపి స్వస్థుండ నైతిని. ఏమన:—

గీ. కన్యయనఁ బెంచఁగా మఱొక్కని ధనంబు
దాని జేపట్టు వాని చెంత కిపుడనిపి
యధిక వైశద్య మొందె నాయంతరాత్మ
యిల్లడను వెండి తత్స్వామి కిచ్చినట్లు. 22

(అందఱు నిష్క్రమించిరి.)

ఇది చతుర్థాంకము.

శ్రీ

శుభమస్తు.

ఆంధ్రీకృతాభిజ్ఞాన శాకుంతలము.

పంచమాంకము.

(పిదప సింహాసనస్థుఁడై రాజును విదూషకుఁడును బ్రవేశింతురు.)

విదూ—(చెవియొగ్గి) ఓచెలికాఁడా! సంగీతశాలలో సావధానుఁడవై వినుము. అవ్యక్త మధురమ్ముగు శుద్ధగీతియందు స్వరయోగము వినవచ్చుచున్నది. హంసపదికా దేవి వర్ణము లభ్యసించుచున్నదని యూహించెదను.

రాజు—మిన్నకుండుము ఆలకింతును.

(ఆకాశమున గీతము వినఁబడును.)

క. మధుకర! నీవటు లభినవ
మధురతి ముద్దిడిన మావిమంజరి నిపు డే
విధి మరచితి? వంబుజ స
న్నిధి నిల్చినమాత్ర గల్గు నిర్వృతికలిమిన్. 1

రాజు—ఓహో! రాగంబు వెల్లిగొల్పుచున్న దీగీతి.

విదూ—గీతికేమి? అక్షరార్థ మవగతంబైనదా?

రాజు—(చిఱునవ్వుతో) ఈమెతో నొకసారి చెలిమిచేసితిని. కాన వసుమతీదేవిం గూర్చి నన్నామె నిందించుచున్నదని యూహించెదను. సఖా మాధవ్యా! "నిపుణముగా నుపాలంభించితి" వని హంసపదికతో నామాటగాఁ జెప్పుము.

విదూ—నీయాజ్ఞ (లేచి) ఓచెలికాఁడా! అప్సరలచే విరక్తుఁడగు మునిపోలెఁ బరహస్తములలోఁ జిక్కఁబట్టఁబడిన నాకాపెచే మోక్షము సంభవింపదు.

రాజు—పొమ్ము. నాగరికవృత్తితోఁ జెప్పుము.

విదూ—ఏదిగతి (నిష్క్రమించును.)

రాజు—(తనలో) ఏమో కదా! యేమసిధార్థమైన గీతము నాలకించి యిష్టజన విరహము లేకపోయినను మిగుల నుత్కలపడుచుంటిని. లేదా—

చ. లలితములం గనుంగొని, కలస్వనముల్ వినియున్, సుఖోదయుం
బాలసిత ప్రాణియైనఁ గడు నుత్కలపాటు వహించు నెల్లఁ దెం
పలరఁగ నాత్మనిష్ఠ జననాంతర సంగత సౌహృదంబులం
దెలియక యుండినైనను మదిం దలపోయుటఁబట్టి కాదొకో? 2

(వ్యాకులుఁడై యుండును.)

కంచుకి—(ప్రవేశించి నిట్టూర్చి) అహో! యిట్టి యవస్థకు వచ్చితినిగదా!

మ. అవధానంబున ధారుణీశ్వరుని శుద్ధాంతంబులన్ నైజధ
ర్మవిశేషంబని కేల బీలఁ గొను వేత్రం బిట్లు పెక్కేండ్లు ము
న్ననలీలన్ గతియింప బెంచుపడి యల్లల్లాడు మత్పాదముల్
భువిఁ దొట్రిల్లక యుండ నూతయగుచుం బొల్పారెనుం జెల్లరే! 3

ఓహో! యేలికకు నర్మకార్య మనతిక్రమణీయము గదా! అయిన నిప్పుడే ధర్మాసనంబునుండి లేచిన యీ ప్రభువునకు మరల నాతంకము గల్గించు నీకణ్వశిష్యాగమనము నివేదింప నాహృదయ మియ్యకొనకున్నది. కాదు. లోకతంత్రాధికారము విశ్రాంతిఁ గలుగనియదు గదా! ఏమన-

చ. ఖరకరుఁ డొక్కమాటె తురగప్రకరంబు నమర్చెఁగదో! నిరం
తరము సమీరణుండు విదితంబుగఁ బైన మొనర్చుచుండు, నీ
ధరణి సహార్నిశంబుఁ దలఁదాల్చి యనంతుఁడు మోచుచుండు, నెం
దరయఁగ ధర్మమిట్టిదిగదా! యాఱవపాల్గొనువానికేనియున్. 4

నాకాసనంబు నిర్వర్తించెదను. (పరిక్రమించి చూచి) ఇదిగో! ప్రభుఁడు!

గీ. స్వప్రజలఁబోలె విధుల భూప్రజల నడిపి
మంతనము జేరె నిర్మలస్వాంతుఁడగుచు
యూథములఁ బంపి రవికర బాధఁగంది
పగట గజరాజు వలిచాయ సాగయునట్లు. 5

(సమీపించి) దేవరా! జయము జయము. ఇదిగో! హిమవద్గిరిప్రాంత కాంతారవాసులగు తాపసులు కాశ్యపసందేశముం గొని స్త్రీలతో వచ్చియున్నారు. ఇక దేవరచిత్తము.

రాజు—(ఆదరముతో) కాశ్యపసందేశహారులా !
కంచుకి—ఔను.
రాజు—అట్లయిన నీయాశ్రమవాసుల శ్రౌతవిధిచే సత్కరించి తామకే దోడితేవలె నని యుపాధ్యాయుఁడగు సోమరాతునితో నామాటగాఁ దెల్పుము. నేనును దపోధనదర్శనార్హమగు ప్రదేశంబుననుండి వీరి నిరీక్షించుచుండెదను.
కంచుకి—దేవరయాజ్ఞ (నిష్క్రమించును.)
రాజు—(లేచి) ఎవఁడక్కడ ?
ప్రతీ—(ప్రవేశించి) దేవరా ! సెలవిండు.
రాజు—వేత్రవతీ ! అగ్నిగృహమునకు దారిజూపుము.
ప్రతీ—దేవా ! యిట్టిటు. (పరిక్రమించుచున్నది.)
రాజు—(అధికారఖేదము నిరూపించి) ఈప్సితార్థమును బొంది సర్వప్రాణులకును సుఖించవనగును. రాజులకుమాత్రము కృతార్థత సైతము దుఃఖోదర్కమేగదా! ఏమన—

చ. లలితపదంబుఁదీర్చు నభిలాషను మాత్రము, లబ్ధపాలనా
కలనము గాసిఁగొల్పు నిటు, గావున రాజ్య మతిశ్రమంబుఁజో
జలుషను లేదు, ఖేదమును సంధిలఁ జేయదు, నైజహస్తమం
దలరఁగ దండముంగొనిన యాతపవారణ మట్టు లెంతయున్. 6

(తెఱలో వైతాళికులు) దేవరా ! జయము.
ప్రథముఁడు—

చ. స్వసుఖ మొకింతగోరక ప్రపంచముకై ప్రతివాసరంబునన్
వెసఁ బరితాపమొందెదు, గణింపఁగ నీవిధ మిట్టిదేగదా !
మసఁగిన యాతపోష్ణమును తన్మరుహాముల్ దలఁదాల్చి చెంగటన్
మసలు జనాళితాపము నణంచునుగాదె దళంపుఛాయలన్. 7

ద్వితీయుఁడు—

చ. అపథమున న్మెలంగు మనుజాళి మరల్తువు దండధారివై
కృపమెయిఁ గావనేర్తు వడఁగింతు వివాదము ధాత్రి వైభవం
బపరిమితంబుగాఁ దనరునప్పుడు బంధుగులుందురైన నో
నృపవర ! ముఖ్యబాంధవుఁడ వీవెకదా ! జనులెల్ల వారికిన్. 8

రాజు—ఇదిగో ; మనోగ్లాని వదలి మరల మేము ప్రాప్తవారమైతిమి.
(పరిక్రమించుచున్నాఁడు.)

ప్రతీ — ఇదిగో! హోమధేను విరాజితంబగు నగ్నిశాల మునివాటిక, నూత్నసమ్మార్జనంబుచే వెలుఁగొందుచున్నది. దేవర యధిష్ఠింతురుగాక!

రాజు — (అధిష్ఠించి సేవకుల మూపునాని నిల్చి) వేత్రవతీ! భగవానులగు కాశ్యపులు నాచెంగటికి మునుల నేలపంపిరో?

ఉ. ప్రాకటసత్తపోధనతపంబులు విఘ్నములం గలంగెనో?
లేక ఖలుల్ తపోవనిలలిన్ మను ప్రాణుల కెగ్గొనర్చిరో?
కాక మదాగముల్ లతల కానుపు మానిచెనో? యటంచుఁబల్
పోకలఁబోయి నామనము బొందదు భావనిరూఢి నింతయున్. 9

ప్రతీ — దేవర సచ్చరిత్రంబున కభినందించి ఋషులు మిమ్ము మన్నింప నేతెంచిరని యూహింతును.

(పిదప శకుంతలతో గౌతమిని మున్నిడుకొని మునులను ముందుఁ బురోహితుఁడు గంచుకియుఁ బ్రవేశించుచున్నారు.)

కంచుకి — మహాత్ములారా! యిట్టిటు.

శార్ఙ్గరవుఁడు — శారద్వత!

చ. అలతియుఁ బాటిదప్పని మహామహుఁడీ నృపాలుఁ డేల నే
కులము నికృష్టుఁడే నపథగోచరుఁ డొక్కఁడుఁ గల్గఁ డైనఁ గే
వల విజనానురక్తమగు భావమునన్ విలసిల్లు నే జనా
కులమగు నీపదంబుఁ గనుఁగొందు హుతాశవృతాలయంబనన్. 10

శారద్వతుఁడు — యుక్తమీపు నగరప్రవేశంబువలన నిట్లయినది. నేనును-

చ. చెమరుచు నూనెవాసి నభిషిక్తుఁడు వోలె, నపత్రపాచారు ను
త్తముఁడును బోలె, నిద్రితు నుదారత మేల్కొను వాఁడు వోలె, బం
ధమున మెలాగువాని విదితంబుగ స్వైరవిహారి వోలె, రా
జ్యమున సుఖంబుఁ గాంచెడు ప్రజన్ మది నెంచుచునుంటి వింతగన్.

శకుం — (దుర్నిమిత్తమును సూచించి) అమ్మా! నాకుడికన్ను దరుచున్నదేమి!

గౌతమి — వత్సా! అమంగళము శాంతించుఁగాక! నీభర్త యిలువేల్పులు నీకు భద్రమొసంగుదురుగాక! (పరిక్రమించుచున్నది.)

పురోహి — (రాజుం జూపి) ఓతపస్వులారా! వర్ణాశ్రమ పరిపాలకుండగు నిమ్మహామహుండు తొలనే సింహాసనంబు దిగ్గి మీకై నిరీక్షించుచుండె. సందర్శింపుఁడీతనిని.

శార్ఙ్గ — ఓ మహాబ్రాహ్మణా! ఇందులకు మీ రానందింపఁదగినదే. అయినను మేమిందు మధ్యస్థులముగాన నిట్లందుము.

చ. ఉరుఫలసంపదం దరువు లొయ్యన నమ్రములై చెలంగు, ని
ర్భరనవవారి పూరమున వారిదవారము చేరుఁ జేరువం
బరువడి నుత్తముల్ విపులవైభవులయ్యు నహంకరింప, రి
వ్వరుసఁ బరోపకారుల స్వభావ మిదేగద ! యొంచిచూడఁగన్. 12

ప్రతీహారి — దేవా! తపోధనుల ముఖరాగము ప్రసన్నముగాఁ గానఁబడుచున్నది. కాన వీరికార్యము విస్రంభయోగ్యమని నేనూహించెదను.

రాజు — (శకుంతలం జూచి) వటియామె-

క. మేలిముసుంగిడిమిగులం । బైలువడని మిసిమినెసఁగు మైపసదగు నీ
బాలయెవతె? కారాకులఁ । గ్రాలు చివురువోలె మౌనిగణమునఁ
దనరెన్. 13

ప్రతీ — దేవా! నాహృదయము వేడుకతో నూహించుచున్నది. ఈమె యాకృతి మిగుల రమణీయముగాఁ గానఁబడుచున్నది.

రాజు — ఓగాక! పరకాంత నభిలక్షింపరాదు.

శకుం — (ఉరమునఁ జేయిడి తనలో) ఆర్యపుత్త్రుని భావమును నిర్ణయింపక— హృదయమా! యిట్లు చంచలించెదవేమి? ధైర్యమునవలంబింపుము.

పురో — (ముందునడిచి) దేవా! యీతపోధనుల యథావిధిగ నర్చించితిని. వీరికి గురుసందేశ మొకటి కలదఁట. దేవర దాని నాకర్ణింపఁదగును.

రాజు — సావధానుఁడనై యుంటిని.

ఋషులు — (చేయెత్తి) రాజా! విజయివిగమ్ము.

రాజు — మీకెల్లర కభివాదనము.

ఋషు — నీకు భద్రమగుఁగాక! అభిమతంబు సిద్ధించుఁగాక!

రాజు — తపోధనుల తపంబు నిర్విఘ్నమా?

ఋషు — క. సాధువుల నీవు ప్రోవఁగ
మా ధర్మక్రియల కెట్లు మార్కొను విఘ్నం
బోధరణీనాథ! తిమిరము
బాధించునె! భాస్కరుండు భాసిల్లంగన్. 14

రాజు — నా రాజశబ్దము సార్థకమైనదిగదా! భగవానులగు కాశ్యపులవారు లోకాను- గ్రహార్థమై కుశలముగ నున్నారా!

గౌత—సిద్ధిమంతులకుఁ గుశల మరచేతిదిగదా! అమ్మ నాయుష్మంతుఁడు నా యనుమతిం బ్రశ్నము తో సిగ్గుపడుచుండెను.

రాజు—భగవాను నాజ్ఞ యేమి?

శార్ఙ్గ—"పరస్పర సంకేతంబున నీవు మాయీ శకుంతలం బరిణయంబైనందులకుఁ బరితోషంబున మీ యిద్దఱ ననుమతించితిని. ఏమన:—

చ. పొలుపుగఁ బూజ్యులందుఁ గడుఁ బూజ్యతరుండవు నీవు, మా శకుం
తలయు మనోజ్ఞవిగ్రహముఁ దాల్చిన సత్క్రియ, కాన నిప్పుడీ
తులితగుణంబులం దగు వధూవరులన్ సమకూర్చి నేటికా
జలజభవుండు మాపుకొనఁజాలె సుదీర్ఘ నిజాపవాదమున్. 15

కాన సహధర్మ విధానంబునకై యిప్పుడీ యంతర్వత్నిని బరిగ్రహింపు" మని.

గౌత—ఆర్యా! నేనొకటి చెప్పఁ బూనుకొనియుంటిని. నావచనంబున కవకాశంబు లేదు. ఎట్లన?

క. గురుజనుల యాజ్ఞఁగొన నీ
వరయవు, బంధుగులనిదియు నడుగదు, మీ యొం
డొరులె యొనర్చిన చెల్మికి
నిరువురికిం దెల్పఁదగిన దేమున్నదిఁకన్. 16

శకుం—(తనలో) ఆర్యపుత్రుఁ డేమనునో గదా?

రాజు—ఇదే మిట్లనుచుంటిరి?

శకుం—(తనలో) ఈ యుపన్యాసము పావకంబైనదిగదా!

శార్ఙ్గ—ఇదేమి కదలేమి? లోకతంత్రముల మీ రెఱుఁగకుండిరి గదా!

మ. సతతంబుం బితృమందిరంబున నివాసంబుండెనేనిం బతి
వ్రతయైన న్మగనాలి నొండొకగతిన్ భావింతు రీలోకు, ల
క్కతనం జవ్వని చెల్మికత్తెయయినం గాకుండినంగానియుం
బతిచెంత న్నివసింపఁ గోరుదురు సుమ్మా బాలికాబాంధవుల్. 17

రాజు—ఏమీ! ఈమె నన్ను పెండ్లియాడితినా?

శకుం—(దుఃఖముతోఁ దనలో) హృదయమా! యిప్పు డీ మాటలు నుచితమే.

శార్ఙ్గ— క. కృతకార్యద్వేషమొ? విము
ఖతయో ధర్మమున? మమ్ము గర్హించుటయో?

రాజు—కేనిపోని వికల్పములతో నిట్లు ప్రశ్నించుచుంటి వేమి?

శార్ఙ— క్షితిపతికిఁ జెల్లు నీగతి
మతి వికృతులు దరచు విభవమత్తులయందున్. 18

రాజు—మిగుల గర్హించుచున్నారు.

గౌతమి—వత్సా! క్షణమాత్రము లజ్జింపకుము. నీమేలిముసుంగుఁ దొలఁగింతును. పిదప నీభర్త నిన్నానవాలు పట్టఁగలఁడు. (అట్లు చేయును.)

రాజు—(శకుంతలం జూచి తనలో)

మ. అనవద్యప్రభఁ గోడ గట్టినగ సంప్రాప్తించు నియ్యాకృతిన్
మునునేఁ గొంటినొ? లేదొ? నిర్ణయము నొందుం బొందఁగా లేక ప్రా
ద్దున నంతర్హిమమైన కుందసుమమున్ దేఁటియుంబోలెఁ గ్ర
న్నన భోగంబునకైనఁ ద్యాగమునకైనం బూనలే నిమ్మెయిన్. 19

(చింతించుచుండును.)

పరిజనము—(జనాంతికముగా) ఓహో! ప్రభువుగారి ధర్మవిచారణము! అవలీలగా లభించిన యిట్టి రూపవతింగూర్చి యెవ్వఁడాలోచించును?

శార్ఙ—ఏమట్లూరకుంటివి?

రాజు—ఓ తపోధనా! ఎంత చింతించిన నీమెఁ జేపట్టినట్లు నాకుఁ దలంపునకు వచ్చుటలేదు. ఆపన్నసత్త్వయగు నీమెను నాక్షేత్రంబుగా నెంచి యెట్లు పరిగ్రహింపఁగలను?

శకుం—(దుఃఖముతోఁ దనలో) వివాహమునందే సందేహమా! యిఁక మీఁది మీఁదికిఁ బ్రాకు, నాయీ దురాశ యెందులకు?

శార్ఙ—వలదులే.

మ. బలిమిం దస్కరుఁ డాత్మవిత్తము హరింపంజూచి మోహించి, యి
మ్ములఁ గైకొమ్మని దాని వానికిడు నప్పోల్కిన్ దనూజాత న
ట్టుల నీవంటిన సమ్మతించి నిను నిట్టుల్ పాత్రుఁగాఁ జేసినం
దలి దోషంబున మాని నీవలన బన్నం బొందఁగా నర్హుఁడే! 20

శారద్వ—శార్ఙరవా! నీవూరకుండుము. శకుంతలా! మేము చెప్పఁగలిగినదంతయుఁ జెప్పితిమి. ఈ మహాత్ముఁ డిట్లు పలుకుచున్నాఁడు. ఇతనికి నమ్మిక గల్గునట్లు ప్రత్యుత్తరం బిమ్ము.

శకుం—(తనలో) ఇట్టి యనురాగ మిట్టి యవస్థాంతరము నొందినప్పుడు దానిం దలంచి మాత్ర మేమి ప్రయోజనము? ఇక నీ యాత్మ శోధనమే మని నిర్ణయింపఁబడి నది. (ప్రకాశముగా) ఆర్యపుత్రా! (అర్ధోక్తిలో) పరిణయమే సంశయమ్మగుచుండ నీయాచార మనుచితము. పౌరవా! తొల్లి తపోవనంబున స్వభావము చేతనే ముగ్ధ యైన నన్ను బ్రతిజ్ఞఁజేసి వంచించి యిప్పు డిట్టి వచనములచే నిరాకరించుట నీకుఁ బాడిగాదు.

రాజు—(చెవులు మూసికొని) పాపము శాంతించుఁగాక! పాపము శాంతించుఁగాక!

ఆ. వె. దరుల నొరయు నేరు దటభూజమును నిర్మ
లోదకమును బోలె నుగ్రభంగి
నన్ను బతితుఁ జేయ నావంశము గలంప
నెంచుచున్న దానవే లతాంగి! 21

శకుం—ఔఁగాక! నిక్కముగ నీవు పరదారశంకచేతనే యిట్లయితివేని నీసందియం బభిజ్ఞానమువలననే తొలఁగించెదను.

రాజు—మంచిపద్ధతి.

శకుం—(ముద్రాస్థానమును బరికించి) అన్నన్నా! నా వ్రేల నుంగరము లేదే? (దుఃఖముతో గౌతమిని జూచుచున్నది.)

గౌత—శక్రావతారమున శచీతీర్థమునకు నమస్కరించునపుడు నీ చేతినుండి యుంగరము జారిపోయియుండును.

రాజు—(చిఱునవ్వుతో) స్త్రీలు ప్రత్యుత్పన్న బుద్ధు లనుట యిదే.

శకుం—ఇది దైవము తన ప్రభుత్వమును గనఁబఱచెను. మఱియొకటి నీకుఁ జెప్పెదను.

రాజు—ఇపుడు వినఁదగినదే యున్నది.

శకుం—ఒకనాఁడు నిరుజాజిమంటపంబున నీవు వోసిన తామరాకు దొన్నె నీ యఱచేత నుండెను.

రాజు—వినుచున్నాను.

శకుం—అప్పుడు తెంపుడు బిడ్డయైన దీర్ఘాపాంగమను లేడిపిల్ల చెంగటికి వచ్చెను. పిదప నీవు 'మున్నిది త్రావుఁగాక!' యని కరుణతో నీరుఁ జూపి చేరఁ బిలిచితివి. పరిచయము లేనందున నీచేతిదరి కది రాక పోయెను. పిదప నా దొన్నె నేను గైకొని పిల్వఁగా నది చొచ్చుఁ జూపినది. అంత 'నందఱును బందుగుల విశ్వసింతురు. ఇద్దఱు వనవాసులే కదా!' యని నవ్వులాడితివి.

రాజు—నిజకార్యంబు నిర్వహించుకొనుట కీ మొదలుగాఁ బల్కు పూర్వపుఁబోండ్ల మిథ్యాలాపామృతంబులచే విషయాభిలాషు లాకర్షింపఁబడుచుందురు.

గౌత — మహాత్మా ! ఈవిధి ట్లాడఁ దగదు. తపోవనంబునం బెఱిఁగిన యీజనంబు వంచనఁ గపటమ్మే తెలియదుగదా!

రాజు — ఓవృద్ధ తపస్విని !

చ. రమణులకు న్నిసర్గచతురత్వ మమానుషులందుఁగూడ స
ప్రబముగఁ గనంబడంగఁ బ్రతిభావతులం డిఁకఁ దెల్ప నేటి ? క
ర్భమున రయంబుమై నెగయఁబాఱక మున్నితరద్విజాళిచేఁ
దమి నిజసంతతిం బరభృతల్ పెంపింపవె ? యుక్తిపెంపునన్. 22

శకుం — (రోషముతో) కుటిలుఁడా! నీహృదయమును బట్టి సర్వమును జూచుచుంటివి. ధర్మ కవచముం దాల్చి తృణచ్ఛన్నకూపముతో సాటివచ్చు నిన్ననుకరించు వాఁ డెవ్వఁడు ?

రాజు — (తనలో) నాకు సంశయబుద్ధిని గలిగించుచు నీమె కోపము నిష్కపటముగాఁ దోఁచుచున్నది. ఇదిగో ! నీమె—

చ. పరువడి మంతనంబునఁ బ్రవర్తిలు కూరిమి లేశమాత్రముం
గుఱుతుఁ దలంపకుంట నతిఘోరమనస్కుఁడ నైన నామొదన్
ఖరతర రోషభావమునఁ గన్నుల నెఱ్ఱఁగఁ జేసి కన్బొమల్
విఱిచె; ననంగ కార్ముకము పెల్లున రెండుగఁ ద్రుంచుపోలికన్. 23

(ప్రకాశముగా) కల్యాణి ! దుష్యంతచరిత్రము ప్రసిద్ధమైనది. అయిననిది గాన రాదు

శకుం — అంగిట నమృతంబు నాత్మను గరళంబునుం గల యీశఠుని మది నమ్మి చేజిక్కినందులకై యిపుడు స్వైరిణిగాఁ జేయఁబడితిని గదా !

(చీఁకొంగు మొగమునఁ గప్పికొని యేడ్చుచున్నది)

శార్ఙ — ఇట్టి నిచాపల్యమే స్వయంకృతాపరాధమై యడ్డులేక నిన్ను దహించుచున్నది.

క. కావున సర్వము నారసి
కావింపందగు; రహస్యగతమున్ మఱియున్;
భావమెఱుంగని వారల
యీవిధి నేస్తంబు శత్రువేయగుఁ దుదకున్. 24

రాజు — ఓహో ! యేమిది ? యీమెనే నమ్మి దోషరూపాక్షరోక్తిచే మమ్ము దూషించుచుంటిరి.

శార్ఙ — (క్రోధముతో) మీరు హీనోత్తరము నాలకించితిరి.

గీ. పుట్టుటాదిగఁ గపటంబు నెఱుఁగనెఱుఁగ
నట్టి వారల పల్కు మిథ్యయగునింక
నితర వంచన విద్యా మనీషులైన
వారలే సత్యసంధులౌ వారుగాక ! 25

రాజా—ఓహో ! సత్యవాదీ ! మేము మట్టే యంగీకరించితిమి. ఈమెను వంచించిన మాకేమిఫలము ?

శార్ఙ్గ—ప్రత్యవాయము.

రాజా—పౌరవులు ప్రత్యవాయము గోరుదురనుట యవిశ్వసనీయము.

శార్ఙ్గ—ఓరాజా ! యుత్తరోత్తరంబేల ? గుర్వాజ్ఞ నిర్వర్తించితిమి. మేమిఁక మరలిపోవుదుము.

క. ఇదినీసహధర్మిణి ; విడి
చెదవో ? గైకొనెదో ? నీదు చిత్తము ; సతులం
దుదితాధికార మలరుం
గద ! పతులకు సర్వతోముఖంబగుచు నిలన్. 26

గౌతమీ ! ముందునడువుము. (బయలుదేరిరి.)

శకుం—ఎట్టిపుడు ? ఈకితవుఁడు నన్ను మోసపుచ్చెను. మీరును బాపోవు నన్ను విడిచి పోవుచుంటిరి. (వెంబడించును.)

గౌత—వత్సా ! శార్ఙ్గరవా ! దైన్యమున విలపించుచు నీశకుంతల మనల వెంబడించుచున్నది. భర్త కఠినుఁడై నిరాకరించు నా పుత్త్రి యేమిచేయును ?

శార్ఙ్గ—(రోషముతో వెనుకకుమరలి) అఁ! దోషైకదర్శిని ! ఏమీ నీకీ స్వాతంత్ర్యము?

శకుం—(గడగడ వడఁకును.)

శార్ఙ్గ—శకుంతలా !

చ. అలనృపుఁ డెట్టువల్కు నటు లైతివయేనిఁ గులప్రశస్తికిం
దలఁగినయట్టి నీవలనఁ దండ్రికినా ఫలమేమి ? యట్లుగా
కలఘు శుచివ్రతంబు విడనట్లుగ నాత్మ నెఱుంగుదేని బి
ట్టొలసి నిజేశునింట నిఁక నూడిగమైన నొనర్ప మేలగున్. 27

నిలునిలు మేము పోయెదము.

రాజా—ఓతపస్వీ ! ఏమి యీమెను మోసపుచ్చుచుంటివి ?

క. భానుఁడు కమలములనె; హిమ
భానుఁడు కుముదంబులనె; విభాసిలఁజేయుం
గాన జితేంద్రియు లిలఁ బర
మానవతీ స్పర్శవిముఖమానసులు గదా ! 28

శార్ఙ్గ—అన్యాసంగంబునఁ బూర్వవృత్తమును మఱచిన నీ వధర్మభీరుఁడ వెట్లగుదువు!

రాజు—(పురోహితునితో) ఇందలి హెచ్చుతగ్గులం గూర్చి మిమ్మే యడుగుచుంటిని.

క. బాలిశుఁడ నేన యైతినొ ?
యీ లేమయె కల్లలాడెనొ ? యనుచో
నాలిని వర్జింతునొ ? యొరు
నాలిం గొని పాంసులుండ నగుదునొ ? కట్టా ! 29

పురో—అట్లయిన నిట్లు కావింపుము.

రాజు—పురోధనుం డానతిచ్చుఁగాక !

పురో—ఈమె ప్రసవపర్యంతమును మాయింట నుండుఁగాక ! ఏమన ? నీకు మున్న చక్రవర్తి యగు పుత్రుండు కల్గునని మును లానతిచ్చిరిగదా ! అమ్ముని దౌహిత్రుం డట్టి లక్షణలక్షితుండేని ప్రమోదంబున నీ వామె శుద్ధాంతంబున జేర్చ వచ్చును. కానినాఁ డీమానినికిఁ బితృగృహప్రస్థానంబు సిద్ధమైనదే గదా !

రాజు—గురువు లనుమతించినట్లే.

పురో—వత్సా ! నాతోడ రమ్ము.

శకుం—భగవతీ ! వసుంధరా ! నాకు ద్వారం బొసంగుము.

(ఏడ్చుచుఁ బురోహితుని వెంట మునులతో నిష్క్రమించును.)

రాజు—(శాపాంతరిత స్మృతియై శకుంతలం గూర్చి యోచించుచుండును.)

(తెరలో) ఆశ్చర్య మాశ్చర్యము !

రాజు—(విని) ఏమగునది ?

పురో—(ప్రవేశించి) దేవా ! అద్భుతం బయ్యెఁగదా !

రాజు—ఏమది !

పురో—దేవా ! కణ్వశిష్యు లట్లు మరలిపోవ-

క. తన దురదృష్టము దూరుచు
వనితయు బాహువుల నెత్తి వలవల యేడ్చెన్;

రాజు—తర్వాత తర్వాత !

పురో—

గొని కాంత నొక్క తేజము
చన నచ్చరరేవునుండి శ్యామాకృతిఁగొన్. 30

(అందఱు నాశ్చర్య మొందుచున్నారు.)

రాజు—మహాత్మా ! మనము మునుపే దాని నిరాకరించితిమి. వృథాతర్కమేల ? విశ్రమింతురుగాక !

పురో—(చూచి) విజయుఁడ వగుము. (నిష్క్రమించును.)

రాజు—వేత్రవతీ ! వ్యాకుల చిత్తుఁడనైతిని. శయనగృహ మార్గముం జూపుము.

ప్రతీ—దేవా ! ఇట్టిటు. (పరిక్రమించును.)

రాజు—(తనలో)

గీ. ఇటుల ధిక్కార మొందిన ఋషితనూజ
నంత యరసినఁ బత్నిగా నెన్నఁ జాల
నైన బిట్టులపించు నాస్వాంత మిపుడు
నన్ను నమ్మించుచున్న చందమునఁ దోఁచె. 31

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది పంచమాంకము.

శ్రీ

శుభమస్తు.

ఆంధ్రీకృతాభిజ్ఞాన శాకుంతలము.

షష్ఠాంకము.

ప్రవేశకము.

(పిదప నగరరక్షకులలోని స్యాలకుఁడును, బద్ధుఁడగు పురుషుని దోడ్కొని భటులును ప్రవేశింతురు.)

భటులు—(కొట్టి) ఓరీ! కుంభీలకా! చెప్పుచెప్పు. రత్నాలపొదుగఁ జేసి చెక్కిన ప్రభువుల యుంగరము నీ కెక్కడిదిరా ?

పురుషుఁడు—(గడగడ వణఁకుచు) అయ్యలారా! అనుగ్రహింపుఁడు. నే నిట్టి పని చేయువాఁడను గాను.

మొదటిభటుఁడు—అరే! మంచి యిలవేల్పవని ప్రభువులు నీకు దానమిచ్చిరటరా?

పురుషుఁడు—ఇక వినుండి; బాబూ! నేను శక్రావతారము రేవునందుండు జాలరిని.

రెండవభటుఁడు—ఓరి గ్రుచ్చా! నీకులము నడిగితిమిరా ?

స్యాలకుఁడు—సూచకా! వీని నంతయుం జెప్పనిమ్ము. నడుమ నడ్డు సేయకుము.

భటులిద్దరు—ప్రభువాజ్ఞ. (ఊరకుందురు.)

స్యాల—చెప్పుచెప్పు.

పురు—నేను వల గాలము మొదలుగాఁ జేపలఁబట్టు కొలముట్లతో నాలుబిడ్డల బ్రతికించుకొనుచుంటిని.

స్యాల—(నవ్వి) కడుమంచిదిరా నీజీవనము.

పురు—అయ్యా! వినుండు.

గీ. కానిదయ్యును దనసైజ కర్మ మెందుఁ
జేయఁ జెల్లునుగాని వర్జింపరాదు

సపరములఁ జూపు కరకరి వారలయ్యు
బాపల మనంబు మెత్తని వారు గారె ? 1

స్యాల—త్వరిత త్వరిత.

పురు—ఆత డొక్క ప్రొద్దున వెఱ్ఱిమీను ముక్కలు చేయుచుండ దాని డొక్కలో మాణిక్యము కలుగు; మన నీయుంగరముఁ జూచి వీఁడు దీని నమ్ముఁజూపుచు మా చేతఁ జిక్కుండెను. కొట్టెదరో ? విడిచెదరో ? యిది దీని రాకడ

స్యాల—జాలరీ ! పుణ్యాత్ముఁడవే. గాలము వేయువాఁడు, వెంటమూర్ఖుఁడు జూడ జాలరి యే వీఁడు. వీనికి యుంగరము రాక విమర్శింపవలయును. రాజ నగరికే పోవుదము.

భటు—మంచిది అరే ! ముడియాడుమా ! నుండుడుము.

(అందఱు బరిక్రమింతురు.)

స్యాల—సూచకా ! ఈ గోపుర ద్వారమున నుండుము. ఉన్నదున్నట్లీ యుంగరము రాక దేవరకు జెప్పి వారి యానఁగైకొని వచ్చెదను.

భటు—ప్రభువారి యనుగ్రహమునకై పోయిరమ్ము. (స్యాలకుఁడు నిష్క్రమించును)

ప్రథముఁడు—జానుక ! స్యాలకుఁడు పోయి చాల తడవయ్యెనే ?

ద్వితీయుఁడు—ప్రభువుల సమయము నెఱిగి చూడవలయుఁగదా !

ప్రథ—జానుక ! వధ్యుఁడగు వీనికిఁ బూవుల దండలు వేయ నా చేతులు ఉబ్బులాట లాడుచున్నవి. (పురుషుని జూపుచున్నాఁడు.)

పురుషుఁడు—బాబూ ! నేరము లేక చంపెదరా ?

ద్వితీ—ఇదిగో ! నా ప్రభువు రాజశాసనముఁ గైకొని యిట్లే చూచుచున్నాఁడు. ఇఁక నీవు గ్రద్దలకు బలి గాఁగలవు.

స్యాల—(ప్రవేశించి) సూచకా ! విడువుఁడీ జాలరి వానిని. వీనికి యుంగరము రాక యుక్తమే.

ప్రథ—[illegible].

ద్వితీ—యమపురికిఁ బోయి వచ్చినాఁడు వీఁడు. (కట్లు విప్పుదురు.)

పురుషుఁడు—(స్యాలకునకు మ్రొక్కి) స్వామీ ! నా బ్రతుకు మీది.

స్యాల—ఇదిగో ! ఉంగరపు వెల్వకుం దగిన సొమ్ము నీకుఁ బహుమానం బొసంగెను.

(పురుషునకు ధన మొసంగును.)

పురు—(మ్రొక్కి యంది గైకొని) స్వామీ ! దయ యుంచితిరి.

సూచకుఁడు—వీరిగదా దయ యుంచిరి. కొఱతనుండి దించి యేనుఁగుమూఁపునఁ గూర్చుండఁబెట్టి ?

జానుకుఁడు—బావా ! ప్రభువున కాయుంగరము మిగులఁ బ్రేమాస్పదంబని బహుమానమే చెప్పుచున్నది.

శ్యాల — అందులకే యా రత్నము దేవర కభిమతంబని నే తలఁచుకొనను. దానిఁజూచినంగనే ప్రభువున కెవరో యిష్టజనము జ్ఞప్తికి వచ్చి ప్రకృతిగంభీరుఁడైనను కొంచెముసేపు కన్నుల నీరునించెను.

సూచ — బావా! సేవఁజేసితివి.

జాను — ఈమత్స్యమారకుని కొఱకని చెప్పుము.

(పురుషుని గినుకతోఁ గనును)

ధీవ — బాబులారా! దీనిలో సగము మీరు పూవులవెలకై తీసికొనుఁడు.

జాను — మంచిది.

శ్యాల — ఓజాలరి నాయఁడా! నాకిప్పు డిమఁడు చెలికాఁడవైతివి. మన మొదటి నేస్తము కల్లసాక్షిగా జరుపుకొందము, కావునఁ గల్లంగడికిఁ బోవుదముగాక.

ధీవ — అట్లే. (అందఱు నిష్క్రమింతురు.)

ప్రవేశకము.

(పిదప నాకాశయానమున సానుమతియను నచ్చర ప్రవేశించును.)

సానుమతి — సాధుజనుల యభిషేకకాలము వచ్చువఱకు నప్సరస్తీర్థమున నా వంతు చొప్పున నివసించి వచ్చితిని. ఇప్పుడీ రాజర్షివృత్తాంతము దెలిసికొందును. మేనకా సంబంధమున శకుంతల నాకు శరీరమైనది. ఆమె కూఁతురి నిమిత్తమై నాకాన బెట్టినది. (కలయం జూచి) ఏమో గదా! యిట్టి మహోత్సవకాలమందు నైన యీ రాజమందిర ముత్సవారంభము లేక యున్నట్లున్నది. ప్రణిధానమునే సర్వము తెలియఁగ శక్తి నాకుఁగలదు. కాని సఖివచనము నాదరము సేయ మన్నింపవలసియున్నది. కానిమ్ము. ఇప్పుడీ యుద్యానపాలికల ప్రక్కఁ దిరస్కరిణీ ప్రభావమునఁ గూఢనై నిల్చి తెలిసికొందును. (నాట్యమున దిగి నిలుచును. పిదపఁ జూతాంకురమును జూచుచు నొక చేటికయు వెనుక మఱియొక తెయుఁ ప్రవేశింతురు)

ప్రథమ —

క. పికములకుం గౌతుకవ
ర్ధక మామిడి క్రొన్న జీవితసమంబు, నళి
ప్రకర పద దళిత మగు చూ
తకలికఁ ఋతుమంగళము విధంబునఁ గాంతున్. ౨

ద్వితీయ—సఖీ ! మాధవితా ! యొంటిగనిల్చి యాలోచించుచుంటి వేమిది ?

ప్రథమ—మధుకరికా ! చూతకళికం జూచినఁ బరభృతికి నున్మత్తత మెచ్చుఁగదా?

ద్వితీ—(సంతోషముతోఁ దెచ్చుకొని) వసంతమాస మాసన్నమైనదటే ?

ప్రథ—మధుకరికా ! నీవిలాస గీతముల కిప్పుడిదే మంచి సమయము.

ద్వితీ—సఖీ! నన్ను బట్టుకొనుము. మునికాళ్ళనిల్చి మదనదేవార్చనంబునకై చూతాంకురంబులు గోయుదును.

ప్రథ—నీ పూజాఫలములో సగము నాకొసఁగెదవేని;

ద్వితీ—నే నడుగకున్నను నీ కది చేకూరునే; మనకు మేను రెండుగాని ప్రాణ మొక్కటే కదా! (కొమ్మనిపట్టుకొనగా మవిప్పుచుఁ దుక్కొని) ఓహో! వికసింపకున్నను జూతకుసుమము తొడిమ త్రుంపఁగా సువాసన నింపుచున్నది. (కపోత హస్తముతో)

గీ. కటు ధనుర్ధరుఁడైన దర్పకునకొఱకు
సమ్మతించితి నిన్ను జూతాంకురంబ!
అలుకఁబూనిన పతులు లక్ష్యంబుగాఁగ
శరములైదింట నుత్తమాస్త్రమవ్వగమ్ము. 3

(చూతాంకురము విసరును)

(అపటీక్షేపమునఁ గంచుకి కోపముతోఁ బ్రవేశించి)

కంచు—తొందరపడకు. ఓసి మైనాఁబిడదానా ! దేవర వసంతోత్సవము నివారింపఁగా నీవు చూతకళికను గోయనారంభించితి వేమి ?

ఇద్దరు—(భయముతో) ఆర్యా ! మన్నింపుము. మే మిది యెఱుఁగము.

కంచు—మీ రిది వినలేదా ? వసంతమునఁ బూచు వృక్షములును దదాశ్రయంబులగు పక్షులును గూడ రాజశాసనమునే పరిగ్రహించియుండెనే ? అల్లదే ?

మ. ఎలమావుల్ నిజకోరకంబుల రజం బీనాటికిం బూవ, విం
దలి గోరంటలు విచ్చకే నిలిచె సిద్ధంబయ్యుఁ, బుంస్కోకిలం
బులు కల్కూల్ శిశిరంబు చన్నను గళంబుల్ విప్పకున్నవి, పూ
విలుకుండున్ దాన సంధికృష్ట శరమున్ భీతిన్ ఉపసంహరించెనో ? 4

ఇర్వ—ఇందు సందియము లేదు. ఆరాజర్షి మహాప్రభావ సంపన్నుండు గదా!

ప్రథ—ఆర్యా! మేము రాణిగారి తోడంబుట్టువగు మిత్రావసువు చాల్లపాటి ... గారి పాదమూలము నుండి యీ ప్రమదవనమునకు వచ్చి యిన్నిదినంబులైనవి? ఇచ్చోట! ఈ ప్రమదవనమును యథార్థముగా నలంకరించితిమి. అందున మేమీ వృత్తాంత మేమియు నాలింపమైతిమి.

కంచు—ఓ బాలికా! ఇంకమాత్ర మిట్లు చేయకుడు.

ఇర్వ—అయ్యా! మాకు వేడుకగా నున్నది. మేము వినదగుదుమేని యేమివలనను ప్రభువు వసంతోత్సవ మేల నివారించిరి?

పాను—మానవు లుత్సవప్రియులు గదా! గొప్ప కారణ ముండితీరును.

కంచు—ఎరిగిన విషయ మైనది. చెప్పనేమి? శకుంతలా నిరాకరణ హేతుకంబగు లోకాపవాదము మీచెవులం బడలేదా?

ఇర్వ—మిత్రావసు ముఖంబున నంగుళీయక దర్శనమువరకు వినియుంటిమి.

కంచు—ఇంకం జెప్పవలసినది స్వల్పమే. నిజాంగుళీయక దర్శనంబువలన దేవర 'నిక్కముగ రహస్యమున మానినియగు శకుంతలం బెట్టితిని సత్యముగ నిరాకరించితి' నని జ్ఞప్తిగాంచినది మొదలు పశ్చాత్తాపమున వగచుచుండెను. అది విశదమే.

చ. పగగొను రమ్యమున్, సచివవర్గముచే మునుపోలె నిచ్చ గొ
ల్వంగొనఁడు, సెజ్జకట్టుకులఁ బొరలుచు నిద్దుర లేక పుచ్చు రేల్,
తగు వచనంబు రాణులకు దక్షిణవృత్తి నొసంగువేళ విం
తగు నొక పేరఁ బిల్చి కడునాన నలంముడుఁ బెద్దకాలమున్. 6

పాను—సంతోషము. సంతోషము.

కంచు—ఈ దురంత దుఃఖమున వసంతోత్సవము నివారింపఁబడినది.

ఇర్వ—యుక్తము. యుక్తము.

(తెరలో) రమ్ము రమ్ము.

కంచు—(చెవి యొగ్గి) ఓహో! దేవర యిట్లే వచ్చుచుండెను. మీరు మీ పనులకు పొండు.

ఇర్వ—అట్లే. (నిష్క్రమింతురు.)

(అంతట బశ్చాత్తాపవేషముతో రాజును, విదూషకుఁడును ప్రతీహారియుఁ బ్రవేశింతురు.)

విదూ—గమన్కరమ్ము.

కంచుకి—(రాజుం జూచి) ఓహో! ఎన్ని యవస్థలందును సర్వావస్థలయందును రాణించుగాక. అదిగో! ఇట్లు వగచుచున్నను దేవర ప్రియదర్శనుండై గోచరించుచుండె.

ఉ. దానవిశిష్టమై యొక కడానికడెంబు గదించి యన్యభూ
షానుషంగముం డించి సెగ జల్లెడు నూర్పుల మోవి కందఁ జిం
తానిలతప్రజాగరణ తాంతవిలోచనుఁడై కృశించియున్
శ్రీమెయి సానబట్టు మణి చెన్నున నాత్మరుచి న్వెలింగెడున్. 6

సాను—(రాజుం జూచి) యుక్తముగదా నిరాకరింపఁబడియును శకుంతల వీనికై వగచుచుండుట?

రాజు—(చింతతో మెల్లనఁ బరిక్రమించి)

గీ. మున్ను సారంగనేత్ర నామోహనాంగి
తెలియ మేల్కొల్పుచున్న నిద్రించుచుంటి
దుస్సహంబగు ననుశయ దుఃఖమునకె
వెండి మేల్కొన్న దిపుడు నా మొండిమనసు. 7

సాను—దీనురాలి దుర్దృష్టం బిట్టిదే కదా!

విదూ—వీనికి శకుంతలా వ్యాధి మరల విజృంభించినది. దీనికి వైద్యమేమో తెలియకున్నది కదా?

కంచు—(సమీపించి) దేవా! జయము. మహారాజ! ప్రమదవనభూములఁ బరికించితిని. ఇచ్చవచ్చిన వినోదస్థానముల మహారాజు యథేష్టముగా విహరింపవచ్చును.

రాజు—వేత్రవతీ! 'తపిపునను వేయుటంబట్టి మేము ధర్మాసనం బధిష్ఠింపరాము. కాన నీవు పరిశీలించిన పౌరకార్యమును బత్రమున లిఖించి పంపవలయు' నని యమాత్య పిశునునితో నా వచనముగాఁ బల్కుము.

ప్రతీ—దేవరయాజ్ఞ. (నిష్క్రమించును.)

విదూ—వాతాయన! ఇప్పుడు నీవిచట నుండుము.

కంచు—అట్లే. (నిష్క్రమించును.)

విదూ—నీవిచ్చ డీగమైన లేకుండఁ జేసితివి. సంతాపశాంతి నిచ్చు చక్కని యీ శీతలారామ సీమల నిప్పుడు సుఖముగా గ్రీడింపఁగలవు.

రాజు—(నిట్టూర్చి) వయస్యా! ఆపదలు సందుఁ జూచి వచ్చునను మాట నిశ్చయము. ఏమన—

గీ. మునితనయ సూర్మితలఁపు గ్రమ్ముకొనియున్న
తమము విడనాడె నామానసమున నిపుడు
మిత్రుఁడా ! నన్ను గాడ నమిత్రుఁ జేతుఁ
డా ప్రమబాణంబు సంధించె నలరువింట. 8

విదూ—ఆగు మిప్పుడీ దండకాష్ఠమున మన్మథవ్యాధి నశింపఁజేయుదును

(కఱ్ఱనెత్తి చూతకుసుమములను బడఁగొట్టఁబోవును.)

రాజు—(చిఱునవ్వుతో) కానిమ్ము నీ బ్రహ్మతేజస్సు కానఁబడినది. మిత్రుఁడా! మోహనాంగి నించుక యనుకరించు నలరుదీవలఁ గాంచుచు నెచ్చటనుండి నేత్రానంద మొందుదును?

విదూ—ఇప్పుడు మాధవీమంటపమునఁ బ్రొద్దుపుచ్చెదను. నా చిత్రఫలకమున మానవి యగు శకుంతల ప్రతికృతిని స్వహస్తమున లిఖించిన యాచిత్రపటము నచ్చటికిఁ గొనితెమ్మని యాసన్న పరిచారిక యగు చతురికతో నీవు చెప్పియుంటివి గదా!

రాజు—డెందమున కానందము గొల్పుతా విట్టిదే. ఆమార్గమునే చూపుము.

విదూ—ఇట్టిటు నీవు. (ఇద్దఱు పరిక్రమించు చున్నారు.)

సాను—(వెంటనంటుచున్నది.)

విదూ—మానికపు బలకలతోడి యరుగుగల మాధవీమంటపము పూవుదీవెల నలంకరింపఁబడి స్వాగతముతో మనల నవేక్షించుచున్నట్లున్నది. సంశయము లేదు. కాన నందుఁ బ్రవేశించి నీవు కూర్చుండుము.

ఇద్ద—(ప్రవేశము నిరూపించి కూర్చుందురు.)

సాను—లతాసమీపమున నిల్చి సఖురాలి ప్రతికృతిఁ జూచెదను. పిదప నాచెలిపై వెలుపలి వివిధానురాగ మెఱుఁగఁగలను. (అట్లే యుండును.)

రాజు—మిత్రుఁడా! శకుంతల తొంటి వృత్తాంత మంతయు నిప్పుడు దలపోయుచుంటిని. నీకును జెప్పియుంటిని. నిరాకరణకాలమున నీవు నాచెంతఁ గుండవైతివి. ఏప్పుడుమానవలె మఱచిపోయితివా యేమి?

విదూ—మఱచిపోలేదు. కాని నీవు సర్వము చెప్పి కట్టకడపట "వేళాకోళమునకుఁ గాని యిది యథార్థము గాదు" అని తెల్పితివి. అది మృత్పిండబుద్ధినైన నేను నిజమని గ్రహించితిని. ఇక భవితవ్యము బలవంతము గదా!

సాను—ఇట్లే యగు.

రాజు—(ధ్యానించి) మిత్రమా! నన్ను రక్షింపుము.

విదూ—ఓహో! యేమిది! నీయం దిట్టి వచనము యుక్తము కాదుగదా! సజ్జనహృదయము లెన్నఁడును శోకపరవశంబులు గానేరవు. ఝంఝూనిలంబు వీచుచున్నను శైలంబులు చలింపవుగదా!

రాజు—వయస్యా! నిర్నిమిత్త నిరాకరణంబున విపన్నురాలగు ప్రేయసి యవస్థం దలపోసి మిక్కిలి దిక్కుమాలినవాఁడనై యుంటిని. ఆమెయు—

ఉ. ఏ వెడలంగఁ ద్రోయఁ దపియించుచు బంధుజనంబుతోడఁ బోఁ
బోవ, నదల్చుచున్ గురుసముండగు శిష్యుఁడు నిల్వుమన్న, బా
ష్పావిల వృత్తినై శఠుఁడనైన ననుం మఱలంగఁ గాంచు న
ప్పావని దీనదృష్టి విషబాణముఁబోలె ననున్ దహించెడున్. 9

సాను—ఓహో! స్వకార్యపరత్వమన నిట్టిదేగదా! ఈతని సంతాపము నాకు మిగుల సానందకరముగా నున్నది.

విదూ—అహో! నాకొకయూహ తోఁచుచున్నది. ఎవ్వఁడో ఖేచరుఁడు వచ్చి యామెను దీసికొనిపోయి యుండును.

రాజు—పతివ్రత నెవ్వఁ డెవ్వఁడు ముట్టఁజాలును? మేనక నీసఖురాలికి జన్మకారణమని వినియుంటిని. తత్సహచారు లామెం గొనిపోయి యుందురని నాహృదయమున కిప్పుడు తోఁచుచున్నది.

సాను—మోహమునకుఁ గాని తెలివికి నాశ్చర్యమేమున్నది?

విదూ—అట్లయిన నామె సమాగమము నీకుఁ గాలక్రమమున్ గాఁగలదు.

రాజు—ఎట్లు?

విదూ—భర్తృవియోగ దుఃఖితయగు కుమారిం జూచుచుఁ దల్లిదండ్రు లెంతకాల మోర్చియుందురు?

రాజు—మిత్రమా!

కం. కలయో ? మాయయొకొ ? యెన్నది
కలఁతయొ? తావత్ఫలంబుగల సుకృతముల్
తొలఁగెను? మఱలఁగ రాదది
తలఁపుల వెల్లువలు బాఱు దరి లేకుండన్. 10

విదూ—అట్లుగాదు. తప్పక సిద్ధించునర్థమునకు నకస్మాత్తుగ సమావేశము లభించుననుటకు సూచకమే కదా యిది.

రాజు—(ఉంగరము జూచి) అక్కటా! యిట్టి దుర్లభస్థానమునుండి తొలఁగినదిగాన నిది శోచనీయముగదా!

గీ. అంగుళీయమ! నను బోలె నల్పపుణ్య
వంతమన్న నీవు నెల్లమా ఫలముఁగలన
శోణనఖరమ్యములగు నా సుదతి వ్రేళ్ళ
నెలవుఁ గాంచియు నక్కటా! తొలఁగిపోతి. 11

సాను—ఇది యితరుచేఁ జిక్కెనేని నిక్కముగ శోచనీయమే యగును.

విదూ—ఓ వయస్యా! ఈ నామముద్రిక నామె కేల నేయుపాయమున నుంచితివి?

సాను—దీని కథను నాకును వేడుకగలదు.

రాజు—వినుము. నాఁడు నిజనగరమ్మునకై బయలుదేరిన నన్ను బ్రేయసి కన్నీరు నించుకొని "నార్యపుత్త్రుఁ డెంతకాలమునకు మరల సమావేశ మొసంగు" నని నాతోఁ బలికెను.

విదూ—తర్వాత తర్వాత.

రాజు—పిదప నీ నామముద్రిక నామె వ్రేలఁ దొడుగుచు నే నిట్లు ప్రత్యుత్తర మొసంగితిని.

గీ. దినదినము నొక్కొకటిగ మదీయనామ
వర్ణముల నెన్ను నెన్నాళ్ళు పట్టు నిందు
నన్నినాళ్ళకుఁ గాంత! శుద్ధాంతగృహముఁ
జేర్ప మనుజుండు నీచెంతఁ జేరవచ్చు. 12

అనియును దారుణుఁడనై యజ్ఞానమున విస్మరించితిని.

సాను—అవధిమాత్రము రమ్యమైనదే కాని దైవము విఘ్నము చేసెను.

విదూ—పిదప నది జాలరి తనకుఁ జిక్కిన చేప కడుపులోని కెట్లు వచ్చెను!

రాజు—శరీరస్థములవలన నెంతకును నిసుఖరాలి కేలనుండి గంగాయుకరంబున జారి పడినది.

విదూ—యుక్తము యుక్తము.

సాను—ఇదివర ప్రత్యక్షుఁడగు నీరాజర్షికి నీమృగాంకు శకుంతలగూడిన వివాహసంబే నా యూహించెదను. అయిన నిట్టి యనురాగము కానవాలుఁగోరు టెందులకు? ఎట్లు?

రాజు—ఇప్పుడీ యుంగరము నిందించెదను.

విదూ—(తనలో) ఈతఁడు పిచ్చివారిఁ బడుచున్నాఁడు.

రాజు—

చ. సురుచిర కోమలాంగుళుల సొంపిలు నాపికవాణి పాణిపం
కరుహము పొందుఁబాసి యుదకంబున మున్గితి వేల యుంగ్రమా!
స్థిరసుగుణాం బెఱుంగని యచేతనము న్నను నంచనేల! యి
క్కరణి వివేకనేన ప్రియకాంతఁ దొఱంగితి నెక్కుటంబునన్ 13

విదూ—(తనలో) ఆహాహా! ఈ యాకలికి నేనే భక్షణీయుఁడ నగుచుంటిని

రాజు—అహో! ప్రేయసీ! నిర్నిమిత్త పరిత్యాగ పశ్చాత్తప్తుండనగు నన్ను బుద్ధిర్దర్శనము నొసంగి దయఁజూడుము.

చతురిక—(పటాక్షేపమునఁ బ్రవేశించి) ఇదిగో! చిత్రఫలకము దేవ.

(చిత్రఫలకమును జూపును)

విదూ—మేలు! వయస్యా మేలు. భావముల తీరు చక్కని యునికిచే దర్శనీయమై యున్నది. నిట్టపల్లముల నాప్రష్టి ద్రొళ్లుచున్నట్టున్నది.

సాను—ఓహో! ఈరాజర్షి తూలికానైపుణ్యము! నాకెచ్చెలి యెదుట నున్నట్లే తోఁచుచున్నది.

రాజు—

గీ. ధరణి నెయ్యది ప్రకృతిని సుందరముగా వొ
తనర నయ్యది తీరుఁ జిత్తమునుపు నందు
నట్టులయ్యును నామె సోయగము దీప
నసఁగె నొకిరేక వాసి యించించుకంత. 14

సాను—పర్యుత్సుకంబున నగ్గలంబగు ననురాగమునకును గర్వము లేమికిని దగినది వచనము.

విదూ—ఓహో! ముగ్గురు పూజ్యురాండ్రు గానఁబడుచున్నారు. అందఱుం జక్కనివారే. ఇందు మాననీయ శకుంతల యెవరు?

సాను—సఖీరూప మెఱుంగని యితఁడు విఫలచక్షువేగదా!

రాజు—నీ వెవరని యూహించుచుంటివి?

విదూ—విడివిడిపోవు క్రొమ్ముడినుండి జాఱు విరిపూల నొప్పు కొనకొసలతోడను, చెమటచెమ్మటలు గ్రమ్మ నెమ్మోముతోడను మిక్కిలి సాచు బాహులతలతోడను జూడఁ దగిన కటిపోలచే విగవిగ మెఱయు లేఁజిగుళ్ళ నొప్పు కొలమావి కెలన నించుక యలయుతీరున వ్రాయఁబడిన దీమాననీయ శకుంతల యనియుఁ దక్కినిద్దఱుఁ జెలికత్తె లనియు నాయభిప్రాయము.

రాజు—నేర్పరివి నీవు; కలదిందు నాభావచిహ్నము.

గీ. అల్ల జెమరించు వ్రేళ్లుంచు నానవాలు
మలినగతిఁ దోఁచె నంగరేఖలకుఁ జెంతఁ
జెక్కులను జాఱు కన్నీరు చిందువంది
పొడగనఁగవచ్చె నిదె! పన్నె పొటమరిల్ల. 15

చతురికా! ఈ వినోదస్థానమున సగమే లిఖించితిని. కాన నీవేగి రంగులఁ దీసికొనిరమ్ము.

చతురిక—ఆర్యా! మాధవ్యా! చిత్రఫలకంబట్టుకొమ్ము. రంగుల బరణిం దీసికొని వత్తును.

రాజు—నేనే దీనిని బట్టుకొందును.

(అట్లే చేయఁగాఁ జతురిక నిష్క్రమించును.)

రాజు—నేను-

మ. మును ప్రత్యక్షగతిన్ లభించిన ప్రియం బోనాడి చిత్తర్పితం
బైనయందోఁచిన దీని నాదరముమై నెంతేని మన్నించు నే.

వనుఁగు విమ్రత్తుఁడ! మార్గమధ్యమున నుద్యత్పూర వేగంబునన్
జను పిల్లేటిని దాటి వచ్చి మృగతృష్ణాభ్రాంతి నర్థించితిన్. 16

విదూ—(తనలో) నిక్కముగ నీతఁడు జక్కరం దాటి యెండమావుల దక్కినాడు. (ప్రకాశము) వయస్యా! యిందింక వ్రాయఁదగినదేమి?

సాను—సందియము లేదు. చెప్పలి కివ్వవచ్చు నాయాసీమల ప్రాంతుఁ దలఁచి యుండెనని.

రాజు—వినుము.

చ. పులినచర న్మరాళయుగముల్గల మాలిని; దత్తటిన్ మృగా
వళుల నెసంగు శీతనగపావన పాదముల్ లిఖింతు; వ
ల్కలములు గట్టు కొమ్మలఁ జెలంగు మహీజమునీడఁ జేరి డా
పలికను నిక్కికొమ్ముకొనఁ బ్రామెడు లేడిని వ్రాయఁగోరెదన్. 17

విదూ—(తనలో) అట్లయిన నీతఁడీ చిత్రఫలకమును గడ్డములు ప్రేలు జడదారి గుంపుతో నింపఁగలఁడు.

రాజు—మిత్రుఁడా! శకుంతలకు వేఱొక యలంకారము మాకిచ్చవచ్చినదే యొండు మఱచితిమి.

విదూ—అదేది?

సాను—వనవాసమునకును; సౌకుమార్యమునకును దగినదై యుండును.

రాజు—

చ. చెలువుఁడ! వీనుసం దొడిమ చెక్కిలిదాఁకను ప్రేలు కేసరం
బులు దనరన్ శిరీషసుమమున్ లిఖియింపఁగ మానితిన్; మహో
జ్జ్వల శరదిందు దీప్తి తులితంబగు మంజుమృణాళ సూత్రముం
జెలువుగ వ్రాయనైతి; సరసీరుహనేత్ర కుచాంతరంబునన్. 18

విదూ—ఓహో! యేమిది? చెంగల్వ రేకువంటి హస్తాగ్రముచే నెమ్మొగంబుఁ గప్పుకొని యీమె బెదరి బెదరి యున్నట్లున్నది. (తేఱిపాఱఁ జూచి) ఆఁ! దాసీకొడుకు, పూదేనె దొంగ, యీ తుమ్మెద పూఁబోఁడి మొగము నల్ముకొనుచున్నది.

రాజు—ఓయీ! యీ తుంటవాని మఱలింపుము.

విదూ—అవినీతుల దండించు నీవే దీని మఱల్పఁగలవాఁడవు.

రాజు—ఓహో! కుసుమాంతఃప్రియాతిథీ! యిందుఁ బడిగాఁపులుండి బాధింపఁబడెదవేమి?

క. విరిమీఁద వ్రాలి యిమ్మధు
కరి నీవై వలపుచేఁ దగ న్నొగిలియు నీకై
గుఱిచి సతి వేచె నీవిఁక
దరిఁజేరక పూవుతేనెఁ ద్రావఁదనుమ్మా.

సాను—ఇప్పుడు దీని సౌమ్యతతో నివారించెఁగదా!

విదూ—పాఁచదోలినను మొండిజాతిగదాయిది.

రాజు—ఓహో! యిట్లు నాశాసనము నుల్లంఘింతువా? విను మట్లయిన.

మ. నలియంబారని లేతమ్రాఁకు తలి రందంబొప్పఁగాఁ గాముకే
ళుల నే నెంతయు నెమ్మిఁ ద్రావిన కొను నా లోలాక్షి బింబాధరం
బలమం జొచ్చి స్పృశింతువేని మధుపంబా! నిన్ను బోనీయ కా
జలజాతోదర బంధనాలయమునన్ సంధించి బంధించెదన్. 20

విదూ—ఇట్టి తీవ్ర దండనమున కేది భీతిల్లదు? (నవ్వి తనలో) ఇతఁడిప్పుడు పిచ్చివాఁడుగా నున్నాఁడు. నేను నీతని కూటమిచే నిట్టి వాఁడనే యగుచుంటిని. (ప్రకాశము) ఓహో! చిత్రపటముగదా యిది.

రాజు—ఏమీ!

సాను—ఇంతదనుక నాకును దెలియలేదు. లిఖితానుసార మనుభవించు నీతని మాట లేలచెప్పనేల?

రాజు—వయస్యా! దోషైకదర్శిత్వ మవలంబించితివేమి?

క. హృదయము తన్మయమై క
న్గెదుర సతిం గనినయట్టులే సుఖియింపన్
విదితముగఁ జేయు నీచే
ముదిత మఱలఁ జిత్రరూపముగ్గఁ దోఁచెఁ గటా! 21

(కన్నీరు విడుచును.)

సాను—పూర్వాపరంబుల విరోధించుచు నీ విరహమార్గ మపూర్వముగా నున్నది.

రాజు—నిరంతరదుఃఖ మెట్లనుభవింపఁగలను?

క. కలనయినఁ గలికి కలయిక
గలుఁగునన న్నిదుర లేమి గాద్పడ నదియున్
వెలువడెను నశ్రుపూరము
పొలతిం గననీదు చిత్రమునైనఁ గటా! 22

సాను—వయస్యా! శకుంతలకు నిరాకరణ దుఃఖము సర్వదా పరిహరింపఁ జేయఁబడి నది.

చతు—(ప్రవేశించి) స్వామీ! జయము! జయము! రంగులబరణిఁ గైకొని యిటు మొగంబై బయలుదేరితిని.

రాజు—పిదప.

చతు—అంతఁదరళికతోనున్న వసుమతీదేవి "ఆర్యపుత్రునకు దీని నేనే యొసంగెద" నని బలాత్కారముగా నాచేతనుండి యాబరణిం గైకొనిరి.

విదూ—అదృష్టవంతురాలవై విడువఁబడితివి.

చతు—అంతఁ గొమ్మకుఁ జిక్కుకొన్న దేవిగారి చీరచెఱంగుఁ దరళిక విడిపించునం తలోఁ దప్పించుకొని వచ్చితిని.

రాజు—వయస్యా! దేవివచ్చుచున్నది. బహుమానగర్విత. నీవీ చిత్రపటంగాపాడుము.

విదూ—(చిత్రపటం గైకొని లేచి) నన్నని పలుకుము. నీ కంతఃపురకలహము నుండి విడుదల సంభవించినచో మేఘప్రతిచ్ఛంద సౌధమున నుండెద నన్ను గేకవే యుము. (చెచ్చెఱ నిష్క్రమించును.)

సాను—అన్యసంక్రాంతహృదయుఁడయ్యును మొదటి గౌరవము గోరుచున్నాఁడు. కాని నిప్పు డీతఁడు గాఢానురాగుఁడు.

ప్రతీ—(పత్రముఁ గైకొని ప్రవేశించి) దేవా! జయము. జయము.

రాజు—వేత్రవతీ! మార్గమధ్యమున దేవి గాన్పించెనా?

ప్రతీ—ఆఁ! దేవేరి పత్రహస్తనగు నన్నుఁ గాంచి మరలిపోయెను.

రాజు—కార్యజ్ఞురాలు కార్యాంతరాయ మొనర్పదు.

ప్రతీ—"స్వామీ! నేఁడు లెక్కపరీక్షకు మిక్కిలి కాలము పట్టుటచే నొక్క పౌరకార్యముం బరిశీలించి పత్రమున లిఖించితి. దాని దేవర చిత్తగింప వలయు" నని మంత్రిశేఖరుఁడు విన్నవించుచుండె.

రాజు—పత్రిక నిటుఁ జూపుము

ప్రతీ—(చూపును)

రాజు—(చదువుకొని) ఏమీ? "సముద్రవర్తకుండగు ధనమిత్రుఁడను సార్థవాహుం డోడ భిన్నమై మృతుండయ్యె. అదీనుఁ డనపత్యుండు. వాని ధనసంచయంబు భూపతికిం జెందవలయు" నని యమాత్యుండు వ్రాయుచున్నాఁడు— అయ్యో! సంతతిలేమి యెంత దురంతమైనది? వేత్రవతీ! యాతఁడు మహాధనుండుగాన బహుపత్నీకుఁడై యుండవలయు. తత్పత్నులం దేదేని గర్భవతియై యుండెనేమో విచారింపవలయు.

ప్రతీ—సామీ! ఇప్పుడాతని భార్యలలో సాకేత సెట్టి కుమారికిఁ బుంసవనం బయ్యె నని వినికి.

రాజు—"గర్భస్థ సంతతియే పిత్రృధనంబున కర్హ" మని పోయి యమాత్యునికిం దెలియఁజేయుము.

ప్రతీ—దేవరయాజ్ఞ. (నిష్క్రమించును.)

రాజు—ఇటు రమ్మా.

ప్రతీ—ఇదే వచ్చితి.

రాజు—"సంతతి కలదు లే" దను విచార మేల?

గీ. అవని నెవ్వే హితాత్మబాంధవుల జనులు
బాయుదురొ వారి వారి కా యాయి బంధు
వగు నఘంబునఁ దక్క దుష్యంతుఁ డనుచు
నెల్లవారికిఁ జాటింపుఁ డింపు వెలయ. 28

ప్రతీ—ఇట్లుగదా చాటవలయును!

(నిష్క్రమించి మరలఁ బ్రవేశించి)

దేవర శాసనంబున కమాత్యుండు కాలవృష్టికిం బోలె సంతుష్టుఁ డయ్యె.

రాజు—(నిట్టూర్పు పుచ్చి) ఇట్లుగదా సంతతిలేక నిరాధారములైన వారి సంపదలు మూలపురుషుని విడచి యితరుని చేరుచున్నవి. నాయనంతరమునను బూరువంశలక్ష్మి కిదియే గతి.

ప్రతీ—అమంగళము శాంతించుఁగాక! అమంగళము శాంతించుఁగాక!

రాజు—స్వకరప్రాప్తమైన శ్రేయంబు నిరాకరించితి. నా జన్మ మేల!

సాను—సందియము లేదు. నెచ్చెలి నే డెందంబునం దుంచుకొని యితఁడు దన్నుదా నిందించుకొనుచుండెను.

రాజు—

గీ. గర్భమున నాత్మతేజంబు గల్గు ధర్మ
సతిని వంశప్రతిష్ఠఁ బాసితినిగాదె?
తతిని వెదపెట్టి పటు మహోత్తరఫలంబు
నిడెడు వేళ వసుంధర విడిచినట్లు. 24

సాను—నీ సంతతి యిపు డవిచ్ఛిన్నంబు గాఁగలదు.

చతు—(జనాంతికముగా) అన్నా! ఈ సార్థవాహ వృత్తాంతముచేఁ బ్రభుండు విమనస్కుండయ్యె. ఈయన నూరడింప మేఘప్రతిచ్ఛంద సౌధమునుండి మాధవ్యుని దీసికొనిరమ్ము.

ప్రతీ—బాగుగాఁ జెప్పితివి. (నిష్క్రమించును.)

రాజు—అన్నా! దుష్యంతుని పితృదేవతలు సంశయంబునం బడినారు.

మ. అకటా! యీతనిపిమ్మటన్ నిగమకల్పాదిష్ట మార్గంబునై
నిఁక నెవ్వాఁడు నివాపము ల్విడుచు మాకీ వంశమందం చపు
త్త్రికుఁడన్నే విని నీటఁ గొంత నిజనేత్రంబుల్ విశోధించి కొం
చెక శేషించినఁ ద్రావుచుండ్రు పితరుల్ నిక్కంబు దుఃఖంబునన్. 25

(మూర్ఛిల్లును.)

చతు—(తొందరతోఁ బట్టుకొని) దేవా! ఊరడిల్లు మూరడిల్లుము.

సాను—అన్నన్నా! దీపమున్నను వ్యవధానదోషంబున నితం డంధకార మనుభవించుచున్నాఁడు. నే నిప్పుడే యీని సుఖితునిం జేయుదును. కాదు. "యజ్ఞభాగలాలసులగు దేవతలే శీఘ్రకాలమున నీభర్త నిన్ను ధర్మపత్నిగాఁ జేకొనఁ జేయుదు" రని శకుంతల నూరార్చు నదితిదేవి ముఖమున నుండి తొల్లి వినియుంటిని. కాన నంతదనుక నిరీక్షించుటయే మంచిదని. ఈ వృత్తాంతముచేఁ బ్రియసఖి నూరడింతును.

(గగనయానమున నిష్క్రమించును.)

(తెరలో) వంచితగను వంచితగను.

రాజు—(చెవియొగ్గి) అహా! మాఢవ్యుని యార్తస్వరము వోలె నున్నది. ఎవరక్కడ?

ప్రతీ—(తొందరతోఁ బ్రవేశించి) దేవా! రక్షింపుము. రక్షింపుము. ఎవరో మీ సఖునిఁ బట్టుకొనఁగా వయస్యుండు సంశయస్థితికి వచ్చినాడు.

రాజు—బాలుని కంఠముఁ బట్టుకొన్నవాఁ డెవ్వఁడు!

ప్రతీ—దేవా! కంటికిఁ గానఁబడని యేదో భూతమావేశించి యతని మేఘప్రతిచ్ఛంద సౌధము కొట్టకొనను బెట్టినది.

రాజు—(లేచి) కాదు. నాగృహంబులుఁ గూడ భూతములచేఁ బరాభవింపఁబడు చున్నవా! లేదా.

గీ. మఱియు దినదిన మాత్మప్రమాదజనిత
దురితములె లెక్కసేయంగఁ దరముగాదు
జనులలో నెవ్వఁ డేదారిఁ జనును? దాని
నెల్లఁ బరిపూర్తి నెఱుఁగంగ నెవనివశము. 26

(తెఱలో) మిత్రుఁడా! చచ్చితిని. చచ్చితిని.

రాజు—(తొందరతోఁ బరిక్రమించుచు) మిత్రుఁడా! భయపడకుము. (తెఱలో) మిత్రుఁడా! చచ్చితిని. చచ్చితిని. దేవా! యెట్లు భయపడకుందును? వీఁ డెవ్వఁడో నా మెడఁ జెఱకు విఱిచినట్లు వెనుకకు విఱుచుచున్నాఁడు.

రాజు—(చూడ్కి నిగుడించి) ధనువు.

యవని—(ధనువుఁ గైకొని ప్రవేశించి) దేవా! హస్తకవచముతోడి శార్ఙ్గకంబిదె!

రాజు—(శరశరాసనంబులఁ గైకొనును.)

(తెఱలో)

మ. గళనిర్యన్నవశోణితగ్రహణకాంక్షన్ ఘోరశార్దూల మ
గ్గలికం బొర్లు వృషంబుఁబోలె నిను నిక్కం బింక జక్కాడెదన్
బళిరే! యార్తజనార్తిభీతుల నడంపన్ ధనుర్ధారియౌ
నల దుష్యంతుఁడు నిన్ను గావ శరణం బౌఁగాక! యిప్పట్టునన్. 27

రాజు—ఏమీ! నన్నే నిర్దేశించుచున్నాఁడు. అగుమాగుము. కుణపాశనుఁడా! నీవిప్పుడుండవు. (ధనువు నెక్కిడి) వేత్రవతీ! సోపానమార్గముం జూపుము.

ప్రతీ—దేవా! ఇట్టిటు.

(అందఱుం దొందరతోఁ బరిక్రమించుచున్నారు)

రాజు—(కలయఁజూచి) ఇట కెవ్వరును లేరే ?

(తెఱలో) వచ్చితిని, వచ్చితిని; నేనిన్ను జూచుచుంటిని. నీవు నన్నుఁ జూచుటలేదు. పిల్లిబట్టిన యెలుకకుంబోలె నాకింక జీవితాశలేదు.

రాజు—ఓ తిరస్కరిణీ మదాంధ! నాయస్త్రము నిన్నుఁ జూడఁగలదు. ఇదె చూడుము. నేనిదె! శరము సంధించుచున్నాను.

క. త్రుంచునిది నిన్ను వధ్యుని
హంసమెయి రక్షింపఁ దగిన మాన్యున్ ద్విజునిన్
సంచుమెయి నంచ క్షీరముఁ
గొంచుం దన్మిశ్రజలము గ్రోలక విడదే ? 28

(విదూషకుని విడిచి మాతలియు, విదూషకుఁడుం బ్రవేశించుచున్నారు.)

మాతలి—

చ. సురపతి నీమహోగ్రతకుఁ జూపె శరవ్యముగా నిశాచరో
త్కరమును; నీశరాసనము గ్రక్కున నెక్కిడు మింక నారిపై
నిరవుగ సాధువుల్ నిజసుహృజ్జనులందుఁ బ్రసాదసౌమ్యతా
కరకరుణాకటాక్షములఁ గాని కరాళశరాళిఁ బుత్తురే. 29

రాజు—(అస్త్రము నుపసంహరించుచు) ఓ యింద్రసారథీ ! మాతలీ ! స్వాగతము.

విదూ—యజ్ఞపశువుంబోలె నన్ను జక్కాడిన వీనికి స్వాగత మిచ్చుచున్నాఁడితఁడు.

మాత—ఆయుష్మంతుఁడా ! దేవేంద్రుఁడు నీసన్నిధికి నన్ను బంపిన వృత్తాంతము వినుము.

రాజు—సావధానుఁడనై యుంటిని.

మాత—కలదు. కాలనేమిసంతతియై దుర్జయంబైన దానవగణంబు.

రాజు—తొల్లి నారదమునివలన వినియుంటిని.

మాతలి—

ఉ. తావకమిత్రుఁడా వలశతక్రతుఁడేని జయింపలేని ర
ణోద్ధతిఁ దా రణాగ్రమునఁ గొందఱ ద్రుంచఁగల్గె నిట్టివా

దీవనితోఁ జెం; భాస్కరునకైన నణఁపఁగరాని శర్వరీ
భావిమహాంధకారమును బాయఁగఁ ద్రోయఁడె చంద్రుఁడొక్కటన్.

నీవిప్పుడే శరశరాసనధారివై యీపురందర స్యందనం బారోహించి జైత్ర యాత్రఁ గావింపుము.

రాజు—ఈశతమన్యుని మన్ననచే ననుగృహీతుండనైతి కాని మాధవ్యునియెడల నీవి ట్లొనర్చుటకుం గారణం బేమి?

మాత—అదియుం జెప్పెద. ఎద్దియేని నిమిత్తాంతరంబున నాయుష్మంతుఁడు సంతప్తస్వాంతుఁడై పారవశ్యమునఁ గాన్పింపఁ గ్రోధోత్పాదనంబునకై యట్లు గావించితిని. ఏమన—

గీ. ఇంధనములఁ గదల్ప వహ్ని నెఱివెల్గు
దుడుకుఁ జేసిన భుజగంబు పడగఁ దాల్చుఁ
బ్రతిజనుండును నల్లి క్షోభంబువలనఁ
దనమహత్వంబుఁ గనుట సిద్ధంబుగాదె! 31

రాజు—యుక్తమే మీకార్యవిధానము. (జనాంతికముగా) వయస్యా! సురవల్లభుని శాసనంబు నుల్లంఘింపరాదు. కాన నీసమాచారంబుఁ దెల్పి యమాత్యపిశునునితో నామాటగాఁ బల్కుము.

క. కేవలము నీదు బుద్ధియె
సేవచ్చెడు దనుకఁ బ్రజల నెఱి నేలఁదగున్
వావిరిగ నెక్కువెట్టిన
మావిలు వేఱొక్కపనికి మైకోల్వడసెన్. 32

విదూ—నీయానచొప్పునఁ జెప్పెదను. [నిష్క్రమించును.]

మాతలి—ఆయుష్మంతుఁడా! యిట్టిటు.

రాజు—[రథారోహణంబు నటించును.]

[అందఱు నిష్క్రమింతురు.]

ఇది షష్ఠాంకము.

శ్రీ

శుభమస్తు.

ఆంధ్రీకృతాభిజ్ఞాన శాకుంతలము.

సప్తమాంకము.

(పిదప రథారూఢుండై రాజు, మాతలియు, గగనయానమునఁ బ్రవేశింతురు.)

రాజు—మాతలీ ! మహేంద్రశాసనంబు నిర్వర్తించినను దదీయ సత్కార విశేషంబున నన్ను నుపయుక్తునిగా భావించుకొనుచుంటిని.

మాత—(చిఱు నవ్వుతో) ఆయుష్మంతుఁడా ! మీ యిర్వురికిని దృప్తి లేదు.

మ. దివిజాధీశుఁడు నీ కొనర్చిన ప్రపత్తిం బెద్దగాఁ జూచుచున్
భవదీయ ప్రథమోపకారమును నల్పంబుగ నూహించు, వా
సవుఁడు న్నీదు పరాక్రమోన్నతికి నాశ్చర్యంబు పొందన్ నై
కవిధాత్రీయ సపర్యల న్మదిని లెక్కం జేయఁ డొక్కింతయున్. 1

రాజు—మాతలీ ! అటులఁ గాదు. నన్ను వీడ్కొలుపు సమయమున నాకఁ దొసఁగించిన సత్కారము తలఁపులకుఁ గూడ నగోచరంబు గదా ! సర్వగీర్వాణ సమక్షమున నన్నర్ధాసనాసీనుం గావించి.

చ. గురుగతి నంతరంగమునఁ గోరిక వీరిక లెత్తఁ జెంగటన్
వరలు జయంతుఁ గాంచి చిఱునవ్వులు వెన్నెలగాయ నిర్జరే
శ్వరుఁ డురమ్మం దలందు హరిచందన చర్చలు చిందువందఁగా
గురు తిను పారిజాత సుమ గుంభిత మాలిక వైవఁడే మెడన్. 2

మాతలి—పురందరుని వలన నీవు దేని కర్హుఁడవుగావు? చూడుము.

చ. అతి సుఖలాలసుం డగు బిడౌజసుఁ డేలు త్రివిష్టపంబు ని
ర్గత పలలాశ కంటకముగా నొనరించిన వెల్ల రెండు; సాం
ప్రతము గరాళభంగి నతపర్వముతో భవదాశుగంబు; లా
యతగతిఁ దొల్లి తాదృశముతో నరసింహ మహానఖంబులున్. 3

రాజు—ఇందు శతక్రతుని మహిమయే స్తవనీయ మైనది గదా!

చ. సమధిక కార్యభారములు సైతము భృత్యులు నిర్వహించు చం
దముఁ బరికింప నీశ్వరు లొసర్చెడు పేర్మి గుణంబు గాదె? ని
య్యమున సహస్రకరుండు తన యగ్రమునన్ నిలకొల్ప కున్న సం
తమస మొకింత కేనియు నణంచు నొకో! గరుడాగ్రజుం డొగిన్. 4

మాత—యుక్తమే యిది. (కొంచెము దూర మతిక్రమించి) ఆయుష్మంతుఁడా! స్వర్గ
ప్రతిష్ఠితం బగు నీకీర్తి సౌభాగ్య మిదే కనుంగొనుము.

చ. పొలఁతులు సిగ్గులార మయి పూఁతలు బూయుఁగ నున్న మేలి వ
న్నెలఁ గొని వేల్పు లెల్ల హవణిల్లెడు వేడ్కలఁ గల్పవల్లికా
లలిత దుకూల మండలములన్ భవదీయ చరిత్ర మర్థబం
ధ లస దుదార గీతిగ నదం దలపోసి లిఖింతు రిమ్ముడన్. 5

రాజు—మాతలీ! రక్కసుల నుక్కడంచు వేడ్కతో నిన్న దివమున కెక్కుచు స్వర్గ
మార్గంబు నభిలక్షింపనైతి కాన మన మే మరుత్పథంబున నుంటిమో తెల్పుము.

ఉ. ఎయ్యది బట్టబైటఁ బ్రవహించు వియన్నది నిల్వ మాతలీ;
నెయ్యది తేజ లేర్పడ రహిన్ నడిపించు మహార్కమండలం
బెయ్యది నిస్తమస్కృత సుపేంద్రు ద్వితీయ పదాప్తి దీప్తమౌ;
నయ్యది దేసుమీ! పరివహానిల మార్గము సుప్రసిద్ధమౌ. 6

రాజు—కాన నే గదా! బహిరంతరంగములతో నా యంతరాత్మ సుప్రసన్న మగుచున్నది. (చక్రమును జూచి) జలద వీథికిం దిగితిమి.

మాత—ఎట్లు తెలియ వచ్చుచున్నది?

రాజు—

ఉ. చాతకపాళి వెల్వడియెఁ జక్రపు టాకుల సందుగోందులన్;
బ్రాతిగఁ దేజరిల్లె హయవర్గము మించిన మించు మించులన్;
శీతల సీకరౌఘముల నేములు జెమ్మలు గ్రమ్మె; నిన్నిటన్
హా! తెలిసెన్ భవద్రథము సాంబు ఘనంబులపైఁ జరించెడున్. 7

మాత—క్షణమునకు, బిదప నాయుష్మంతుఁ డాత్మాధికార భూమి నుండఁగలఁడు.

రాజు—(క్రిందఁ జూచి) మాతలీ! వేగముగా దిగుట వలన మానవలోక మాశ్చర్యముగాఁ గానఁబడుచున్నది.

చ. వెలుపడు శైలశృంగముల వెంబడి డిగ్గనుబోలె ధాత్రి; మా
కులు దళలీనతం దొరఁగ గొబ్బున బోదెలు దోఁప; సూక్ష్మతన్
వెలయుచు నీట నొప్పు తటినీతతి మొల్లము తెల్లమయ్యె; భూ
వలయము నెవ్వఁడో యెగుర వైచిన పోలిక నన్ను డాసెడిన్. 8

మాత—బాగుగాఁ జూచితివి. (మన్ననతోఁ జూచి) ఓహో! మహీతలంబు పరిపూర్ణ రామణీయకము.

రాజు—మాతలీ! పూర్వాపర సాగరంబుల నాక్రమించి సాంధ్య మేఘంబు వోలె బంగారు రంగారు భూధరంబు గానఁబడుచుండె నెయ్యదది?

మాత—ఆయుష్మంతుఁడా! యిది హేమకూట మను కింపురుష పర్వతముగదా! తపోధనుల కిరవగు సిద్ధక్షేత్రము. చూడుము.

గీ. కమలభవ భవుఁ డగు మరీచిమునివలన
జనన మొంది సురాసుర జనకుఁ డనఁగ

నెసఁగునట్టి ప్రజాపతి యితఁడు ధర్మ
పత్నితోఁ గూడ నిందుఁ దపం బొనర్చు. 9

రాజు—కావున శ్రేయస్కముల నతిక్రమింపరాదు. భగవానునకుఁ బ్రదక్షిణ మొనర్చి పోఁ దలంచుచుంటిని.

మాత—మొదటి పక్షము. ఇదిగో ! దిగితిమి.

రాజు—(చిఱునవ్వుతో) మాతలీ !

గీ. చక్రనేముల కింత నిస్వనము లేదు
నడుచు చున్నను రజము గానంగ రాదు
కుతలమును సోక కుండ నాగుటను నీవు
తేరు దిగియును దిగినట్లు తెలియఁ బోదు. 10

మాత—ఆయుష్మంతునకు, మఘవంతున కింతియే తారతమ్యము.

రాజు—మాతలీ ! మారీచాశ్రమ మే ప్రదేశమున.

మాత—(చేతఁ జూపుచు)

చ. అలమెయి పుట్టఁ బూడ; నురమున్ దురగత్వచ నూఁగులాడఁ; బె
న్నలతిలతాప్రతాన వలయంబు బిగిం గడు నొవ్వఁగాడ; నీ
డ రుత శకుంతలక్షత జటాతతి మూపుల దోఁగియాడఁ; బ్రా
మొరదు నలెం జలింప కిటు పొద్దెదురన్ మునినిల్చు తాపసుల్.

రాజు—ఈ కష్టతపస్వికి నమస్కారము.

మాత—(పగ్గము బిగ్గఁ బట్టి) అదితి పరివర్ధిత మందార వృక్షకం బగు ప్రజాపతి యాశ్రమంబుఁ జొచ్చినారము.

రాజు—స్వర్గముకన్న మిన్న యగు సుఖస్థానము. అమృతసరసిం బోలెఁ బ్రవేశించితిని

మాత—(రథము నాపి) అవతరింపుము.

రాజు—(దిగి) నీ విఁక నెట్లు ?

మాత—రథము నరికట్టితిని. నేనును దిగెదను. (అట్లొనర్చి) ఆయుష్మంతుఁడా ! ఇట్టిటు. మహాభాగులగు ఋషీంద్రుల తపోవనభూములం బరికింపుము.

రాజు—ఆశ్చర్యముతోఁ జూచుచుంటిని.

చ. విలసిత కల్పవృక్ష వనవీధుల మారుత భోజనంబు, ను
జ్జ్వల కనకాబ్జరేణు కపిశం బగు నీటఁ బవిత్ర మజ్జనం
బలఘు మణిస్థలిన్ మనన, మచ్చరకన్నియ యొద్ద సంయమం,
బలరఁ దపింతు రీ తపసు లన్య తపఃస్పృహణీయ భూములన్. 12

మాత—మహాత్ముల మనోరథం బుత్తరోత్తరం బైనది. (పరిక్రమించి మింట) "ఓవృద్ధ శాకల్య! మారీచ భగవాను లేమొనర్పుచుండిరి! ఏమందువు? దాక్షాయణి పతివ్రతాధర్మముం గూర్చి ప్రశ్నింపఁగా మునిసతీ సహిత యగు నమ్మదితకు ధర్మోపదేశ మొనర్పు చుండె" రనియా!

రాజు—అట్లయిన నీ ప్రస్తావము తటివేచి నిల్వఁ దగినది.

మాత—(రాజుం జూచి) ఈయశోకవృక్ష మూలమున నాయుష్మంతుఁ డుపవేశించుఁ గాక! ఇంతలో నిన్ను గురున కెఱింగింప సమయము నిరీక్షించు చుండెదను.

రాజు—నీ యిచ్చవచ్చిన ట్లొనర్పుము.

మాత—(నిష్క్రమించును.)

రాజు—(నిమిత్తమును సూచించి)

క. ఫలవాంఛ లెల్ల నాముదిఁ
దలఁగె; భుజమ! యేల యీ వృథా స్పందము? తొ
ల్దొలుతన్ వదలిన శ్రేయము
మెలిపడి దుఃఖముగఁ బరిణమించుం గాదే? 13

(తెఱలో) వలదు వలదు. కుందుడుకు వలదు. ఏమి? నైజగుణము విడువ కున్నాడు.

రాజు—(చెవి యొగ్గి) అవినయంబున కిది తావుగాదు. ఈ శిక్షింపఁబడువాఁ డెవ్వఁడో గదా! (శబ్దస్థలంబుఁ బరికించి యచ్చెరువుతో) ఓహో! మౌని కాంతలచే ననుసరింపఁబడు సబాలసత్త్వుఁ డగు నీబాలుఁ డెవ్వఁడో గదా?

గీ. తల్లి చనుబాలు సగబాలుద్రావి గునియు
కొదమ సింగంబు మెడజూలుఁ బొదివిపట్టి
యాట లాడంగ రమ్మ్మ రమ్మనుచుఁ బలిమి
లాగుచున్నాఁడు వీఁడు కైలాటగాను. 14

(పిదప నుక్తరీతిగా బాలుఁడు మునికాంతలతోఁ బ్రవేశించును.)

బాలుఁడు—ఆవులింపు మావులింపుము. కొదమసింగమా! నీదంతములు లెక్కపెట్టెదను.

ప్రథమ—మొండగీడా! బిడ్డలం బోలు నీ సత్త్వములఁ బీడింతు వేమి? ఏమీ? అంతకంతకు వీని యాగడ మధికముగా నున్నది. ఔరా! ఋషిజనులు నీకు సత్త్వదమనుం డని పేరుపెట్టుట తగియే యున్నది.

రాజు—ఏమోగదా! యీ బాలకునం దౌరస పుత్త్రునందుం బోలె నా మనసు ప్రేమించు చున్నది. నిక్కముగ సంతతి లేమియే వాత్సల్యబీజము.

ద్వితీయ—సత్త్వదమనా! యీ కొదమసింగమును విడువ వేని యిదిగో దానితల్లి నీపై నురకఁ గలదు.

బాలు—అమ్మో! ఎంతో జడిసిపోతిని గదా! (పెదవిఁ జూపును)

రాజు—

క. బ్రాతిగ నీకొమరుం డను
మహా తేజోబీజ మనుచు నభిలక్షింతున్
స్ఫీతం బగు నింధన సం
ఘాతముఁ గొనఁ గల్గు వహ్నికణముం బోలెన్. 15

ప్రథమ—బిడ్డా! యీ సింగపుఁబిల్లను విడిచిపెట్టుము. నీకొక బొమ్మ నిచ్చెదను.

బాలు—ఏదీ? ఇమ్ము దానిమట్టి (చేయిఁ జాచును.)

రాజు—(చూచి యచ్చెరువుతో) ఏమీ! వీనియందుఁ జక్రవర్తి లక్షణముఁ గూడఁ గానవచ్చుచున్నది. అల్లదే! వీనికి—

చ. గొనకొని వాంఛితార్థమును గోరఁగఁ జాచిన కేలు వ్రేళ్ళ సం
దున నెడ మింత లేక సిరితోఁ దులఁదూగు సమిద్ధ రాగ మూ
తన రుచిర ప్రభాత సముదార రుచిన్ వికసించి మించి చి
క్కని దళపఙ్క్తిఁ గ్రిక్కిరియఁ గ్రాలు నవాంబురుహంబు పోలికన్.

ద్వితీయ—సువ్రతా! మాటమాత్రమున వీని నాపశక్యము గాదు. పొమ్ము. మన పర్ణశాలయందు మార్కండేయుఁ డను ఋషికుమారుని రంగు పూసిన మట్టి నెమలి గలదు. దాని వీనికిఁ దెచ్చి యిమ్ము.

ప్రథమ—అట్లే. (నిష్క్రమించును.)

బాలు—ఇంతలో దీనితో నాడుకొందును. (మునికాంతం జూచి నవ్వుచున్నాఁడు)

రాజు—ఈ మొండిగీఁడు నా మనసు వచ్చినవాఁడు కదా!

చ. అలఁతిగఁ బంటి మొగ్గలు బయల్పడు న ట్లనిమిత్త హాసముల్
దలకొన, నస్ఫుటాక్షరములౌ లలిఁ జిల్కెడు ముద్దుపల్కులం
జెలఁగ, నిజాంకపాళి నివసింపఁగ నువ్విళులూరు నట్టి పు
త్త్రుల దరిఁ జేర్చి వారి తనుధూళుల మాపగు వారలే కృతుల్. 17

తాపసి—జాణ గాఁడ! వీఁడు నన్ను లక్ష్యపెట్టఁడు (పరికించి జూచి) ఋషికుమారుల లో నెవరక్కడ? (రాజుం జూచి) భద్రముఖా! చిన్నతనముచేఁ జెంకపట్టు పట్టి వీఁడీ సింగపు బిల్లం బీడించు చున్నవాఁడు. ర మొక్కసారి విడిపింపుము.

రాజు—(చిఱునవ్వుతో సమీపించి) ఓహో! మహర్షి కుమారా!

ఉ. క్రూరత నిట్టు లాశ్రమ విరుద్ధగతిం జరియించు నీదు సం
చారముచేత జన్మ సహజం బగు సత్త్వగుణానువృత్తి నె
ప్పాటను సంయమాంబ దగునా కలుషంబుగఁ జేయ? భీతి వి
స్తారక మైన కృష్ణఫణిశాబము చందనభూజముం బలెన్. 81

తాప—భద్రముఖా! ఇతఁడు ఋషికుమారుఁడు కాఁడుగదా!

రాజు—రూపానురూప మగు వీని చేష్టయే చెప్పుచున్నది. స్థానవిశ్వాసమువలన మే మిట్లూహించితిమి. (కోరినట్లు చేయుచు బాలుని సుఖస్పర్శ మంది తనలో)

చ. అరయఁగ నీతఁ డెవ్వని కులాంకురమో? మెయిసోక నిట్లు ము
మ్మరముగ నాదు గాత్రముల మైకము గ్రమ్మెడి; నింక వీని న
క్కఱమెయి నాత్మతేజమునఁ గాంచిన ధన్యుఁడు వీని నంటి ని
ర్భరముగ నెట్టి సౌఖ్యరసవారిధిఁ దేలునొకో? ముదంబునన్. 19

తాప—(ఇరువురిం జూచి) ఆశ్చర్య మాశ్చర్యము!

రాజు—ఏమది?

తాప—ఈ బాలుని యాకృతి నీ చుట్టఱికముఁ దెల్పుచున్న దనియుఁ బరిచయము లేకున్నను నీ కితఁడు వశంవదుఁ డయ్యె ననియు నాశ్చర్యపడుచుంటిని.

రాజు—(బాలుని లాలించుచు) అయ్యగారూ! ఇతఁడు మునికుమారుఁడు గానిచో వీని వంశ మెయ్యది?

తాప—ఈతఁడు పురువంశ జాతుఁడు.

రాజు—(తనలో) ఏమి! నాకితఁడు సమాన వంశ్యుఁడా! కావుననే వీని నీమె నన్ను బోలిన వానింగాఁ దలఁపోయు చున్నది. పౌరవులకుఁ గడపటి కులవ్రత మిది గలదుగదా!

గీ. మును ధరామండలమును బాలన మొనర్చు
నందు రెవరు సుధాసిత మందిరముల
వారి కనిశానుగత పతివ్రతము లైన
భూజమూలంబులే గృహంబు లగుఁ బిదప.

(ప్రకాశముగా) ఆత్మగతిచే మానవుల కిందుఁ జొరరాదు గదా!

తాప—భద్రముఖుఁడ పల్కినట్లే, అప్సర స్సంబంధమున నితని తల్లి యీ దేవగురుని తపోవనంబునఁ బ్రసవ మైనది.

రాజు—(తనలో) అహా! ఇది రెండవ యాశాజననము. (ప్రకాశము) ఆమె యే పేరి రాజర్షి భార్య?

తాప—దారపరిత్యాగ మొనర్చు వాని పేరుఁ దలఁచువా రెవ్వరు?

రాజు—(తనలో) ఈ కథ నన్నే గుఱిచేయుచున్నదిగదా! ఇప్పు డీ డింభకుని తల్లిపే రడుగుదునా? కాదు. పరదార ప్రశంస యనార్యము.

తాప—(మట్టి నెమలిఁ జేతఁ గొని ప్రవేశించి) సర్వదమనా! శకుంత లావణ్యముం జూడుము.

బాలు—(చూడ్కి నిగిడించి) ఏదీ మాయమ్మ?

ఇర్వురు—(నవ్వి) ఈ మాతృవత్సలుఁడు నామసాదృశ్యమున భ్రమం గొందినాఁడు.

ద్వితీ—బిడ్డా! ఈమంటి నెమలి చక్కఁదనముం జూడు మని పల్కితిని.

రాజు—(తనలో) ఇతని తల్లిపేరు శకుంతలా? ఉండును గదా నామసాదృశ్యములు. ఇం దీ ప్రస్తావము మరు మరీచికం బోలె నాకు విషాదకర మగుచున్నదిగదా!

బాలు—అమ్మా! ఈ చిన్న నెమలి నాకు ముద్దు వచ్చుచున్నది. (దానిం గైకొనును.)

ప్రథ—అయ్యో! వీని మణికట్టునఁ దాయెతు కానఁబడదే?

రాజు—వలదు తొందర పడ వలదు. ఇదిగో! సింగముతోఁ బెనఁగులాడు వేళ జారి పోయినది. (తీసియీయఁ బోవుచున్నాఁడు).

ఇద్దరు—వలదు, వలదు దీని నీకట్టెట్లు పట్టి తీయఁ గలిగినాఁడు? (ఆశ్చర్యముతో రొమ్మునఁ జేయి నిడుకొని యొండొరులఁ జూచుచున్నారు.)

రాజు—ఏల వారించితిరి?

ప్రథ—మహారాజా! వినుము. ఇది యపరాజిత యను నోషధి. జాతకర్మవేళ మారీచ భగవానుఁ డితని కొసంగెను. భూపతిత మయినపుడు దీనిం దల్లిదండ్రులుఁ దానుం దక్కఁ దక్కొరులు కైకొనరాదు.

రాజు—కైకొనిన.

ప్రథము—అంత నప్పుడే సర్పమై కఱచును.

రాజు—దీని వికృతి నెప్పుడయిన మీరు ప్రత్యక్షముగఁ జూచియుంటిరా?

ఇరువు—పెక్కుసారులు.

రాజు—(సంతోషముతో) ఇప్పుడు పరిపూర్ణ మనోరథుఁడ నయ్యును నెట్లానందింపకుందును? (బాలునిఁ గౌఁగిలించుకొనుచున్నాఁడు.)

ద్వితీ—సువ్రతా! రమ్ము. ఈ వృత్తాంతమును నియమగురాలై యున్న శకుంతలకెఱిఁగింతము. (నిష్క్రమింతురు.)

బాలు—నన్ను విడువుము. నాయమ్మ దగ్గఱకుఁ బోయెదను.

రాజు—కుమారా! నాతోడనే నీతల్లి నానందింపఁ జేయఁ గలవు.

బాలు—నాతండ్రి దుష్యంతుఁడు. నీ వెవ్వరవు?

రాజు—ఈ వివాదమే నమ్మించుచున్నది.

(పిదప నేకవేణీధారిణియై శకుంతల ప్రవేశించును.)

శకుం—వికృతికాలమందు సైతముఁ బ్రకృతిం జెంది యున్న సర్వదమనుని యోషధిని వినియును నాయదృష్ట విషయమున నాకు నమ్మిక చిక్కకున్నది. లేదా! సానుమతి చెప్పిన చొప్పుననే జరుగునేమో!

రాజు—(శకుంతలం జూచి) ఓహో! ఇదిగో! మాననీయ శకుంతల.

చ. హారువతి ధూళిధూసరితమై తగు పుట్టపుదోయిఁ గట్టి ని
ష్ఠుర నియమంబునన్ మిగులఁ జిక్కిన మోమును, నేకవేణియున్
వరలఁ బవిత్రశీల వరవర్ణిని నిష్కరుణుండ నాకునై
యరమరలేక దీర్ఘ విరహవ్రతమున్ ధరియించె నెల్ల నే? 21

శకుం.—(పశ్చాత్తాప వివర్ణుఁడగు రాజుం గాంచి) ఈతఁ డార్యపుత్త్రుని వలె లేఁడే! రక్షామంగళము గల్గు నా బాలకుని గాత్ర సంసర్గమున మైలపఱచుచున్నా రెవ్వరు ?

బాల.—(తల్లిని సమీపించి) అమ్మా! ఈతఁ డెవ్వఁడో లాతివాఁడు నన్ను 'కొడు' కని కౌఁగిలించుకొనుచున్నాఁడు.

రాజు.—ప్రేయసీ! నీయెడల నే నొనర్చినది క్రౌర్య మయినను ననుకూలమై పరిణమించినది. నేనిప్పుడు నీచే నానవాలు తెలియఁబడఁ గంటిని గదా!

శకుం.—(తనలో) ఉల్లమా! ఊరడిల్లు మూరడిల్లుము. దైవము నాయెడల మత్సరము విడిచి వాత్సల్యముం బూనె. ఆర్యపుత్త్రుండే యీతఁడు.

రాజు.—

ఉ. ముద్దులగుమ్మ! సంస్మృతిని మోహతమంబు దొలంగఁ దేరు నా
యొద్దఁ గుతూహలం బొదవ నుంటివి నీవు; మహోపరాగముం
దద్దయుఁ బాసి గాంజలు సుధాంధి సన్నిధి భవ్యయోగమున్
సిద్ధపు వేడ్కఁ జెంది రవణిల్లెను రోహిణీదేవి చాడ్పునన్. 22

శకుం.—ఆర్యపుత్త్రా! జయము. (అర్ధోక్తియందు లజ్జచే బాష్పావరుద్ధకంఠియై యూరకుండును.)

రాజు.—సుందరీ!

క. జయపద మశ్రు నియంత్రిత
మయినం జయమంది నాఁడ నపసంస్కారం
బయి వెల్లఁబాఱు నాతెలి
దయివాతెఱ నీ మొగంబు దర్శించుటచేన్.

బాల.—అమ్మా! ఈతఁ డెవ్వరు ?

శకుం.—బిడ్డా! నీ యదృష్టము నడుగుము.

రాజు.—(శకుంతల పాదముల వ్రాలి,)

చ. సలలితగాత్రి! నీకు నపచార మొనర్చితి నెమ్మనంబునం
గలఁతఁ దలంగుమీ! మఱికిఁ గల్గెను నాకు విమోహ మెద్దియో
పాలయుఁ గదా! శుభంబులఁ దమోమయ చిత్తుల కిట్టి వృత్తులే
తలనిడఁ ద్రోయఁడే! కుసుమదామము నంధుఁడు సర్పశంకచేన్.

శకుం.—(కన్నీళ్లతో) ఆర్యపుత్త్రా! లెమ్ము లెమ్ము. నిక్కముగ నాసుకృతముల కవరోధ మయిన పురాకృత దుష్కృతం బా దివసములం బండబారినది. నా భువనే దయామయుం డయ్యు నార్యపుత్త్రుం డిపుడు నాయెడల వట్టివాఁ డయ్యెను.

రాజు—(లేచును.)

శకుం.—ఏడనో నార్యపుత్త్రునకు దుఃఖభాజనం బయిన యీ జన మెట్లు తలఁపునకు వచ్చెను?

రాజు—దుఃఖశల్యముం బెల్లగించి పిమ్మటం జెప్పెదను.

చ. నను దలిరాకు వాతెరకు నెవ్వ ఘటించెదు నశ్రుబిందువుల్
వెనుక నెఱుంగఁ జాలక నుపేక్ష యొనర్చితినో శుభాంగిరో!
ప్రణయము మోఁగ్ప నా కుటిల పక్ష్మముల న్నలకొన్న బాష్పముం
దనరఁగ నింకఁ బోఁ దుడిచి నా యనుతాపము నేఁడు బాయుదున్

(చెప్పినట్లు చేయుచున్నాఁడు)

శకుం.—(నామముద్రికం గాంచి) ఆర్యపుత్త్రా! ఆ యుంగరము గదా! యిది?

రాజు—మఱేమి? ఈ యుంగరము పొడగాన్పవనే తలఁపు దవిలినది గదా!

శకుం.—ఇయ్యది యార్యపుత్త్రు నమ్మించు సమయమున దుర్లభంబై విషమ మొనర్చినది.

రాజు—అట్లని, లత ఋతుసంబంధ చిహ్నమగు లతాంతముం దాల్చుఁగాక!

శకుం.—దీని నాకు నమ్మికలేదు. దీని నార్యపుత్త్రుడే ధరించుఁ గాక!

మాతలి—(ప్రవేశించి) సంతోషము. ఆయుష్మంతుఁడు ధర్మపత్నీ సమాగమంబునను, బుత్త్రముఖ దర్శనంబునను గూడ వర్ధిల్లుచున్నాఁడు.

రాజు—సువ్యాక్తసంపాదితం బగుట నామనోరథంబు రుచిర తరమై ఫలించినది. మాతలీ! యీ విషయ మాఖండలున కెఱుకపడలేదు గదా!

మాత—మహాత్ములకు బరోక్ష మెయ్యది! ఆయుష్మంతుఁడా! రమ్ము. భగవానుఁడగు మారీచమహాముని నీకు దర్శన మిచ్చుచున్నాఁడు.

రాజు—శకుంతలా! కుమారునిం బట్టుకొనుము. నిన్ను మున్నిడుకొని భగవంతునిం జూడఁ గోరుచుంటిని.

శకుం.—ఆర్యపుత్త్రునితో గురుసమీపమున కేఁగ లజ్జించుచుంటిని.

రాజు—సిగ్గుపడ వలదు. అభ్యుదయ సమయముల నిట్లొనరింప వలయు. రమ్ము.

రథము. (అందఱుఁ బరిక్రమించుచున్నారు.)

(పిదప నదితితో నాసనస్థుఁడై మారీచమౌని ప్రవేశించును.)

మారీచ—(రాజుం గాంచి) దాక్షాయణీ!

ఉ. మంతుగ నీ కుమారు రణమండలమం దితఁ డగ్రయాయి దు
ష్యంతుఁ డనం దనర్చు భువనావనదక్షుఁడు, వీని కార్ముకం
బెంతయు నాత్మకార్యముల హేల నొనర్పఁ బురందరుండు వి
శ్రాంతి శతార వజ్రముఁ గరంబునఁ దాల్చు విభూషణంబుగన్. 26

దాక్షా—ఇతని యాకృతియే ప్రభావమును వెల్లడించుచున్నది.

మాత—ఆయుష్మంతుఁడా! యీ దేవ జనకులు పుత్త్రప్రేమ సూచకంబులగు లోచనంబులతో నాయుష్మంతుని జూచుచున్నారు. కానఁ జెంగటి కేగుము.

రాజు—మాతలీ!

ఉ. ద్వాదశ రూప తేజ మొదవన్ మును లెయ్యది హేతువందు; రు
ద్రాదిలె యాగభాగచయ భర్త జగత్త్రయనాథుఁ డెడ; బ్ర
హ్మాదిమ దేవుఁ డొం దుదయ మందెను; తత్సురీచి సంభవం
బై దయివాఱె ధాత కొక యాంతరమౌ మిథునం బిదే కదా! 27

మాత—ఔను.

రాజు—(సమీపించి) మీ యుభ్వరకుం బురందర సేవకుండగు దుష్యంతుఁడు నమస్కరించుచున్నాడు.

మారీ—వత్సా! చిరకాలము ధారుణిం బరిపాలింపుము.

అదితి—అప్రతిరథుండ వగుము.

శకుం—నందనునితో మీ చరణారవిందముల కభివందన మొనర్చుచున్నాను.

మారీ—వత్సా!

ఆ. అరయఁ బ్రాణనాథుఁ డాఖండల సముండు
దనయుఁడును జయంతు సనయువాఁడు;
అన్యభంగి నెట్టు లాశీర్వదింతు ని
న్నల్ల శచిఁబోలు మమ్మ నీవు. 28

అది—బిడ్డా! భర్త్ర బహుమానముం గాంచుము. దీర్ఘాయువగు నీ నందనుండు

మారీ—ఐన నీ ప్రియసమాగమము దెలియఁ జేయ వలెను. ఎవఁడురా యచ్చట?

శిష్యుఁడు—(ప్రవేశించి) మహాత్మా! అదిగో వచ్చితిని.

మారీ—గాలవా! ఇప్పుడే గగనమార్గంబునఁ బోయి కణ్వభగవానునకు నామాటగా నీ ప్రియమును నివేదింపుము. శాప నివృత్తి కాఁగా ఉపగత స్మృతియై దుష్యంతుఁడు శకుంతలం గ్రహించె నని.

శిష్యు—భగవానుఁ డాజ్ఞాపించినట్లే. (నిష్క్రమించును.)

మారీ—వత్సా! నీవును దారాపత్య సంయుతుండవై మిత్రుఁడగు నాఖండలుని రథంబు నధిరోహించి రాజధాని కేగుదువు గాక!

రాజు—భగవాను నాజ్ఞ చొప్పననే.

మారీ—రాజుం జూచి.

చ. జనుల నినుం బురందరుఁడు సంభృతవృష్టుల మన్చుఁగాక! నీ
వును సవనాళిచేతఁ గ్రతుభుగ్వితతిన్ భరియింతుగాక! ని
య్యనువున నిర్వురున్ ద్విభువనావన సంస్తుత నిత్యకృత్యులై
కనుఁడు హితమ్ములన్ శతయుగమ్ములు సచ్చరితమ్ము లిమ్ములన్. ౮౪

రాజు—మహాత్మా! శక్తికొలఁది శ్రేయమునకై ప్రయత్నింతును.

మారీ—వత్సా! నీ కింతకన్న నేమి ప్రియముఁ జేయుదును?

రాజు—భగవాను లింతకన్నను నాయం దనుగ్రహింపఁ దలఁతురేని యిట్లగుఁ గాక!

భరతవాక్యము.

చ. జనహిత సాంద్రులై నృపతిచంద్రులు వర్తిలుచుండ్రు గాక! చె
ల్చిన శ్రుతిమాన్యతా బుధుల శారద పూజ్యతఁ గాంచుఁగాక! వి
న్ననువున వామభాగ లలనా కలనం దగి నీలలోహితుం
డనఁ బను నాస్వయంభువు నిరాకృతిఁ జేయుత! మ ద్భవాంబుధిన్.

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది సప్తమాంకము.

సంపూర్ణము.

ఇందు వచ్చు పాత్రలు.

పురుషులు.

1. సూత్రధారుడు.
2. సూతుడు—రథసారథి.
3. దుష్యంతుడు—రాజు. (కథానాయకుడు)
4. వైఖానసుడు—ముని.
5. విదూషకుడు—దుష్యంతుని చెలికాడు.
6. దౌవారికుడు
7. సేనాని.
8. ప్రథముడు } మునికుమారులు.
9. ద్వితీయుడు } మునికుమారులు.
10. కరభకుడు—భటుడు.
11. కాశ్యపుడు—శకుంతలతండ్రి.
12. శార్ఙ్గరవుడు—ఒకశిష్యుడు.
13. కంచుకి—భటుడు.
14. ప్రతీహారి—ద్వారపాలకుడు.
15. శారద్వతుడు—ఒకశిష్యుడు.
16. పురోహితుడు.
17. ఋషులు.
18. శ్యాలకుడు.
19. సూచకుడు.
20. జానుకుడు.
21. మాతలి—ఇంద్రసారథి.
22. బాలుడు—భరతుడు. (శకుంతలాపుత్త్రుడు.)
23. మారీచముని.

స్త్రీలు.

1 నటి.
2. శకుంతల—కథానాయిక.
3. అనసూయ. } శకుంతలచెలికత్తెలు.
4 ప్రియంవద. } శకుంతలచెలికత్తెలు.
5. గౌతమి—వృద్ధతాపసి.
6. తాపసులు—మునికాంతలు.
7. సానుమతి—అప్సరస్త్రీ.
8. చతురిక—పరిచారిక.
9. యవనిక.
10. ప్రథమ } మునికాంతలు.
11 ద్వితీయ } మునికాంతలు.
12. అదితి—దాక్షాయణి.

సందర్భానుసారముగ మఱికొందఱు వత్తురు.

4. తిరుపతి వేంకటేశ్వరకవులు, శతావధానులు.

ఆంధ్రీకృతమగు తమ యుత్తరరామచరిత నాటకమును స్థాలీపులాకన్యాయముగాఁ బఠించి యానందించితిమి. ఇంతవఱ కాంధ్రీకృతమగు నాటకములలో నిది యగ్రగణ్యమని తలంచుచున్నాము. 'ఉత్తరే రామచరితే భవభూతిర్విశిష్యతే' అని ప్రసిద్ధి వడసిన యీ నాటకరాజము నింతచక్కని తెనుఁగులముగా మార్చుట కష్టసాధ్యము. కావున 'క్లిష్టస్యగర్వశ్చాపి నియామ' యను న్యాయము నట్టి సంతసించవలసియుండును.

5. కల్లువలపల్లి రంగనాథశాస్త్రిగారు.

క. పలువురు తెలిఁగింపులఁగని
పలుతితవంబునను మిగుల పన్నుగఁ గొల్లన్
బలి యుత్తరరామచరితముఁ
దెలిఁగించెఁ భుజంగరావు దివ్యస్మృతితోన్. 1

క. భవభూతి హృదయ మెఱుఁగన్
లవమాత్రము దప్పనీక లాలిత్యము గ్రం
దవిరి తెనిఁగించఁగ దర
మవునే, వలఁతులకుఁ బోలె నన్యులకారా ! 2

6. వేదము వేంకటరాయశాస్త్రిగారు.

నేను పఠించిన ప్రతిభాగమును మూలముతోఁ బరికించి నుడివితిని. అన్నిడు మధురముగ తెలిఁగింపఁ బడినదని చెప్పుటకు మిక్కిలి సంతసించుచున్నాఁడను. అయ్యదియును భవభూతి యొక్క కవితాసామర్థ్యమును సంపూర్ణముగ ననుకరించుటచేఁ ఘూనయా శ్రీకరణము మిక్కిలి స్తోత్రపాత్రమయినది.

7. కాశీనాధుని వీరమల్లయ్యకవిగారు.

చ. ఉరుభవభూతి వాగ్విభవమహోత్తరరామచరిత్ర నాటకా
మృగసము గ్రోలనెంచి కవి యంధరసుంధుము పూఁగిడుందో దొగం
దు, గజముఁజెమ్మె, నొక్కఁడు కదుంగాకెమున్నె, భుజంగనామకా
శిరసము తెల్లఁ దీర్చుబట్టి కృత చాతురినొప్పఁగ నాటకిన్,

8. దోమా వెంకటస్వామిగుప్తగారు, శతావధాని.

ఇంతవఱకిట్టి భాషాంతరీకరణ మొకండు లేని కొఱంత యాంధ్రభాషకుండెడిది. కాని యిప్పుడీ యష్టావధాని శ్రీరాజా భుజంగరావుగారి యీకృతివలన నాకొఱంత దీరినది.

9. న్యూఇండియాపత్రిక.

ఈకవి భవభూతియొక్క రచనా చమత్కృతిని, ఆంధ్రభాషలోఁ బ్రదర్శింపఁ బ్రయత్నించి తన్నిర్వహణమున సంపూర్ణవిజయమును గాంచెనని మా నమ్మకము. ఆంధ్రీకరణమునఁగూడ నీనాటకము శిరోభూషణముగనున్నది. ఆదినుండి యంతమువఱకు నీగ్రంథము సుబోధకమగు గ్రాంథికభాషతో నిండియున్నది. ఆంధ్ర భాషాభిమానులందఱును, ఈకవికి కృతజ్ఞులై యుండవలెను.

10. భార్గవరం శ్రీరామశర్మగారు.

క. ఉత్తరరామచరిత్రకు
నుత్తమ శృంగార రౌద్రయుతకరుణారసం
పత్తి నెనయు రసయుతమై
తత్తద్ఘట్టములయందు దగె నాంధ్రోక్తిన్.

భారతి ప్రెస్ హౌస్, ఏలూరు.

ఆంధ్రనాటకములు.

———:o:———

శ్రీరాజా భుజంగరాయ కవికృతములు.

శశిరేఖానాటకము:—ఆరవకూర్పు. ఇంతవఱకు 12000 వేల ప్రతులు ఖర్చుపడినవి. నటనానుకూలము. అనేక కంపెనీలవారిచే నాడబడుచున్నది. నృత్యానుకూలములగు హిందూస్థానీ ఫారసీమట్టులుగల కీర్తన లనేకము లిందుగలవు. కథ భారతకథ. వెల రు 0-6-0.

ఉత్తరరామచరిత్రము:—భవభూతిసంస్కృత నాటకమునకు సరియైన తెనుగు. పండితపామరుల నేకులు దీనిం జదివి యానందభరితులగుచున్నారు. కావున దీనిని చదువనివా రుండరాదు. ఇందలి పద్యములు కేవలము రత్నగుళికలు. సీతాదేవివిలాపము, శ్రీరాముని విరహవేదన, లవకుశుల వీరము మున్నగు రసము లతి చమత్కారముగ నిందు పొందుపరుపబడినవి. నటనానుకూలము. వెల రు 0-12-0.

అభిజ్ఞానశాకుంతలము:—ప్రపంచమునం దంతటను ప్రసిద్ధిగాంచిన యీనాటకము నెఱుంగనివాఁడుండఁడు. కాళిదాసు సంస్కృతమున దీనిని రసవంతముగ రచియించెనో, ఆంధ్రమునఁగూడ యిది యంత రసవంతముగ రచింపబడినది. శకుంతల దుష్యంతులవిరహములు, వారి ప్రేమాతిశయములు చదువరుల నానందాబ్ధిని ముంచి తీయును. వెల రు 0-12-0.

చారుమతీపరిణయనాటకము:—ఇది యొక యాంగ్ల నాటకము ననుసరించి వ్రాయబడినది. (Shakespeare's As you Like it.) ఇది శృంగార రస ప్రధానంబగు నాటకమగుటచే, చదువరులకు నానందము కలిగింపకపోదు. ఇందలి అత్యద్భుతమగు కథ, స్త్రీల చిత్రసంభాషణలు, వారి ప్రేమాతిశయములు, విరహవేదనాది శృంగారచేష్టలు మిగుల హృదయరంజకముగ నుంచియున్నవి. చదివితీరవలసిన గ్రంథము. నటనానుకూలము. వెల రు 0-12-0.

ప్రసన్నరాఘవ నాటకము:—సంస్కృతమునకు సరియైన తెనుగు. రామాయణగాథయంతయు నతిరమ్యముగ వివరింపబడియున్నది. ఇహపరసౌఖ్యదాయకముగ నుండుటయేగాక, భాషామతల్లికి నలంకారముగ కూడ నుండియున్నది. నటనానుకూలము. వెల రు 0-12-0.

శాంతి ప్రెస్ హౌస్, ఏలూరు.

MOST BEAUTIFUL DETECTIVE TALES.

సాహసాంకుని విజయగాథలు.

అద్భుతమగుకథలు.

శ్రీరాజా భుజంగరాయ కవి ప్రణీతము.

మనదేశమున చోరులబాధ అనుదినము హెచ్చుచున్నదను విషయము ఎల్లరకు తెలిసియేయున్నది. అట్టిబాధను కొంతవరకైన తగ్గించుకొనవలయునని గూఢచారుల చరిత్రములను మనయువతియువకులకును నేరస్థుల నతి నిపుణతతో కనిపెట్టిన గూఢచారులచర్యలాంధ్రమున నింతవరకెవరును వ్రాసియుండలేదు. అట్టి గ్రంథములలోటును తీర్చుటకై సాహసాంకుని విజయగాథలు అను సీరీసును ప్రారంభించి యిదివరలో రెండుగ్రంథములను ప్రకటించినాము. అందు దొంగల మాయోపాయములు, క్రూరకృత్యములు, గూఢచారులు దొంగలను పట్టుకొనుటకై చేయు నుపాయములు, దొంగలచేతులలో చిక్కినపుడు తప్పించుకొను నుపాయములు, మున్నగు ననేకవిషయములిందు కథాసందర్భమున పొందుపరుపబడియున్నవి. కావున దేశాభిమానులందరు వీనినిచదివి యిందలి విషయముల గ్రహించి, అవసరసమయములలో నీయుపాయముల వాడిచూడ ప్రార్థించుచున్నాము :—

1. అగ్గిరాముని మరణవేదన. (అద్భుతకథ) ... 0-8-0
2. హైరావణుడు (అద్భుతకథ) ... 0-8-0
3. కలియుగరావణుడు. (అచ్చులోనున్నది) ... 0-4-0

దేశోద్ధారకుల చరిత్రములు.

శ్రీరాజా భుజంగరాయ కవికృతములు.

[పద్యకావ్యములు.]

గోపాలకృష్ణ గోఖలేచరిత్రము.

స్వార్థత్యాగియై, దేశసేవయే పరమావధిగా నెంచి, 33 కోట్ల భారతీయుల సౌఖ్యమే తనసౌఖ్యమని నిరంతర కృషివలన దేశప్రఖ్యాతి గాంచిన శ్రీ గోపాలకృష్ణ గోఖలేగారి చరితామృతమును ఆంధ్రులు గ్రోలుటకై, మృదు మధుర శైలిని యీ గ్రంథము సుబోధక పద్యకావ్యముగ రచింపబడినది. దీనిం జదివినవారికి రాజకీయ విషయము లనేకములు సుబోధకములగుటయేగాక, భాషాకౌశలమును గూడ నలవడ గలదు. వెల రు 0-4-0.

భారతీ వేర్ హౌస్, ఏలూరు.

దాదాభాయి నౌరోజీచరిత్రము.

దాదాభాయి నౌరోజీగారి పేరు నెరుంగని వారీ భారతమండలమున నుండరు. సీమకేగి భారతీయుల కష్టముల నివారించుటకై వారు సలిపిన కృషి భారతీయులు మరువరు. ఇట్టి మహామహుని జీవితమును అందఱుచదివి యానందింతురను తలంపున సుబోధక పద్యకావ్యముగ వ్రాయబడినది. దీనిని చదువుటచే, రాజకీయ విషయము లనేకములు సుబోధకములగు ననుటకు సందియము లేదు. వెల 0-4-0.

ఆధునిక కవిజీవితములు.

ప్రస్తుతకాలపు కవులజీవితములు, వారి రచనా మాధుర్యములు ఆంధ్రప్రపంచమున కవసరమై యుండుటచే విశేష శ్రమపడి యీగ్రంథము తయారు చేసినారము. 500 పేజీల గ్రంథము. వెల రు 1-8-0.

బైబిలు పద్యకావ్యము.

శ్రీరాజా భుజంగరాయ కవికృతము.

ప్రపంచమునంగల మతములు పెక్కులు. సర్వ మతానుసారమును గ్రహించుట మనకు ముఖ్యము. కావున ఎల్లరును దీనిని చదువవేడుచున్నాము.

మత్తయిసువార్త	పద్యకావ్యము	...	0—4—0
మార్కుసువార్త	,,	...	0—4—0
లూకాసువార్త	,,	...	0—4—0
యోహానుసువార్త	,,	...	0—4—0
అపోస్తలుకార్యములు	,,	...	0—4—0
రోమీయులు	,,	...	0—2—0
గలతీయులు	,,	...	0—0—6
నీతివాక్యరత్నావళి Sermon on mount	,,	...	0—0—6
సత్క్రైస్తవశతకము.	,,	...	0—1—[illegible]
క్రీస్తుమతసారము.	,,	...	0—0—
క్రైస్తవ గూఢార్థప్రదీపిక.	వచనము.	...	0—4—0
Inner Doctrines of Christianity.	,,	....	0—8—0

క్రొత్తనిబంధన, పద్యకావ్యము.

శ్రీ రాజా భుజంగరాయకృతము.

క్రొత్తనిబంధనను సంపూర్ణపద్యకావ్యముగ నొక గ్రంథముగా ముద్రింపుచున్నారము. గ్రంథములు బహుస్వల్పముగా తయారగుచున్నవి. వలయువారు ముందుగనే దరఖాస్తులనంపి ఆర్డర్లు రిజస్టరు చేయించుకొన గోరెదము. వెల రు 1-0-0.

భారతీ వేర్ హౌస్, ఏలూరు.